శుక్రవారం
11•08•2017

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I
KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

హైదరాబాద్ • వెల.5 రూ. • సంపుటి 7 • సంచిక 65 • పేజీలు : 18 + 24

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



గురువారం పోచంపాడ్‌లో నిర్వహించిన సభకు పెద్దసంఖ్యలో హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



గురువారం నిజామాబాద్ జిల్లా పోచంపాడ్‌లో ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి శంకుస్థాపన చేస్తున్నసీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా ఉన్నారు.



జీవధారల తెలంగాణ

వచ్చే ఏడాదికి ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పూర్తిచేస్తాం

- కాళేశ్వరం నీళ్లతో శ్రీరాంసాగర్ నింపుతాం
- ఆరునూరైనా 45 లక్షల ఆయకట్టుకు సాగునీరందిస్తాం
- ఈ కట్టపై నాటి ఆవేదనే నా రాష్ట్రసాధన ఉద్యమం
- నేడు సొంత రాష్ట్రంలో ఎస్సారెస్పీ పునర్జీవ పథకం
- జన్మధన్యమైందన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు
- తాను మోతె గ్రామం పెట్టిన మొగ్గ అని వ్యాఖ్య

ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పైలాన్ ఆవిష్కరించిన సీఎం

స్వయంగా మట్టి తవ్వి పనులకు ప్రారంభం

- ప్రాజెక్టులు అడ్డుకుంటున్న కాంగ్రెస్‌ను నిలదీయండి
- కాంగ్రెస్ దుర్నీతికి నిదర్శనం కొండపోచమ్మపై కేసులు
- 4600 ఎకరాల భూసేకరణకు 90 ఎకరాలు ఆపారు
- సినిమా షూటింగ్‌లు జరిగేలా ఎస్సారెస్పీని తీర్చిదిద్దుతాం
- భవిష్యత్తులో ప్రాజెక్టు నుంచి బాసరకు లాంచీ
- ఆడబిడ్డలకు వడ్డీలేని రుణాల ప్రతిపాదనను పరిశీలిస్తాం
- పోచంపాడ్ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మరో సువర్ణాధ్యాయం పుటలు తెరుచుకున్నది. యావత్ తెలంగాణలోని కోటి ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్న ప్రభుత్వ సంకల్పంలో ఒకే ప్రాజెక్టు నుంచి దాదాపు 40-45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బృహత్తర లక్ష్యానికి నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ వద్ద అంకురార్పణ జరిగింది. ఉత్తర తెలంగాణకు వరప్రదాయినిగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టును ఆచరణలో కూడా అద్భుత వనరుగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన పునర్జీవ పథకానికి లక్షలమంది రైతులు, ప్రజల సమక్షంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గురువారం శంకుస్థాపన చేశారు. రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ సాధన ఉద్యమానికి తనను పురికొల్పిన ఎస్సారెస్పీ కట్టపైనే రాష్ట్ర సాధన ఫలితాన్ని చాటిన ముఖ్యమంత్రి.. ఏడాదిలోపు పూర్తయ్యే ఈ పథకం సృష్టించే నాలుగు జలధారలతో తెలంగాణ రైతు మొగులుకు ముఖం పెట్టి చూడాల్సిన దుస్థితి తొలిగిపోనుందని ప్రకటించారు!

వివరాలు 2, 3, 6, 8వ పేజీలలో

"ఎస్సారెస్పీలో ఇప్పుడు ఎనిమిది టీఎంసీలు ఉన్నయి. ఈ సంవత్సరం ఒక్క చుక్క రాలె. ఇదే పరిస్థితి ఉంటె మన గతి ఏం కావాలె? దానికోసం బ్రహ్మాండంగా ఆలోచించి సంవత్సర కాలంలో నీళ్లు తెచ్చే ప్లాన్ చేసినం. ఇక్కడ ఉన్నది గోదావరే.. కాళేశ్వరం దగ్గర ఉన్నది కూడా గోదావరే. అందుకే కాళేశ్వరం దాటిన తర్వాత మేడిగడ్డ వద్ద ఒక బరాజ్ కట్టుకొని, దాని తర్వాత అనేక బరాజ్‌ల ద్వారా వరద కాల్వలో నీళ్లు పోసుకొని శ్రీరాంసాగర్ నింపుకొనే కార్యక్రమాన్ని చేపడుతున్నం.

కొట్లాట నా ఒక్కనిదే కాదు. ప్రభుత్వానిది మాత్రమే కాదు. మనందరి తెలంగాణ రైతుల బతుకుదెరువు. 'ఎందుకు మీరు సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకుంటున్నరు?' అని ప్రజలు ఎక్కడికక్కడ కాంగ్రెస్ నాయకులను నిలదీయాలె. మౌనం పాటిస్తే నష్టపోయే ప్రమాదమున్నది. 'మీ దురాగతాలు మంచివి కావు.. తెలంగాణను అభివృద్ధి కానీయండి.. ప్రాజెక్టులు రానీయండి' అని కాంగ్రెస్ నాయకులకు చెప్పండి.

– పోచంపాడ్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్



గురువారం నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ వద్ద శ్రీరాంసాగర్ పునర్జీవ పథకానికి శంకుస్థాపన చేసిన అనంతరం సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్. వేదికపై డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఈటల రాజేందర్, హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డి, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు, జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొప్పుల ఈశ్వర్, ఎంపీలు డీ శ్రీనివాస్, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, కల్వకుంట్ల కవిత, బీబీ పాటిల్, ఎమ్మెల్యే సీహెచ్ రమేశ్‌బాబు, టీడబ్ల్యూఆర్డీసీ చైర్మన్ వీ ప్రకాశ్, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి వేణుగోపాలాచారి తదితరులు

జీవధారల తెలంగాణ

ఆరునూరైనా 45 లక్షల ఎకరాలకు సాగునీరు: ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ప్రారంభోత్సవ సభలో సీఎం కేసీఆర్



శ్రీరాంసాగర్ పునర్జీవ పథకం పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీలు డీ శ్రీనివాస్, వినోద్‌కుమార్, కవిత, బీబీ పాటిల్, మిషన్‌భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, రసమయి బాలకిషన్, బాజిరెడ్డి గోవర్ధన్, ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఆకుల లలిత, రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి వేణుగోపాలాచారి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి న్యాయంచేస్తానని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కట్ట మీద 1996లో చెప్పిన తాను.. ఇప్పుడు సాధించుకున్న రాష్ట్రంలో సీఎం హోదాలో ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి శంకుస్థాపన చేశానని, దీనితో తన జన్మధన్యమైందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చెప్పారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి నిజామాబాద్ జిల్లా పోచంపాడ్‌లో గురువారం ఆయన శంకుస్థాపనచేశారు. స్వయంగా మట్టి తవ్వి.. పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. తనలాంటి అదృష్టవంతులు చాలా తక్కువమంది ఉంటారన్న సీఎం.. తనకంటే గొప్ప అదృష్టవంతులు ఈ భూమ్మీద ఉండరని సంతోషాన్ని వ్యక్తం చేశారు. రెండు, మూడు నెలలు అటుఇటుగా వచ్చే ఏడాది ఎస్సారెస్పీని కాళేశ్వరం నీళ్లతోటి నింపడం ఖాయమని ప్రకటించారు. 40– 45 లక్షల ఎకరాలకు ఎస్సారెస్పీ ద్వారా నీళ్లు ఇస్తామని చెప్పారు. ఒక్కసారి ఎస్సారెస్పీ నింపుకొన్నమంటె ఇటు నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల అటు జగిత్యాల రైతాంగానికి రెండు పంటలు పండించుకునే అదృష్టం వస్తదన్నారు. ప్రజల ఆశీర్వాదం, అండదండలు ఉన్నంతకాలం బ్రహ్మాండంగా ముందుకుపోతామన్న ఆయన.. సాగునీటి ప్రాజెక్టులను అడుగడుగునా అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ప్రసంగం ఇలా సాగింది.

తెలంగాణతోటే పునర్నిర్మాణం

2001లో గులాబీ జెండా ఎగిరిన తర్వాత జల సాధన ఉద్యమం చేసినం. అందులో నేను మాట్లాడిన క్యాసెట్‌లో 'ఇచ్చంపల్లి ఇచ్చగానిపల్లి పాల్జేసినారు.. నిజాంసాగర్ ఒట్టిపోయింది.. మెదక్ జిల్లా ఘనపురం నాశనమైంది.. అప్పర్ మానేరు అడుగంటింది.. డిండిలో బండలు తేలినయి.. కోయిల్‌సాగర్‌ను కొంగ లెత్తుకుపోయినయి.. చెరువులన్నీ తాంబాళాలై నాశనమైపోయినవి' అని చెప్పిన. పదిహేనేండ్ల సుదీర్ఘ పోరాటంలో అనేక బలిదానాలు, జైళ్లు, లాఠీలు, తూటాలు, కేసులు అనేక ఇబ్బందుల తర్వాత తెలంగాణ సాధించుకున్నం. తెలంగాణ వచ్చే నాటికి పరిస్థితి చూస్తే.. 'తెలంగాణకు ఇచ్చినం, తెలంగాణకు చేస్తం' అని చెప్పినవన్నీ కూడా మోసపూరిత ప్రాజెక్టులు. మనకు నీళ్లు వచ్చేవి కావు, తెచ్చేవి కావు.

ఉత్తర తెలంగాణలో నాలుగు జీవధారలు..

హైదరాబాద్ నుంచి ఉత్తరం వైపు నిలబడి ఉత్తర తెలంగాణ చూస్తే ఏం తెలంగాణ తయారుకాబోతున్నదో తెలుస్తది. హైదరాబాద్ నుంచి ఉత్తరంవైపు చూస్తే ఆదిలాబాద్ జిల్లా కనబడుతది. కాశ్మీర్‌లాగ ఉండే పాత ఆదిలాబాద్ ఇప్పుడు నాలుగు జిల్లాలైంది. ఆ జిల్లాలో భగవంతుడు ఇచ్చిన 12 ఇంచుల వర్షపాతం ఉంది. సుద్దవాగు, స్వర్ణవాగు, మట్టివాగు, గొల్లవాగు, నీల్వాయి వాగు వంటివి అనేకం ఉన్నయి. లోయర్ పెనుగంగ ఉంది. అంతకుముందు 'లోయర్ పెనుగంగ ఇగ వచ్చె, అగ వచ్చె' అని మోసం చేసినరు. 35 ఏండ్లు ఓట్లు అడిగినరు.. తప్పు చేయలె. కానీ ఈరోజు ఆదిలాబాద్ మీడియం ఇరిగేషన్ వ్యవస్థను బాగుచేస్తున్నం. ఎస్సారెస్పీ నుంచి నీళ్లు ఎత్తిపోసి నిర్మల్ జిల్లాను సస్యశ్యామలం చేస్తం. మంచిర్యాల జిల్లాకు కూడా నీళ్లొస్తయి. అట్ల ఎత్తిపోతలు, వర్షపాతం, వాగుల ద్వారా ఆదిలాబాద్ జిల్లా ఒక జీవధారగా కనిపిస్తది.

రెండో జలధార..

గోదావరి నది మీద తుపాకులగూడెం, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల, సదర్‌మాట్ వద్ద బరాజ్‌లు కట్టుకుంటున్నం. గోదావరి నదిలోనే దాదాపు 70–80 టీఎంసీల నీళ్లు సంవత్సరం పొడవునా నిండి ఉంటయి. 200 కిలోమీటర్ల గోదావరి ఎల్లపుడూ నీటితో నిండి ఉంటది. గోదావరి నది తనకు తానుగా ఒక జీవధారగా ఉంటది.

మూడో జీవధార..

గోదావరిదాటి ముందుకొస్తే వరద కాల్వ. దీనితోటి శ్రీరాంసాగర్, శ్రీరాంసాగర్‌ద్వారా నిజామాబాద్, నిర్మల్, కాకతీయ కాల్వ, లోయర్, మిడ్ మానేరు డ్యాంలు.. ఇలా వరంగల్, మహబూబాబాద్ దాటి సూర్యాపేట, తుంగతుర్తి దాకా ఒక జీవధారగా ఉంటది.

నాలుగో జీవధార..

మిడ్ మానేరు నుంచి పంప్ చేసిన తర్వాత మధ్యలో అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్.. ఆపైకి నింపుకొనే సింగూరు, నిజాంసాగర్, బస్వాపూర్, గంధంమల్ల, హైదరాబాద్‌ను దాదాపు ఆనుకొని నాలుగో జీవధార తయారైతది.

నీళ్లిచ్చే ఉద్దేశంతో మొదలుపెట్టిన ప్రాజెక్టులు కావు. దానికోసం మొదటి దశలో చెరువులన్నీ బాగు చేసుకుందామని సంకల్పించాం. సులభంగా చేసుకునేది, డిజైన్లు అవసరంలేనిది కాబట్టి మిషన్ కాకతీయ రూపంలో ఆ కార్యక్రమాన్ని ముమ్మరంగా ప్రారంభం చేసుకున్నం. ఒక ఆర్నెల్లు, ఎనిమిది నెలలు అవిరళమైన కృషిచేసి, రాత్రింబవళ్లు కష్టపడి, గోదావరి, కృష్ణా నదులనుంచి ఏ రకంగా నీళ్లు తీసుకోవాల్నో ఆలోచన చేసినం.



శంకుస్థాపన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు కూడా ఉన్నారు.

ఇదే కట్ట మీద చెప్పిన..

నిర్మల్ నియోజకవర్గంలో 1996లో ఒక ఉపఎన్నిక జరిగింది. మిత్రుడు వేణుగోపాలాచారి కేంద్రమంత్రి అయినందున ఆనాడు రాజీనామా చేస్తే వచ్చిన ఆ ఉప ఎన్నికలో అభ్యర్థిని గెలిపించడానికి నేను, ఇప్పటి నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి నిర్మల్‌కు వచ్చినం. ఒకరోజు సమయం దొరికినపుడు మన ప్రాజెక్టు అనే ప్రేమతో నిర్మల్ నుంచి ఎస్సారెస్పీ కట్టమీదకొచ్చినం. అక్కడ గేట్లకు గ్రీసు లేదు, ఆయిలింగ్ లేదు. సిలుం పట్టినయి. ప్రాజెక్టు కట్టమీద ఉండే రోడ్డు గజం గజం లోతు గుంతలు. ఒక దగ్గర కూలబడినపుడు చెప్పిన.. 'ఆంధ్రాకు నీళ్లు తీసుకుపోయే నాగార్జునసాగర్ వైష్ణవాలయంలాగ ధగధగలాడుతున్నది. ఇది తెలంగాణ ప్రాజెక్టు కాబట్టి అయ్యకు పట్టది.. అమ్మకు పట్టది.. అందుకే శివాలయంలాగ ఉన్నది' అని చెప్పిన. ఆనాడు నాతోపాటు కట్టమీద ఉన్న నిర్మల్ మండలాధ్యక్షుడు సత్యనారాయణగౌడ్‌తో అప్పుడే చెప్పిన.. ఆంధ్రప్రదేశ్ ఉన్నన్ని రోజులు ఎవ్వలంకూడా ఏం జేయలేం.. మన ఖర్మ ఇంతేనని చెప్పిన. గంటసేపు చెప్పిన. మరి ఏమైతది సర్ తెలంగాణ గతి అని ఆయన అడిగిండు. నేను చెప్పిన.. అన్యాయం ఎక్కువైనచోట భగవంతుడు కూడా సహించడు. ప్రజలు అస్సలు సహించరు.. తిరుగుబాటు వస్తది.. మళ్లా తెలంగాణ ఉద్యమం వచ్చి తీరుతదని చెప్పిన. అంతేకాదు.. నేను బతికి ఉంటే, నా ఆరోగ్యం సహకరిస్తే ఈసారి తెలంగాణ ఉద్యమం నేనే ప్రారంభిస్త, నేనే చివరిదాకా కొట్లాడుతానని చెప్పిన. ఇదే శ్రీరాంసాగర్ కట్ట మీద 1996లో నేను స్వయంగా చెప్పిన. ఈ రోజు నిజంగా నాలాంటి అదృష్టవంతులు చాలా తక్కువ మంది ఉంటరు. ఏ శ్రీరాంసాగర్ కట్టమీద నేను ఉద్యమం చేస్త.. తెలంగాణ సాధిస్త.. తెలంగాణకు న్యాయం చేస్త.. అని చెప్పిన్నో.. అదే మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రం సాధించి.. రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో శ్రీరాంసాగర్ పునర్జీవ పథకానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చిన.. నా జన్మ ధన్యమైంది.

ఎస్సారెస్పీ బాగు కోసమే ఈ పథకం..

ఆంధ్రావాళ్లు ఎన్నడూ మనకు నీళ్లియ్యాలని ఏ ప్రాజెక్టు పెట్టలె. ఎస్సారెస్పీదీ అదే పరిస్థితి. శ్రీరాంసాగర్ 14 లక్షల ఎకరాలకు నీళ్లిస్తమని చెప్తే ఎన్నడూ ఐదున్నర లక్షలు దాటలె. కొస కాల్వలకు పోనేలేదు. అక్కడ చెట్లు మొలిచినయి. నల్లగొండ జిల్లాలో కాల్వలు తవ్వి కాంట్రాక్టర్లు డబ్బులు తీసుకుపోయినరు. కానీ అక్కడికి నీళ్లు పోలె, నీళ్లు కండ్ల చూడలె. పోయినేడాది మనం కష్టపడి కొంతమేర నీళ్లు తీసుకుపోగలిగినం. ఎస్సారెస్పీ ఆయకట్టు బ్రహ్మాండంగా బాగుపడాలె. లక్ష్మీకాల్వ, సరస్వతి కాల్వ బ్రహ్మాండంగా బాగుపడాలని పథకం రూపకల్పన చేశాం.

ఇక మొగులు ముఖం చూసేది లేదు...

ఎస్సారెస్పీలో ఇప్పుడు ఎనిమిది టీఎంసీలు ఉన్నయి. ఈ సంవత్సరం ఒక్క చుక్క నీళ్లు రాలె. ఇదే పరిస్థితి ఉంటె మన గతి ఏం కావాలి? దానికోసం ఆలోచించి బ్రహ్మాండంగా ఈ పథకాన్ని రూపకల్పన చేసినం. అతితక్కువ కాలంలో అంటే సంవత్సరం కాలంలో నీళ్లు తెచ్చే కార్యక్రమం చేస్తా ఉన్నం. ఇక్కడ ఉన్నది గోదావరే.. కాళేశ్వరం దగ్గర ఉన్నది కూడా గోదావరే. అందుకే కాళేశ్వరం దాటిన తర్వాత మేడిగడ్డ వద్ద ఒక బరాజ్ కట్టుకొని, దాని తర్వాత అనేక బరాజ్‌లద్వారా వరద కాల్వలో నీళ్లు పోసుకొని శ్రీరాంసాగర్ నింపుకొనే కార్యక్రమాన్ని చేపడుతున్నం. ఎస్సారెస్పీలో ఎనిమిది టీఎంసీలు గతంలోనివే ఉంటే ఈ సంవత్సరం ఒక్క టీఎంసీ రాలేదు. కానీ కాళేశ్వరం మేడిగడ్డ వద్ద జూన్‌లో వర్షాకాలం మొదలైనప్పటినుంచి ఇప్పటివరకు 250 టీఎంసీల నీళ్లు గంగలో కలిసిపోయినయి.. సముద్రానికి పోయినయి. అదే.. సిస్టం తయారై ఉంటే మనం శ్రీరాంసాగర్ నింపుకొనేవాళ్లం. మొగులుకు ముఖం చూసేవాళ్లం కాదు. మొట్టమొదట నేను నిజామాబాద్ వచ్చినప్పుడు నన్ను మొగ్గ తొడిగి ఇచ్చింది మోతె. వాళ్లిచ్చిన ధైర్యంతోనే పోయినం. ఆనాడు మోతెలో మట్టి ముడుపుగట్టుకోని పోయి, మళ్లీ తెలంగాణ సాధించి, అదే మోతె మట్టిని మళ్లీ తీసుకెళ్లి గ్రామస్థులకు అప్పగించిన. అట్ల జరిగిన ఉద్యమంలో ఇయ్యాల బ్రహ్మాండంగా మనం ముందుకు పోతాఉన్నం. వచ్చే సంవత్సరంనాటికి రెండు మూడు నెలలు అటూఇటూ కావచ్చు.. కానీ.. ఎస్సారెస్పీని కాళేశ్వరం నీటితో నింపడం ఖాయం. మీ బిడ్డగా నేను ఆ పని చేసి చూపిస్త. ఒక్కసారి ఎస్సారెస్పీని నింపుకొన్నమంటే ఇటు నిజామాబాద్ జిల్లాగానీ, నిర్మల్ జిల్లాగానీ, కిందికి మంచిర్యాల జిల్లా, జగిత్యాల జిల్లా రైతాంగానికి రెండు పంటలు పండించుకునే అదృష్టం వస్తది. బ్రహ్మాండంగా పంటలు పండిచుకొని ముందుకు పోతం.

అన్యాయాన్ని సరిచేస్తున్నం..

ఎస్సారెస్పీకి జవహర్‌లాల్ నెహ్రూ పునాది రాయి వేసి 54 ఏడ్లు గడిచిపోయింది. నాగార్జునసాగర్ మొదలుపెట్టంగనే 12 ఏండ్లలో పూర్తిచేసినరు. నెహ్రూ శంకుస్థాపనచేస్తే ఇందిరాగాంధీ ప్రారంభించినరు. కానీ 54 ఏండ్ల తర్వాతకూడా ఎస్సారెస్పీ స్టేజ్–1, 2 కంప్లీట్ కాదు. స్టేజ్–3కి పోయే పరిస్థితి లేదు. వరద కాల్వ దుస్థితి అట్లనే ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ తెచ్చుకున్నం. వీటన్నింటినీ ఆగమేఘాల మీద పూర్తిచేసి నీళ్లియ్యాలని విశ్వప్రయత్నం చేస్తున్నం. శ్రీరాంసాగర్ నింపే పరిస్థితి.. చాలామందికి దానిపై అవగాహన లేదు. ఎప్పుడో జూన్‌లోనో జూలైలోనో నింపుకోవడం కాదు.. రాబోయే రోజుల్లో ఒక్కసారి మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌లు పూర్తయితే ఎస్సారెస్పీని మే నెలకు ముందే.. ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే పూర్తిస్థాయిలో 90 టీఎంసీలు నింపిపెట్టుకుంటం. మొగులుకు మనం ముఖం పెట్టి చూసే అవసరం ఉండదు. అందరూ లాభపడతరు. బాల్కొండ, మెట్‌పల్లి, వేములవాడ, కొంత మానకొండూరు నియోజకవర్గాల నుంచి పోయే వరద కాల్వ 110 కిలోమీటర్ల దూరం 365 రోజులూ నిండుగా ఉంటది. దాని ద్వారా అద్భుతమైన చేపలు పెరుగతయి.. చెట్లు, గడ్డి పెరుగుతుంది. నేలలో తేమశాతం పెరుగుతది. ఒక అపురూపమైనటువంటి దృశ్యాన్ని చూడబోతున్నాం.

వచ్చే యాసంగి నుంచి 24 గంటల కరెంటు..

టీడీపీ, కాంగ్రెస్ 30 ఏండ్లు మనల్ని కరెంటుకోసం ఏడిపించినయి. మాట్లాడితే మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. ఎన్ని బాధలు పడ్డమో మీరందరు చూసినరు. కానీ ఇప్పుడు కరెంటు బాధల్లేవు. మొండిపట్టు పట్టి, రాత్రింబవళ్లు పనిచేసి కరెంటు బాధలు లేకుండ చేసుకున్నం. ఇయ్యాల మోటరు కాల్తలేదు, ట్రాన్స్‌ఫార్మరు కాల్తలేదు. రేపు యాసంగి నుంచి 24 గంటల కరెంటు ఇయ్యబోతున్నం. మూడు జిల్లాల్లో ఇప్పుడు ప్రయోగాత్మకంగా ఇస్తున్నరు. వచ్చే యాసంగినుంచి అంతటా 24 గంటల త్రీఫేజ్ కరెంటు ఇస్తం. ఉత్తర తెలంగాణలో కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులు, కృష్ణాపై పాలమూరు–రంగారెడ్డితో తెలంగాణను సస్యశ్యామలం చేస్తం. ఎస్సారెస్పీ ద్వారా 40–45 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చి ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు మడమ తిప్పకుండా ప్రయత్నం చేస్తం.

ప్రాజెక్టులపై కాంగ్రెస్‌ను నిలదీయండి

టీఆర్ఎస్ ప్రభుత్వానికి మంచి పేరు రావొద్దని ప్రజలకు నీళ్లు రావొద్దనే కాంగ్రెస్ నాయకులు దుర్మార్గాలు చేస్తున్నరు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీద 96 కేసులు పెట్టినారు. సుందిల్ల కాడ, అన్నారం కాడ, గోలివాడ కాడ, మల్లన్నసాగర్ కాడ, కొండపోచమ్మ కాడ పంచాయితీ! ఇదీ కాంగ్రెసోళ్ల నీతి. ఇదే కాళేశ్వరంలో భాగంగా కొండపోచమ్మ రిజర్వాయర్ కడుతున్నం. అది నేను ఎమ్మెల్యేగా ఉన్న గజ్వేల్‌లోకే వస్తది. దానికి 4600 ఎకరాల జాగ అవసరం. రైతాంగం ముందుకొచ్చి, ధర తీసుకొని 4500 ఎకరాలు ఇచ్చినరు. ఇంకా వందెకరాలు మాత్రమే సేకరించాల్సి ఉంది. ఆ వందెకరాలు కాంగ్రెస్ ఎంపీపీ, నలుగురు ఆ పార్టీ కార్యకర్తలది. హైదరాబాద్‌లో ఉన్న కాంగ్రెసోళ్లు వాళ్లకు ఫోన్‌చేసి 'మీరు డబ్బులు తీసుకోవద్దు, ప్రాజెక్టును కానీయొద్దు, మన పార్టీకి లాభం జరుగదు..' అని చెప్పి వాళ్లతో హైకోర్టులో కేసులు వేయించినరు. 4600 ఎకరాల్లో 4510 భూసేకరణ అయిపోయింది.. 90 ఎకరాలు ఆపి ప్రాజెక్టును ఆపాలని ప్రయత్నంచేస్తున్నరు. అడుగడుగునా కోర్టులకు పోవడం.. ఇరువై రోజుల్లోనే ఆరు కేసులు వేసినరు. 'ఇంటికి ఒక యువకుడిని ఇవ్వండి.. తెలంగాణ తెచ్చి చూపిస్త' అని 2001 ఏప్రిల్ 27న హైదరాబాద్ జలదృశ్యంలో చెప్పిన. తెలంగాణ తెచ్చియ్యకున్నా, ఉద్యమాన్ని ఆపి వెనుకకు పోయినా.. నన్ను రాళ్లతో కొట్టి చంపమని చెప్పిన. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ సాధించి మీ ముందు పెట్టిన. ఈరోజు మళ్లీ మనవి చేస్తున్న.. కొట్లాట నా ఒక్కనిదే కాదు. ప్రభుత్వానిది మాత్రమే కాదు. మనందరి తెలంగాణ రైతుల బతుకుదెరువు. 'ఎందుకు మీరు సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకుంటున్నరు?' అని ప్రజలు ఎక్కడికక్కడ కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి. మౌనం పాటిస్తే నష్టపోయే ప్రమాదమున్నది. 'మీ దురాగతాలు మంచివి కావు.. తెలంగాణను అభివృద్ధి కానీయండి.. ప్రాజెక్టులు రానీయండి' అని కాంగ్రెస్ నాయకులకు చెప్పండి.

పునర్జీవానికి కర్త కర్మక్రియ.. కేసీఆరే



ఇది ఉత్తర తెలంగాణ రైతాంగానికి ఊపిరి పోసే ప్రాజెక్టు

12 నెలల్లో ప్రాజెక్టు పూర్తిచేసి ప్రజల రుణం తీర్చుకుంటాం

నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

పోచంపాడ్ నుంచి నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి కర్త, కర్మ, క్రియ.. అన్నీ ముఖ్యమంత్రి కేసీఆరేనని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అభివర్ణించారు. ఒక సీఎంగానే కాకుండా, రైతుగా, ఇంజినీర్‌గా, ఉద్యమకారుడిగా కేసీఆర్ ఆలోచించి, ఈ పథకానికి రూపకల్పన చేశారని, జీవంపోశారని చెప్పారు. 'ఉద్యమ సమయంలో తెలంగాణ వస్తే ఏమొస్తదని కొంతమంది అన్నారు. తెలంగాణ వచ్చింది గనుకనే ఉత్తర తెలంగాణకు వరప్రదాయిని అయిన ఎస్సారెస్పీ పునర్జీవ పథకం రూపొందించాగలిగాం. ఉత్తర తెలంగాణ రైతాంగం ఊపిరి నిలిపేది ఎస్సారెస్పీ పునర్జీవ పథకం' అని చెప్పారు. ఒక ఊరు, ఒక ఇల్లు మునుగకుండా, అతి తక్కువ ఖర్చుతో, అతి తక్కువ సమయంలో అతి ఎక్కువ ఆయకట్టుకు నీరందించేలా రూపొందించడం ఈ పథకం ప్రత్యేకతని హరీశ్ అన్నారు. 'ఆంధ్ర ప్రాంతంలో ధవళేశ్వరంవద్ద అనకట్ట నీళ్లు ఇచ్చుకున్నారు. కృష్ణాపై బరాజ్ నిర్మించారు, సుంకేశుల వద్ద బరాజ్ కట్టి, కేసీ కెనాల్‌కు నీరందిస్తున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే ఆదిలాబాద్ జిల్లాలో సదర్‌మాట్ ఆనికట్‌పై బరాజ్ నిర్మించారు ఆ రైతాంగాన్ని ఆదుకున్నారు. పోచంపాడ్‌ద్వారా వరద కాల్వనే రిజర్వాయర్‌గా మార్చి, రెండు పంటలకు నీళ్లు అందించేలా చేస్తున్నారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వద్వారా ఖమ్మంజిల్లా ఆయకట్టుకు నీరందించేలా సీతారామ ఎత్తిపోతల నిర్మించారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు ఏండ్లతరబడి నీళ్లు రాలేదు.. అయినా గత కాంగ్రెస్ పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ సీఎం కేసీఆర్ ఆ రైతుల గురించి ఆలోచించి, తుమ్మిళ్ల ఎత్తిపోతలను చేపట్టారు. ఇన్నాళ్లూ కాంగ్రెస్ నాయకులే కదా పాలించింది.. కృష్ణా, గోదావరి నదిపై కట్టిన ప్రాజెక్టుల గురించి ఆలోచించారా? పైగా ఇంత చక్కటి ప్రాజెక్టును కేసీఆర్ రూపొందించి, రీడిజైన్‌ద్వారా సస్యశ్యామలం చేయాలని ఆలోచించడం కాంగ్రెస్ నాయకులకు రుచించడం లేదు. ఈ ప్రాజెక్టును ప్రజలు మెచ్చారు కాబట్టే 40 డిగ్రీల మండుటెండలోనూ తరలివచ్చారు. ఇదే సాక్ష్యం. తమ బతుకులు బాగుపడుతాయని, బాధలు తప్పుతాయని ప్రజలు ఆలోచిస్తున్నారు. గోదావరి నీళ్లతో ఎస్సారెస్పీద్వారా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలంచేస్తాం. దానికి మీరే సాక్ష్యం. సీఎం కేసీఆర్ మాకు ఒకటే ఆదేశం ఇచ్చారు.. మూడు షిఫ్టులు పనిచేయాలని, రాత్రింబవళ్లు ఉద్యమస్ఫూర్తితో పనిచేసి, కాళేశ్వరం, పునర్జీవ పథకం పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశం మేరకు 12 నెలల్లో పూర్తిచేస్తాం. వారి ఆదేశాలు మాకు భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావిస్తాం. ఏడాదిలో ప్రాజెక్టును పూర్తిచేసి, ప్రజల రుణం తీర్చుకుంటాం' అని హరీశ్‌రావు చెప్పారు.


లాంచీపై బాసరకు..

బాసర అమ్మవారి దగ్గరికి పోవాలంటే బ్రిడ్జి దాటి పోవాలె. చాలా దూరం పోవాలి. కానీ ఎస్సారెస్పీలో 365 రోజులూ నీళ్లు ఉంటయి కాబట్టి ఇక్కడినుంచే లాంచీమీద పోయేలా భవిష్యత్తులో ఏర్పాటయితది. నేను 1996లో చూసిన లెక్కనే ఇప్పుడు పరిస్థితి ఉన్నది. ఎస్సారెస్పీ ఒక పోరంబోకు ప్రాజెక్టు. దీనిని అద్భుతంగ పెట్టుకోవచ్చు. ఇక్కడ వందల కోట్లు మంజూరుచేసి, అద్భుత పర్యాటక కేంద్రంగా మార్చాలి. సినిమావాళ్లు ఇక్కడ షూటింగులు చేసుకునేటట్లు తీర్చిదిద్దాలి. దీనిపై ఇప్పుడే గెస్ట్ హౌజ్‌లో అధికారులకు ఆదేశాలు ఇచ్చిన. శ్రీరాంసాగర్ వరద కాల్వ ఒక వరప్రదాయినిగా తయారుకాబోతున్నది. దాదాపు 46 గ్రామాలు సస్యశ్యామలం అవుతయి. కాకతీయ–వరద కాల్వ మధ్య ఉండే జాగా అంతా నీళ్లు వస్తయి. ఇది ఒక అద్భుతమైన ప్రాజెక్టు. తాగు, సాగునీటికి శాశ్వతంగా ప్రయోజనం నెరవేరడానికి సిన్సియర్‌గా ప్రయత్నం చేస్తున్నం. ఆడబిడ్డలకు వడ్డీలేని రుణాలు ఇయ్యాలని మంత్రులు చెప్పినరు.. కచ్చితంగా దానిని సానుభూతితో పరిశీలిస్తం.



పోచంపాడ్ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ఉత్సాహంగా వింటున్న మహిళలు

లోకం పోకడ



ముహూర్తం

సూర్యోదయం: 6.02 గంటలకు

సూర్యాస్తమయం: 6.40 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, తదియ మధ్యాహ్నం12.36 వరకు. తదుపరి చతుర్థి రాత్రి 12.00 వరకు, తదుపరి పంచమి. నక్షత్రం: పూర్వాభాద్ర ఉదయం 6.14 వరకు తదుపరి ఉత్తరాభాద్ర. కుంభరాశి 12.09 వరకు తదుపరి మీనరాశి. అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 10.46 నుంచి మధ్యాహ్నం 12.21 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.34 నుంచి ఉదయం 9.24 వరకు తిరిగి మధ్యాహ్నం 12.46 నుంచి 1.37 వరకు, వర్జ్యం: సాయంత్రం 6.14 నుంచి రాత్రి 7.50 వరకు.



గురువారం నిజామాబాద్ జిల్లా పోచంపాడ్‌లో శ్రీరాంసాగర్ పునర్జీవ పథకానికి శంకుస్థాపన తర్వాత బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు

పునర్జీవ పథకానికి జనామోదం

పోచంపాడ్ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చిన రైతులు, ప్రజలు ■ సభ విజయవంతం.. గులాబీ శ్రేణుల్లో జోష్

నేతలను అభినందించిన సీఎం కేసీఆర్ ■ టీఆర్ఎస్ పాలనపై సంతృప్తి వ్యక్తం చేసిన జనం

పోచంపాడ్ నుంచి నమస్తే తెలంగాణ ప్రతినిధి:

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవ పథకానికి జనామోదం లభించింది. సమైక్యపాలకుల నిర్లక్ష్యం, ఎగువ రాష్ట్రం కుట్రలతో ఒట్టిపోయిన ఎస్సారెస్పీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న పునర్జీవ పథకానికి ప్రజలు మద్దతు పలికారు. పునర్జీవ పథకం శంకుస్థాపన క్రతువులో తాము సైతం ప్రత్యక్షంగా భాగస్వామ్యం కావాలన్న ఆకాంక్షతో లక్షల మంది రైతులు తరలివచ్చారు. గురువారం నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ వద్ద సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తుండగా చప్పట్లుకొట్టి, జై తెలంగాణ నినాదాలు చేసి భగీరథ ప్రయత్నానికి మద్దతుపలికారు. అనంతరం నిర్వహించిన ఎస్సారెస్పీ పునర్జీవ సభకు భారీగా జనం హాజరయ్యారు. తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చారిత్రక సందర్భంలో తాము సైతం మద్దతుగా ఉంటామంటూ ప్రజలు తరలివచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల నుంచి స్వచ్ఛందంగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో తరలివచ్చారు. వరంగల్ వంటి దూరప్రాంతాల నుంచి సైతం ఆరు గంటలకుపైగా ప్రయాణం చేసి సభకు చేరుకున్నారు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాల ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించుకొని వచ్చారు. ఏడాదిలోగా ఎస్సారెస్పీలోకి రివర్స్ పంపింగ్ ప్రక్రియ పూర్తిచేసి జలకళ తీసుకొస్తామన్న సీఎం కేసీఆర్ ప్రకటన రైతుల్లో భరోసా నింపింది. శివాలయంలా ఉన్న ఎస్సారెస్పీని నీటితో నింపి వైష్ణవాలయంలా మారుస్తామన్న సీఎం వ్యాఖ్యలను స్వాగతిస్తూ ప్రజలు, రైతులు ఈలలు వేసి, చప్పట్లతో హర్షధ్వానాలు తెలిపారు. ప్రసంగాన్ని ఆసాంతం ఓపికగా విన్నారు. సభకు తరలివచ్చిన జనహోరును చూస్తే, సీఎం కేసీఆర్ పాలనకు బ్రహ్మరథం పడుతున్నారని స్పష్టమవుతున్నది





పోచంపాడ్‌లో శ్రీరాంసాగర్ పునర్జీవ పథకం శంకుస్థాపన సభకు తరలివస్తున్న ప్రజలు.. గొర్రెపిల్ల , గొంగడితో వస్తున్న గొల్లకుర్మలు

అంచనాలకు మించి జనం హాజరు

సభకు ఊహించిన దానికంటే భారీగా రైతులు, ప్రజలు తరలిరావడం టీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. సభను విజయవంతం చేయడంలో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో ఉత్తరతెలంగాణ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేశారు. సభకు తరలివచ్చేలా రైతులను చైతన్యపరుచడంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. సభ విజయవంతం కావడంపై పార్టీ నాయకులను ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించినట్టుగా సమాచారం. పునర్జీవ సభతో రైతాంగంలో ఆత్మవిశ్వాసం నింపగలిగామని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. మ్యానిఫెస్టోలో చెప్పినట్టుగా ఇప్పటికే రుణమాఫీ జరిగిందని, వచ్చే యాసంగి నుంచి రైతులకు 24 గంటల కరెంటు సరఫరాతోపాటు సాగునీరు అందిస్తే రైతులకు భరోసా కలుగుతుందని చెప్తున్నారు.

సీఎం కేసీఆర్‌పై ప్రజల్లో నమ్మకం

సభకు హాజరైన నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కు చెందిన యువరైతు చెందిన నర్సారెడ్డిని 'నమస్తే తెలంగాణ' పలుకరించగా.. 'తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ కాలుకు బలపం కట్టుకుని తిరుగుతున్నాడు. ఆయన చేసింది కండ్లకు కనపడుతున్నది. ఇప్పుడు పోచంపాడ్ ప్రాజెక్టులో ఏడాదిలో నిండుగా నీళ్లు చూస్తాం. మా పొలాలకు కాల్వల నుంచి నీళ్లు వస్తాయన్న నమ్మకం ఉన్నది'అని చెప్పిండు. వేములవాడ ప్రాంతం నుంచి వచ్చిన చాకలి ఆశాలు కూడా ఇదే మాటచెప్పిండు. ఇబ్రహీంపట్నంకు చెందిన మహిళా రైతు నర్సవ్వ మాట్లాడుతూ తన భర్త ఇకపై దుబాయ్‌కి పోవాల్సిన అవసరం పడదన్నది. వచ్చే ఏడాది నుంచి ఊర్లనే ఉంటూ పంట పండించుకుంటామని సంబురంగా చెప్పింది. ఇలా అనేక మంది ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తమ నమ్మకాన్ని వెలిబుచ్చారు.



సభావేదికపై డబ్ల్యూసీఎఫ్‌సీ చైర్‌పర్సన్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో సెల్ఫీ దిగుతున్న ఎంపీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, విప్ గంప గోవర్ధన్ కూడా ఉన్నారు.

సభ సైడ్‌లైట్స్

- సీఎం సభకు ఉదయం నుంచి సాయంత్రం వరకు జన ప్రవాహం కొనసాగింది.
- గంగపుత్రులు వలగొడుగులు, డప్పులతో, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గోండులు డోలక్‌లు వాయిస్తూ సభకు వచ్చారు.
- నిజామాబాద్ జిల్లాకు చెందిన తమ్మల్ల వాయిద్యకారులు తమ వాయిద్యాలతో సభాస్థలిని ఆకర్షించారు.
- సభ ముగిసిన రెండుగంటల వరకు ట్రాఫిక్ క్లియర్ కాలేదు
- ఉదయం 10 గంటలకే 44వ జాతీయరహదారిపై రెండువైపులా దాదాపు 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.
- సభ వద్దకు హనుమాన్ దీక్షాపరులు సైతం తరలివచ్చారు
- టీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున సభికులకు ప్రత్యేకంగా వాటర్‌ప్యాకెట్లు అందజేశారు.
- ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో సభాస్థలిలోని జనం పేపర్లు, టవల్స్, తలపై కప్పుకున్నారు. మహిళలు చీర కొంగులను కప్పుకుని సీఎం ఉపన్యాసం ముగిసే వరకు వేచి ఉన్నారు.
- పునరుజ్జీవ సభకు వచ్చిన జనంతో శ్రీరాంసాగర్ ప్రధానడ్యాం సాయంత్రం వరకు కిక్కిరిసిపోయింది.
- కాళేశ్వరం నుంచి తెచ్చిన గోదావరి జలాలతో కూడిన కలశాన్ని మంథని ఎమ్మెల్యే పుట్ట మధు పోచంపాడ్‌కు తీసుకువచ్చారు. ఈ నీటిని ఎస్సారెస్పీలో కలిపారు.
- వేములవాడ నుంచి వడ్లు, మట్టిని అక్కడి రైతులు తీసుకువచ్చి ప్రాజెక్టు నీటిలో వదిలారు.
- టీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి సభా స్థలికి వచ్చిన సీఎం కేసీఆర్‌కు ఎదురేగి పాదాభివందనం చేశారు.
- సభలో పలువులు మహిళలు నవ్వులు చిందించారు. మరికొందరు నృత్యాలు చేశారు.
- రసమయి బాలకిషన్ తన మాటల చాతుర్యంతో ప్రజలను ఆకట్టుకున్నారు.

ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం

వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ఆర్మూర్, నమస్తే తెలంగాణ: ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో ఉత్తర తెలంగాణ సస్యశామలమవుతుందని వ్యవసాయ శాఖమంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శ్రీరాంసాగర్ రివర్స్ పంపింగ్‌తో రైతాంగానికి భరోసా కలుగుతుందని చెప్పారు. కాంగ్రెస్, టీడీపీతో వట్టిపోయిన ఎస్సారెస్పీకి పునర్జీవ పథకంతో ప్రాణం వస్తుందన్నారు. బంగారు తెలంగాణ సాధించే క్రమంలో రాష్ట్ర రైతాంగం కష్టాలు తీర్చేందుకు సీఎం కేసీఆర్ ఆలోచనల్లోంచి పుట్టుకు వచ్చిన పథకమే ఇదన్నారు.

బృహత్తర పునర్జీవ పథకం

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ఓ బృహత్తర కార్యక్రమమని, మనమంతా ఎంతో అదృష్టవంతులమని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక అన్ని రంగాల్లో అభివృద్ధిచేసేందుకు సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని చెప్పారు. గోదావరి జలాలను రైతులకు అందించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఈ పథకంతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. నిర్మల్ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. చరిత్రలో ఎవరూ తీసుకోని కార్యక్రమాలను సీఎం కేసీఆర్ తీసుకుంటున్నారంటూ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజలకు కృతజ్ఞతలు

వేముల ప్రశాంత్‌రెడ్డి



పునర్జీవ సభకు లక్షల్లో తరలివచ్చిన ప్రజలకు మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ నాయకుల నిర్వాకంతో వట్టిపోయిన ఎస్సారెస్పీకి పునర్జీవ పథకంతో సీఎం కేసీఆర్ ప్రాణం పోస్తున్నారని కొనియాడారు. దీనిద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాల రైతాంగానికి భరోసా కల్పించామని చెప్పారు. వివిధ జిల్లాలనుంచి, బాల్కొండ నియోజకవర్గంనుంచి తరలివచ్చిన అశేష జనవాహినికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పునర్జీవ పైలాన్ ఆవిష్కరించిన సీఎం

వరద కాల్వ జీరో పాయింట్ వద్ద నిర్మించిన 'ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పైలాన్'ను ఉదయం 11.40 గంటలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఆవిష్కరించారు. రూ.1050 కోట్లతో చేపట్టిన ఈ పథకానికి భూమిపూజ అనంతరం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, అధికారులు పాల్గొన్నారు. అక్కడి నుంచి తిరిగి పోచంపాడ్ గెస్ట్‌హౌస్‌కు మధ్యాహ్నం 12.10 గంటలకు సీఎం చేరుకున్నారు. మధ్యాహ్నం 2.10 గంటలకు సభాస్థలికి చేరుకుని 2.30 గంటలకు ప్రసంగం ప్రారంభించి 20 నిమిషాలపాటు మాట్లాడారు. మధ్యాహ్నం 3.05 నిమిషాలకు మంత్రి హరీశ్‌రావు, టీన్యూస్ ఎండీ సంతోష్‌కుమార్ తదితరులు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరివెళ్లారు.

ప్రశాంత్‌రెడ్డికి సీఎం ప్రశంసలు

నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఎస్సారెస్పీ పునర్జీవ సభలో బాల్కొండ ఎమ్మెల్యే, మిషన్ భగీరథ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డిపై సీఎం కేసీఆర్ ప్రశంసల జల్లు కురిపించారు. సభను దిగ్విజయం చేసేందుకు ప్రశాంత్‌రెడ్డి మంచిగా ఏర్పాట్లు చేశారని చెప్పారు. పథకం సభ తేదీ ప్రకటించిన నాటినుంచి పది రోజులు పోచంపాడ్‌లోనే ప్రశాంత్‌రెడ్డి మకాంవేశారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. సభాస్థలి మొదలు.. భద్రత, ట్రాఫిక్, పార్కింగ్‌తోపాటు.. శ్రీరాంసాగర్‌లోని అతిథిగృహంలో సీఎం కేసీఆర్ బస వరకూ ఆయన దగ్గరుండి చూసుకున్నారు. సభా వేదిక, పైలాన్ తదితర ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించారు. వర్షంలో సైతం తడుస్తూ దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, పీఆర్, ఆర్‌బ్ల్యూఎస్ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి, సభ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చూడటంతో ప్రశాంత్‌రెడ్డిని సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా వేదికపైన అభినందించారు.

సభా వేదికపై ప్రముఖులు..

సభావేదికపై డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, తన్నీరు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జోగు రామన్న, ఎంపీలు కల్వకుంట్ల కవిత, వినోద్‌కుమార్, బాల్క సుమన్, బీబీ పాటిల్, రాజ్యసభ సభ్యుడు డీ శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు వివేక్, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మహ్మద్ షకీల్, బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, కొండా సురేఖ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కోవ లక్ష్మి, రేఖానాయక్, ఎమ్మెల్సీలు డీ రాజేశ్వర్, భూపతిరెడ్డి, వీజీ గౌడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాతూరి సుధాకర్‌రెడ్డి, ఆకుల లలిత తదితరులున్నారు.



పోచంపాడ్ సభకు వెళ్తూ పెర్కిట్ వద్ద ట్రాఫిక్‌జాంలో చిక్కుకున్న మంత్రి కేటీఆర్‌తో కరచాలనం చేస్తున్న ప్రజలు



పెర్కిట్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్‌లో కేటీఆర్!

సభాస్థలికి చేరుకునేసరికి ముగిసిన కార్యక్రమం

లక్షల సంఖ్యాలో రాకతో పోచంపాడ్ వద్ద జనసమ్మర్దం ■ సభాస్థలికి వెలుపలే మూడింతల మంది ప్రజలు

నిజామాబాద్/నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజలు పోటెత్తారు. సభ ప్రారంభమయ్యేసరికే లక్షల్లో హాజరు కాగా, పెద్ద ఎత్తున వాహనాలు రావడంతో ట్రాఫిక్ స్తంభించి, అంతకు మూడింతలమంది రోడ్లపైనే ఉండిపోయారు. పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయిందన్న సమాచారంతో వరంగల్, కరీంనగర్ పూర్వ జిల్లాలకు చెందిన ప్రజలు మోర్తాడ్, కమ్మర్‌పల్లి పరిసరాల్లోనే ఆగి, సభకు రాకుండానే వెనుదిరిగారు. సభ ముగిసే సమయానికి కూడా ప్రజలు వస్తూనే ఉండటంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. దీనికితోడు సభ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణానికి ప్రజలు సిద్ధమవడంతో పోచంపాడ్ పరిసరాల్లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం పూర్వపు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఆర్టీసీ, స్కూల్ బస్సులు, డీసీఎంలు, ఇతర వాహనాల్లో జనం తరలివచ్చారు. శ్రీరాంసాగర్ క్రాస్‌రోడ్డు నుంచి రోడ్డు కిరువైపులా, మధ్యాహ్నం ఒంటి గంటవరకు 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. మంత్రి కే తారక రామారావు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. పెర్కిట్ ప్రాంతంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఆయన, అక్కడ నుంచి సభాస్థలికి చేరుకోవడానికి రెండు గంటలు పట్టింది. అప్పటికే సమావేశం ముగిసింది. దీంతో ఆయన అందరినీ కలిసి వెనుదిరిగారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుకూడా ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. మరోవైపు సభకు వచ్చినవారంతా ప్రాజెక్టును చూసేందుకు రావడంతో డ్యాం కూడా కిక్కిరిసిపోయింది.


ట్రాఫిక్ నియంత్రించిన ఉమ్మడి జిల్లా ఎస్పీలు

బాల్కొండ, మోర్తాడ్: పునర్జీవ సభకు వచ్చిన ప్రజలను అదుపుచేయడంలో నిజామాబాద్ సీపీ కార్తికేయ, కామారెడ్డి ఎస్పీ శ్వేతారెడ్డి తీవ్రంగా శ్రమించారు. ఒక దశలో కామారెడ్డి ఎస్పీ ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ గెస్ట్‌హౌస్ ద్వారం వద్ద కానిస్టేబుల్ వలే నిలబడి ట్రాఫిక్‌ను నియంత్రించారు. మండుటెండలో ఆమె ఏకంగా ఆరు గంటల పాటు వాహనాలను క్రమపద్ధతిలో మళ్లించారు. నిజామాబాద్ సీపీ కార్తికేయ సైతం అనేక చోట్ల ట్రాఫిక్‌ను నియంత్రించారు. సభా స్థలిలో సభికులు ప్రవేశించే ద్వారాలవద్ద ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్లను పర్యవేక్షించారు. అక్కడ సరిగా విధులు నిర్వహించని కొందరు పోలీసులపై సీపీ కార్తికేయ ఆగ్రహం వ్యక్తం చేశారు.





శ్రీరాంసాగర్ పునర్జీవ పథకం శంకుస్థాపన సభలో పాల్గొన్న శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీలు బాల్క సుమన్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, రేఖానాయక్, కొండా సురేఖ, చింతా ప్రభాకర్, సోమారపు సత్యనారాయణ, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, కోనేరు కోనప్ప, బొడిగ శోభ, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీలు రాజేశ్వర్‌రావు, ఫరీదుద్దీన్, జెడ్పీ చైర్‌పర్సన్లు వీ శోభారాణి, తుల ఉమ, ప్రభుత్వ సలహాదారు జీ వివేక్, మాజీ మంత్రి జీ వినోద్ తదితరులు



శరద్ యాదవ్ ఉపయోగిస్తున్న రాజకీయ పరిభాష బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కు ఇబ్బంది కలిగిస్తున్నది. ఆయన తన అభిప్రాయాలను ఈ నెల 19వ తేదీన జరిగే జాతీయ కార్యవర్గం సమావేశంలో వెల్లడించా లె. ఆయన పరిమితులు దాటి వ్యాఖ్యలు చేయవద్దని కోరుతం.

కేసీ త్యాగి, జేడీయూ జాతీయ అధికార ప్రతినిధి

బీహార్‌లో ఏర్పడిన మహా కూటమికే ప్రజలు పట్టం కట్టారు. మహా కూటమిని విచ్ఛిన్నం చేయడం పదకొండు కోట్ల ప్రజల తీర్పును ఉల్లంఘించడమే. మహా కూటమి ఐదేండ్ల కోసం ఏర్పడ్డది. మహాకూటమి, బీజేపీ వేర్వేరు మ్యానిఫెస్టోలతో ఎన్నికలకు వెళ్ళాయి. రెండు వేర్వేరు కూటముల మ్యానిఫెస్టోలు కలవడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి.



శరద్ యాదవ్ , జేడీయూ జాతీయ అధ్యక్షుడు

చరిత్రలో నేడు



1874

'స్ప్రింక్లర్'ను తయారుచేసిన హారీ ఎస్ పర్మిలీ.

1961

పోర్చుగీసు పాలనలోని దాద్రా, నగర్, హవేలీ ఏకం. భారత్‌లో కేంద్రపాలిత ప్రాంతంగా చేరిక.





1976

దక్షిణాఫ్రికా కేప్‌టౌన్‌లో జాతివివక్ష ఘర్షణలు. 17 మంది మృతి.

గుజరాత్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికలు యుద్ధాన్ని తలపించాయి. అమిత్ షా, స్మృతి ఇరానీ లాంటి నేతలు ముందుండి నడిపించినా బీజేపీకి విజయం దక్కలేదు. అనేక వ్యూహ, ప్రతివ్యూహాల మధ్య అహ్మద్ పటేల్ విజయంతో కాంగ్రెస్‌కు పెద్ద నైతిక బలం వచ్చింది. అయితే ఎన్నికల కమిషన్ రెండు ఓట్లను అనర్హమైనవిగా ప్రకటించటం పట్ల బీజేపీ న్యాయపోరాటం చేస్తానంటున్నది. కానీ ఇదే బీజేపీ గతేడాది హర్యానాలో 14 కాంగ్రెస్ చెల్లకుండా చేయటాన్ని ఆహ్వానించింది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

భారత్-అఫ్ఘానిస్థాన్‌ల మధ్య విమాన రాకపోకలకు సంబంధించి 'ఎయిర్ కారిడార్' ఒప్పందం చేసుకొని రెండు నెలలు గడువకముందే అనేక అవాంతరాలను ఎదుర్కొంటున్నది. వస్తు రవాణాకు అవసరమైన కార్గో విమానాలు అందుబాటులో లేవు. దీంతో వస్తు రవాణాకు, వ్యాపారానికి తీవ్ర విఘాతం ఏర్పడుతున్నది. నిజానికి సముద్రమార్గాన ఓడల ద్వారా వస్తు రవాణా చేయాలంటే వాఘా వద్ద పాకిస్థాన్ అవాంతరాలు సృష్టించటంతో ఎయిర్ కారిడార్ అవసరమైంది. భారత్, అఫ్ఘానిస్థాన్‌ల మధ్య వాణిజ్య వ్యాపార సంబంధాలకు ఎదురవుతున్న అవాంతరాలన్నింటినీ అధిగమించాలి.

ది హిందూ

రైతులకు 'శ్రీరామ' రక్ష!

తెలంగాణ భూములను సస్యశ్యామలం చేయాలన్న బృహత్కార్యక్రమంలో- ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం శ్రీరామ్‌సాగర్ పునర్జీవ పథకానికి శంకుస్థాపన చేయడం ఒక మహోజ్వల ఘట్టం. ఇంతకాలం సీమాంధ్ర పాలకుల విద్రోహానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వ కార్యదక్షతకు ప్రతీకగా ప్రభవిల్లబోతున్నది. సీమాంధ్ర పాలనలో తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణం- పంచపాండవులంటే మంచం కోళ్ళ లెక్క ముగ్గురు అంటూ రెండు వేళ్ళు చూపించినట్టుగా సాగింది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు ను నిర్మించినప్పుడు పదహారు లక్షల ఎకరాలకు నీరు అందిస్తామని మాయమాటలు చెప్పారు. కానీ ప్రాజెక్టు సామర్థ్యమే దాదాపు రెండు వంతులకు కుంచించుకుపోయిందే తప్ప ఆశించిన లక్ష్యాన్ని ఏనాడు చేరుకోలేదు. 8500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం అంటూ నిర్మించిన కాకతీయ కాలువలో ఏనాడూ మూడు లేదా నాలుగువేల క్యూసెక్కులకు మించి నీరు పారలేదు. ఎగువన మహారాష్ట్ర నుంచి గోదావరి నీళ్ళు రాకపోవడం వల్ల సాగునీటి ప్రాజెక్టుల వ్యవస్థలు నిరుపయోగంగా మారిన దురవస్థ, ప్రాణహిత నీళ్ళు పల్లానికి పారుతూ ఉత్తర తెలంగాణ దప్పిక తీర్చలేని నిస్సహాయతను గ్రహించిన కేసీఆర్ మేడిగడ్డ దగ్గర నుంచి ఎత్తిపోతలే సరైన మార్గమని నిర్ణయించారు. నిరుపయోగంగా మారిన పాత ప్రాజెక్టు వ్యవస్థకే మళ్ళా ప్రాణం పోసి పంట పొలాలకు నీళ్ళు మళ్ళించదలిచారు. ఏడు చోట్ల ఎత్తిపోతల పథకాలు చేపడుతున్నారు. ఎల్లంపల్లి, నంది మేడారం పంప్‌హౌజ్‌లు ఇప్పటికే పూర్తయ్యాయి. మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం పంప్‌హౌజ్‌ల నిర్మాణం సాగుతున్నది. పరిశ్రమల మాదిరిగా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని కూడా మూడు షిఫ్టులలో సాగించాలని నిర్ణయించడం కూడా తెలంగాణ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం.

శ్రీరామ్‌సాగర్ ఎండిపోతున్నా చలించని నాయకులు, నాగార్జునసాగర్ ఎడమకాలువ నిష్ప్రయోజనకరంగా మారినా మాట్లాడని నేతలు, ఆర్డీఎస్ జలదోపిడీకి నిదర్శనంగా మారినా నోరుమెదుపని రాజకీయ పెద్దలు ఇప్పుడు తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డుపుల్లలు వేయడం తీవ్ర ఆక్షేపణీయం. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం వల్ల ఒక్క రైతులు మాత్రమే కాదు, ప్రత్యక్షంగా, పరోక్షంగా భిన్న సామాజిక వర్గాలు సంపద్వంతం అవుతాయి.

మనసుంటే మార్గం ఉంటుందన్నట్టుగా, ముఖ్యమంత్రి కేసీఆర్ అహోరాత్రులు తపించి సాగునీటి వ్యవస్థలను సరికొత్తరీతిలో తీర్చిదిద్దుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటి పరిస్థితులను తలచుకుంటేనే గుండె తరుక్కుపోతుంది. మహారాష్ట్రలో నిర్మించిన ప్రాజెక్టుల మూలంగా గోదావరి నదిలో నీరు లేకుండా పోయింది. మరోవైపు నదీ జలాలు సముద్రంలో కలిసి పోతున్నాయే తప్ప తెలంగాణకు దప్పిక తీర్చడానికి కూడా సీమాంధ్ర పాలకులకు మనసొప్పలేదు. సీమాంధ్రలో నదీ బేసిన్‌లోని లేని ప్రాంతాలకు కూడా నీటి పారుదల వసతులు కల్పించారు. కానీ గోదావరి, కృష్ణా నదుల మధ్య ఉన్న తెలంగాణలో మాత్రం ప్రాజెక్టులు కట్టినట్టే భ్రమింపజేసి మొండిచేయి చూపించారు. నాయకులు- కాంట్రాక్టర్ల కడుపులు నింపే విధంగా కాలువలు తవ్వించారే తప్ప నీళ్ళు పారించలేదు. ఆచరణ సాధ్యం కాని రీతిలో ప్రాజెక్టుల రూపకల్పన చేశారు. ఇది తెలంగాణ ప్రజలను అత్యంత ఘోరంగా మోసం చేయడం, అవమానించడమే. ఈ కుట్రలన్నీ గమనిస్తూ ఉన్న కేసీఆర్ ఇప్పటికి దాదాపు రెండు దశాబ్దాల కిందట ఇదే శ్రీరామ్‌సాగర్ కట్ట మీద కూర్చుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే మన సమస్యలకు పరిష్కారమనీ, తాను బతికి ఉంటే తెలంగాణ కోసం ఉద్యమించి సాధిస్తానని జలదేవత సాక్షిగా ప్రకటించారు. తేట మనసుతో ఆనాడు కేసీఆర్ చేసిన ప్రతిన నెరవేరింది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు ఉద్యమ లక్ష్యాలనూ నెరవేరుస్తున్నారు. ఈ క్రమంలో శ్రీరామ్‌సాగర్ పునర్జీవ పథకానికి శంకుస్థాపన చేయడం ఒక ఉద్వేగభరిత ఘట్టంగా చెప్పవచ్చు. తెలంగాణ ప్రాజెక్టులను జీవం పోసి రైతన్నలకు అతి తక్కువ కాలంలోనే సాగు నీరు అందించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనుసరిస్తున్న సృజనాత్మక విధానాలు శ్లాఘించదగినవి. ప్రపంచవ్యాప్తంగా సాగునీటి నిపుణులకు పాఠాలుగా చేర్చదగినవి.

ముఖ్యమంత్రి కేసీఆర్ అసాధారణమైన ప్రజ్ఞతో అధ్యయనం చేసి, సాగునీటి నిపుణులతో చర్చించి ప్రాజెక్టులకు పునరాకృతిని ఇచ్చి నిర్దిష్ట వ్యవధిలో నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిని తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారు. రాజకీయ పక్షాలు కూడా సంకుచిత దృష్టితో ఆలోచించకుండా ఈ మహత్కార్యానికి మద్దతు ఇవ్వాలె. కానీ కొందరు ప్రతిపక్ష నాయకులు దొంగలకు సద్దులు మోసిన రీతిలో, తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డుతగలడం, రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపడం బాధాకరం. తెలంగాణ ప్రాజెక్టులను నిర్మించుకోకుంటే, ప్రకృతి ప్రసాదించిన నదీజలాలు సముద్రంలో కలుస్తాయి. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేని పరాయి శక్తుల మెప్పు కోసం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించడం ఏ రాజకీయ పక్షానికైనా తగదు. శ్రీరామ్‌సాగర్ ఎండిపోతున్నా చలించని నాయకులు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ నిష్ప్రయోజనకరంగా మారినా మాట్లాడని నేతలు, ఆర్డీఎస్ జలదోపిడీకి నిదర్శనంగా మారినా నోరుమెదుపని రాజకీయ పెద్దలు ఇప్పుడు తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డుపుల్లలు వేయడం తీవ్ర ఆక్షేపణీయం. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం వల్ల ఒక్క రైతులు మాత్రమే కాదు, ప్రత్యక్షంగా, పరోక్షంగా భిన్న సామాజిక వర్గాలు సంపద్వంతం అవుతాయి. ప్రతిపక్షాల తీరు ఎట్లా ఉన్నా సమాజంలోని అన్నివర్గాలూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన భగీరథ యత్నానికి అండగా నిలువాలె.

విశ్లేషణ



వనం జ్వాలా నరసింహారావు

శాస్త్రీయ పద్ధతిలో రహదారులు

అమెరికా కాలిఫోర్నియా రాష్ట్రంలోని రెడ్ వుడ్ సిటీలో ఉంటున్న కొడుకును చూడటానికి వచ్చి చుట్టుపక్కలున్న కొన్ని ప్రదేశాలకు కూడా వెళ్లాను. యూఎస్ఏలో కాలిఫోర్నియా రాష్ట్రానికి ఒక ప్రత్యేకత ఉన్నది. శాన్ ఫ్రాన్సిస్కోలోని డౌన్‌టౌన్ రోడ్ మీద ప్రయాణం, అక్కడికి పోవడానికి సముద్రం పక్కనుంచి, దాదాపు సాగరజలాల అంచునుంచి చేరుకోవడం భలే సరదాగా ఉంటుంది. క్రుకెడ్ రోడ్డు కూడా అలాగే ఉంటుంది.

రోడ్డంతా, నేరుగా, వంకర టింకరలు లేకుండా, సుదూరంలో ఆకాశం నేలను తాకుతున్నట్లు, అద్భుతమైన సుందర దృశ్యంలా కనిపిస్తుంటుంది. ఆ రహదారి మీద కారులో పోతుంటే భయం వేస్తుంది. కొంత ఎత్తుకు వెళ్లిన తర్వాత వెనుకా, ముందు ఎటుచూసినా, ఒళ్లు గగుర్పొడుస్తుంది. ప్రమాదాలకు నిలయమైనట్లున్నా, ఒక్క ప్రమాదం కూడా జరుగదు.

అమెరికా దేశంలోని నలుమూలల నుంచి వందల మైళ్ల దూరం సునాయాసంగా సొంత కార్లలో ప్రయాణం చేస్తారు. దీనికి ప్రధాన కారణం దేశమంతా శాస్త్రీయ పద్ధతిలో రహదారులు నిర్మించి ఉండటం. దీంతోపాటు ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ నిబంధనలు చిత్తశుద్ధిగా పాటించడం. ప్రభుత్వం అజమాయిషీ చేస్తుందా, లేదా అని గమనించకుండా ప్రతి పౌరుడు నిబంధనలను పాటిస్తాడు. ఉదాహరణకు రహదారి నియమనిబంధనల్లో ఒకటి. నగరాల్లోని కార్‌పూల్ మార్గం. వేగంగా వెళ్లడానికి అనువుగా ఉండే ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే కారులో ఇద్దరికంటే ఎక్కువమంది ఉండాలి. అలా లేని కారు నడిపే వ్యక్తి, ఎవరు గమనించినా, గమనించకున్నా ఈ మార్గంలోకి వచ్చే ధైర్యం చెయ్యడు.

మన దేశంలో ఎక్కడ చూసినా డ్రైవింగ్‌కు అనుకూలించని, నైపుణ్యం కొరవడిన రోడ్లు. అవసరమైన ప్రదేశాల్లో ఇంకా మాంధాతల కాలంనాటి కూలడానికి సిద్ధంగా ఉన్న వంతెనలు. అసందిగ్ధమైన హైవే హద్దులు, ఏ రోడ్డు ఎటుపోతుందో తెలియజేసే ఏర్పాట్లు లేకపోవడం, రహదారిపై ఓ పక్క ఆపుకోడానికి ఏ మాత్రం సౌకర్యాలు లేకపోవడం లాంటి ఎన్నో లోటుపాట్లను గుర్తించడమైతే జరిగింది కానీ, సరిదిద్దేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకోలేదనే చెప్పాలి. ఆరు లైన్ల, నాలుగు లైన్ల జాతీయ, రాష్ట్ర రహదార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంచేసినా, అమలువరకు వచ్చేసరికి ఎక్కడి గొంగళి అక్కడే. ఈ నేపథ్యంలో అమెరికా జాతీయ, పట్టణ, నగర రహదారుల్లో ప్రయాణం చేయడం గొప్ప అనుభూతి. ఆ రోడ్లను చూసి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది.

అమెరికా రహదారుల మీద వాహనం నడుపడమైనా, ఎవరన్నా నడుపుతుంటే కూర్చొని ప్రయాణం చేయడమైనా ఆసక్తికరంగా, ఆహ్లాదంగా ఉంటుంది. ఏ మాత్రం ఏమరుపాటుగా నడిపినా, నడిపేవారి పక్కన కూర్చున్నా ప్రమాదపుటంచుల్లోకి నేరుగా పోతున్నట్లు ఉంటుంది. అన్నిరకాల వాహనాలు, భారీ, మధ్యరకం, చిన్నవి, వివిధ లైన్లలో, ఏకకాలంలో కనీసం నాలుగు కంటే తక్కువ లేకుండా, ఇరువైపుల నుంచి గంటకు 50-60 మైళ్ల వేగంతో వెళ్తుంటాయి.

వివిధ రాష్ర్టాలను కలుపుతూ వేసిన రహదారులను జాతీయ హైవేలు అని మనదేశంలో పిలుస్తున్నట్లు, అమెరికాలో వాటిని అంతర్రాష్ట్ర రహదారులు అని అంటారు. ఇండియాలో వాటికి ఎన్‌హెచ్-1, ఎన్‌హెచ్-2.. అని నంబర్లు ఇస్తారు. అమెరికాలోనూ అదే తరహా నంబర్లు ఉంటాయి. కానీ ఒక రాష్ట్ర సరిహద్దు నుంచి మరో రాష్ట్ర సరిహద్దులో ప్రవేశించగానే ఆ నంబర్లు మారుతూ ఉంటాయి. ఉదాహరణకు 'ఏ' రాష్ట్రంలోని ఒక స్థలం నుంచి 'సీ' రాష్ట్రంలోని మరో స్థలానికి 'బీ'రాష్ట్రం నుంచి పోవాలనుకుంటే.. 'ఏ' నుంచి 'బీ'కి ఒక నంబర్, 'బీ' నుంచి 'సీ'కి మరో నంబర్ కేటాయిస్తారు. ఉత్తరం నుంచి దక్షిణ దిశగా, దక్షిణం నుంచి ఉత్తర దిశగా ఉన్న అంతర్రాష్ట్ర రహదారులకు బేసి సంఖ్యలు (1, 3, 5..), తూర్పు నుంచి పడమరగా, పడమర నుంచి తూర్పుగా ఉన్న రహదారులకు సరి సంఖ్యలు (2, 4, 6..) కేటాయిస్తారు.

ఏ పరిస్థితుల్లోనూ ఎదురెదురుగా వాహనాలు రాకుండా వెడల్పాటి రహదారి డివైడర్లను అంతర్రాష్ట్ర రోడ్ల మధ్య ఏర్పాటు చేస్తారు. ఎంత వేగంగా వాహనం నడిపినా, హెడ్ ఆన్ కొలిజన్ ప్రమాదాలకు ఆస్కారం లేదు. ఇతర ప్రమాదాలకూ అవకాశం తక్కువే. దాదాపుగా ఉండవనే చెప్పవచ్చు. ఒకవేళ అంతర్రాష్ట్ర ప్రమాదమంటూ జరిగితే, అది వెనుక నుంచి వస్తున్న వాహనం ముందున్న వాహనాన్ని ఢీకొడితేనే తప్ప.. అలా ఎప్పుడు జరిగినా భారీ స్థాయిలోనే ప్రమాదం సంభవిస్తుంది. ఎంతోసేపు వాహనాలు ఆగిపోయే అవకాశం ఉంటుంది. అయితే వీలైనంత త్వరగా, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తారు.

అంతర్రాష్ట్ర రహదారుల్లో కనీసం రెండో, మూడో చానల్స్ లేదా పాస్ వే (లైన్ల) ఏర్పాటు ఉంటుంది. వాహనం నడిపేవారు వారివారి వేగానికి అనుకూలంగా ఒక లైన్లో ప్రయాణిస్తారు. ఎల్లప్పుడూ కుడి వైపునే నడుపండి, లైన్ మారటానికి మాత్రమే ఎడమ వైపునకు తీసుకోండి అంటూ సూచిక బోర్డులుంటాయి. ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయాలంటే, అందుబాటులో ఎడమవైపు ఉన్న లైన్‌లోకి మారి వాహనం నడుపాలి. తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకుండా, హారన్ మోగించకుండా లైన్లు మారాలి.

పోలీసు సిగ్నల్ చూసి వాహనాన్ని నిలిపిన వ్యక్తి కిందకు దిగాల్సిన అవసరం లేదు. పెట్రోలింగ్ వాహనంలో వచ్చిన పోలీసు అధికారే డ్రైవర్ దగ్గరకొస్తాడు. డ్రైవర్ అతిక్రమించిన నిబంధన, దానికి చెల్లించాల్సిన ఫైన్, టికెట్ వివరాలు తెలియజేస్తాడు. వాదప్రతివాదాలకు అవకాశంలేదు. తప్పుచేయలేదని నిరూపించుకోవడానికి చట్టపరమైన మార్గాలను తర్వాత అన్వేషించవచ్చు.

భద్రతా కారణాల దృష్ట్యా, వాహనం నడిపే వ్యక్తితో పాటు ముందు సీట్లో కూర్చున్న వ్యక్తి విధిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలి. కొన్ని రాష్ర్టాల నిబంధనల ప్రకారం వెనుక సీట్లో కూర్చున్నవారు సైతం సీట్ బెల్ట్ పెట్టుకోవాలి. సీట్‌బెల్ట్ పెట్టుకోకుండా పట్టుబడితే ఆ బాధ్యత డ్రైవర్‌దే అంటారు అక్కడి పోలీసులు. ఆ తప్పుకు అనుగుణమైన టికెట్ ఇవ్వడం జరుగుతుంది. అలాగే వాహనం నడిపేవ్యక్తి నడుపడంలో ఎలాంటి తప్పుచేసినా దానికి తగిన శిక్ష కింద పోలీసులు టికెట్లు ఇస్తారు. వాటి వివరాలన్నీ డ్రైవింగ్ లైసెన్స్‌లో పొందుపరిచి, ఆ తప్పులకొచ్చిన పాయింట్ల ఆధారంగా, లైసెన్స్ కొంతకాలం రద్దుచేయడమో, శాశ్వతంగా తీసేయడమో జరిగే అవకాశం ఉంది. టికెట్ ఇచ్చిన ప్రతిసారీ భారీగా ఫైన్ కూడా వసూలు చేస్తారు. అలాగే మత్తు పదార్థాలు సేవించి వాహనం నడిపినా శిక్షార్హుడే. ఒకసారి లైసెన్స్ పోతే మళ్లీ రావడం చాలా కష్టం.

హైవే మీద వాహనం నడిపే వ్యక్తి ఏదన్నా ట్రాఫిక్ నిబంధనను అతిక్రమించినట్లు, రహదారి పెట్రోలింగ్ పోలీసు అధికారి గమనిస్తే, వాహనం వెనుకనే వస్తున్న పెట్రోలింగ్ కారుకు అమర్చబడిన లైట్ల ద్వారా సిగ్నల్స్ ఇవ్వడం జరుగుతుంది. క్షణం కూడా ఆలోచించకుండా వాహనం నడుపుతున్న వ్యక్తి, తన వాహనాన్ని, రోడ్డుకు ఇరుపక్కలా ఉండే షోల్డర్స్ వైపుగా తీసి ఆపుతాడు. వాహనం పట్టేంత జాగా మాత్రమే ఉండే షోల్డర్ వివిధ కారణాల వల్ల వాహనాన్ని హైవే మీద ఆపుకోవాల్సిన పరిస్థితుల్లో పార్క్ చేసేందుకు ఏర్పాటు చేసిన ఒక సౌకర్యం. దానిమీద వాహనం నడిపితే శబ్దం వచ్చేవిధంగా రోడ్డు కింది భూ పొరను తయారు చేస్తారు. పోలీసు సిగ్నల్ చూసి వాహనాన్ని నిలిపిన వ్యక్తి కిందకు దిగాల్సిన అవసరం లేదు. పెట్రోలింగ్ వాహనంలో వచ్చిన పోలీసు అధికారే డ్రైవర్ దగ్గరకొస్తాడు. డ్రైవర్ అతిక్రమించిన నిబంధన, దానికి చెల్లించాల్సిన ఫైన్, టికెట్ వివరాలు తెలియజేస్తాడు. వాదప్రతివాదాలకు అవకాశంలేదు. తప్పుచేయలేదని నిరూపించుకోవడానికి చట్టపరమైన మార్గాలను తర్వాత అన్వేషించవచ్చు. అతడు చేసిన నిబంధనలకు విరుద్ధమైన చర్య ఆపాటికే రోడ్డుపైన అమర్చిన రాడార్లో రికార్డయి ఉంటుంది.అసలు వాహనం నడిపేవారికే తను చేసిన తప్పేంటో అప్పటికే తెలిసిపోతుంది.

హైవే పొడుగునా రకరకాల ఎగ్జిట్లు ఉంటాయి. వెళ్లాల్సిన కారణం ఏదైనా కావచ్చు. వాటిని గ్యాస్ ఎగ్జిట్ అని, ఫుడ్ ఎగ్జిట్ అని, లాడ్జింగ్ ఎగ్జిట్ అని, కంఫర్ట్ ఎగ్జిట్ అని, హాలిడే ఎగ్జిట్ అని, క్యాంప్ ఎగ్జిట్ అని, హాస్పిటల్ ఎగ్జిట్ అని పిలుస్తారు. వాహనాలకు గ్యాస్ నింపుకొనేందుకు, తినుపదార్థాల కోసం, కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు, సెలవు దినంగా గడిపేందుకు, అత్యవసర వైద్య సదుపాయం కోసం లేదా మరేదైనా సౌకర్యం కోసమే ఉద్దేశించబడినవి ఈ ఎగ్జిట్లు. అలాగా ప్రధాన రహదారి నుంచి, మనం వెళ్లాల్సిన ప్రదేశానికి చేరుకునేందుకు మళ్లాల్సిన మార్గాన్ని కూడా ఎగ్జిట్ అంటారు. వీటికి నంబర్లుంటాయి. మనం తీసుకోవాల్సిన ఎగ్జిట్ తెలిసైనా ఉండాలి. లేదా జీపీఎస్ సహాయంతోనైనా తెలుసుకోవాలి. హైవే ఎగ్జిట్‌లలో అనేక సదుపాయాలుంటాయి. హైవేకు ఎడమవైపున ఉన్న ప్రదేశానికి చేరుకోవాలంటే, కుడివైపునున్న సంబంధిత ఎగ్జిట్‌లోకి ప్రవేశించి, ప్రధాన రహదారిపైన ఏర్పాటుచేసిన ఫ్లై ఓవర్ మీది నుంచో, కింద ఏర్పాటుచేసిన రోడ్డు నుంచో అటువైపుగా పోవాలి. ఎక్కడ పడితే అక్కడ వాహనం మళ్లించే అవకాశం కూడా ఉండదు. తిండికి ఏ కొరతా ఉండదు. శాంతా క్లారా-లాస్ ఏంజిల్స్ మార్గంలో భారతీయ సంప్రదాయ ఆహారం కూడా దొరుకుతుంది.

అమెరికాలో ఫ్రీ వేలు చాలా చోట్ల ఉంటాయి. అందులో వెళుతుంటే ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపిస్తాయి. అయినా నిబంధనలను అతిక్రమించి ఎవరూ నడుపరు. పల్లెటూరి మార్గంలో పోతున్నప్పుడు కూడా ఇరువైపుల ఒక్కోసారి ఒకే లైన్ ఉండి, ఎదురెదురుగా వాహనాలు కనిపిస్తుంటాయి. ఇలాంటి సౌకర్యాలున్న శాంతా క్లారా-లాస్ ఏంజిల్స్ రహదారిలో వెళ్లేటప్పుడు, తిరిగొచ్చేటప్పుడు, మధ్యలో డిస్నీ ల్యాండ్‌కు, యూనివర్సల్ స్టూడియోలకు పోయినప్పుడు ఎంత వేగంగా కారు నడిపినా భయం వేయలేదు. అందుకే అమెరికా రహదారుల ఏర్పాట్ల గురించి తెలుసుకోవాల్సింది ఎంతో ఉంది.

జనగళం

చరిత్రాత్మక సినిమాలు రావాలె

ఇటీవలి కాలంలో తెలంగాణ ప్రాధాన్యం, ప్రస్తావనలు సినీ మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి. ఫిదా సినిమాలో పూర్తిస్థాయిలో తెలంగాణ యాస పలికించి దర్శక నిర్మాతలు తెలంగాణ ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నారు. చాలా సినిమాల్లో తెలంగాణ ప్రాంతాల ప్రస్తావన ఒక్కసారైనా ఉంటున్నది. టీవీ సీరియళ్లలో, టీవీ కార్యక్రమాల్లో కూడా తెలంగాణ యాసను, ఇక్కడి పట్టణాల ప్రస్తావన తీసుకువస్తున్నారు. ఇదంతా రాష్ట్ర ఏర్పాటు వల్లనే అనేది నిర్వివాదాంశం. తెలంగాణ ఉద్యమంపై మరిన్ని చరిత్రాత్మక సినిమాలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

-జి.అశోక్, గోదూర్, జగిత్యాల జిల్లా

ప్రభుత్వ దవాఖానలకు మంచి రోజులు

ప్రభుత్వ దవాఖానాల్లో సదుపాయాలు మెరుగవుతున్నాయి. పేదలకు మంచి వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక దవాఖానల్లోనూ సమూల మార్పులు తేవాలి. చిన్న వ్యాధులకు పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అక్కడే చికిత్స లభించేలా తీర్చిదిద్దాలి.

- సీహెచ్ సైదులు, నల్గొండ

చైనా కవ్వింపు చర్యలు


భారత్, భూటాన్, చైనా ట్రైజంక్షన్ వద్ద చైనా అక్రమంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. దీన్ని భారత్ అడ్డుకోవడంతో చైనా కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నది. భారత్ సంయమనంతో ఉన్నా చైనా చేస్తున్న హెచ్చరికలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చైనా ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోవాలి.

- మాటూరి రవి, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

మన 'హీరో' పైడి జైరాజ్

నివాళి



వారాల ఆనంద్

ఆర్థికమైన విజయాలను మాత్రమే పరిగణనలోకి తీసుకునే తెలుగు సినిమారంగం కళాత్మకతను ఎప్పుడో మర్చిపోయింది. అంతేకాదు ఒక ప్రాంతం నుంచి ఎదిగి వచ్చిన వారిని విస్మరించడం తెలుగు సినిమాకు పరిపాటయ్యింది. అలా ఇప్పటికీ తెలుగు సినిమా రంగం విస్మరించిన తెలంగాణ సినీ తేజం పైడి జైరాజ్ ఒకరు. హిందీ సిని మా రంగం భూమికగా ఎదిగి దేశవ్యాప్తంగా పేరు గడించి డెబ్బై ఏళ్ల పాటు సినిమా రంగంలో వెలుగొందిన గొప్ప నటుడు. 1931లో 'ఆలం ఆరా' తో భారతీయ సినిమా రంగం మాటలు నేర్వకముందే మూకీ యుగంలో నే భారతీయ సినిమా రంగంలో తన ముద్రను నిలిపిన పైడి జైరాజ్ తెలంగాణ వాడు. నేటికీ తెలుగు సినిమా రంగం ఆయనను అంగీకరించడానికి ఆమోదించడానికి సిద్ధంగా లేకపోవడం తెలుగు సినిమా లోకంలోని డొల్లతనాన్ని తెలియజేస్తున్నది. ప్రతిష్ఠాత్మకమైన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును 1980లోనే అందుకొని టవరింగ్ పర్సనాలిటీగా నిలిచిన జైరాజ్ నటుడిగానే కాదు, దర్శకుడిగా నిర్మాతగా కూడా సినీ రంగంలో కృషిచేశాడు. జైరాజ్ 11మూకీ సినిమాల్లో, 156 టాకీ సినిమాల్లో హీరోగా నటించారు. ఇంకా అనేక సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ నటించారు. దర్శకుడిగా 1945లో 'ప్రతిమ', 1951లో 'సాగర్', 1959లో 'రాజ్‌ఘర్' సినిమాలకు దర్శకత్వ బాధ్యతలు నిర్వహించాడు. నిర్మాతగా పీజే ఫిల్మ్ యూనిట్ బ్యానర్ మీద నర్గీస్ కథానాయికగా 'సాగర్' సినిమాను నిర్మించాడు. హిందీ, ఉర్దూ, గుజరాతీ, మరాఠీ భాషల్లో నటించిన జైరాజ్ ఉత్తర భారతంలో ప్రసిద్ధి పొందిన నటుడు. కేవలం సినిమానే కాకుండా 1990లో 'ఖూన్ భారీ మాంగ్' టీవీ సీరియల్‌లో కూడా నటించాడు.

తెలుగులో సుప్రసిద్ధ నటుడు చిత్తూరు నాగయ్యతో కలిసి ఒక తెలుగు సినిమాను నిర్మించడానికి ప్రణాళికలు వేసుకున్న పైడి జైరాజ్ నాగయ్య మరణంతో ఆ ప్రాజెక్టును చేయలేకపోయానని చెప్పుకున్నారు. ఏడు దశాబ్దాలపాటు సినీరంగంలో ఉండి మూడుతరాల నటీనటులతో మూకీ, టాకీ సినిమాలతో పాటు టీవీల్లో కూడా నటించి దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు గడించిన తెలంగాణ బిడ్డను తెలుగు సినిమారంగం ఏనాడూ కనీసం స్మరించుకోలేదు. దానికి.. 'జైరాజ్ తెలుగులో నటించలేదు కదా, బొంబాయి వెళ్లిపోయాడు కదా' అని సన్నాయి నొక్కులు నొక్కుతారు. వాస్తవానికి ప్రముఖ తెలుగు నటుడు, నిర్మాత, దర్శకుడు ఎల్.వి.ప్రసాద్ కూడా తన సినీ ప్రస్థానాన్ని బాంబేలోనే ప్రారంభించాడు కదా.


కానీ పైడి జైరాజ్ బాంబే వెళ్లడానికి గల నేపథ్యాన్ని తెలుగు సినిమా రంగం ఎప్పుడూ అర్థం చేసుకునే ప్రయత్నం చేయలేదు. తాను పుట్టిన కరీంనగర్, పెరిగిన హైదరాబాద్ నిజాం రాజ్యం ఫలితంగా హిందీ, ఉర్దూల్లో జైరాజ్‌కు మంచి ప్రావీణ్యం, ప్రతిభ ఉన్నది. ఇది ఆయన బొంబాయి వెళ్లడానికి ప్రధాన కారణం. అప్పటికి నైజాం ప్రాంతంలో బొంబాయి సినిమాల ప్రభావం ఎక్కువగా ఉండటం కూడా మరో కారణం. 1928లో తన 19వ ఏట జైరాజ్ బొంబాయి చేరుకున్నాడు. అప్పటికి తెలుగు సినిమా ఊపిరి పోసుకోలేదు. మూకీ సినిమాలకు మద్రాసు కేంద్రంగా కనిపిస్తున్నప్పటికీ భక్తప్రహ్లాద వచ్చిన తర్వాతగాని తెలుగు సినిమాకు ఉనికి గుర్తింపు కలుగలేదు. మూకీ సినిమాల కాలంలో మొదట తమిళ, తెలుగు, మలయాళంలో దాదాపు సమాంతరంగా సినిమాలు వెలువడ్డాయి. పైడి జైరాజ్‌కు అప్పటికే 1929లో మావరెర్కర్ అనే నిర్మాత తన సినిమాలో అవకాశం కల్పించాడు. అలా మొదలైన జైరాజ్ ప్రస్థానం అప్రతిహతంగా సాగింది. జైరాజ్ మంచి శారీరక సౌష్ఠవం గంభీరమైన మాట సరళితో తొలి రోజుల్లోనే గుర్తింపు తెచ్చుకున్నాడు. భారతీయ సినిమా రంగంలో మొట్టమొదటిసారి గుర్రంపై స్వారీచేసి నటించిన నటుడిగా పేరు తెచ్చుకున్నాడు. అప్పటికి బాంబేలో పృథ్వీరాజ్ కపూర్ లాంటి నటుల హవా ఉన్నప్పటికీ తెలంగాణ నుంచి వెళ్లి తన స్థానాన్ని పదిల పర్చుకోవడమే కాకుండా అప్పటికే లబ్ధి ప్రతిష్ఠులైన అనేకమంది నటీమణులతో హీరోగా నటించి నిలదొక్కుకున్నాడు జైరాజ్.

1931లో టాకీలు మొదలైన కాలంలో నటీనటులు తమ పాటలను తామే పాడుకునే పద్ధతి ఉండేది. జైరాజ్ స్వయంగా పాట పాడుకోలేకపోవడంతో చాలా మంది మూకీ కాలపు నటులతో పాటు తొలుత కొంత ఇబ్బంది పడ్డాడు. కానీ ఆయన స్పురద్రూపం, డైలాగ్ పలుకడంలోని నైపుణ్యం ఉపయోగపడ్డాయి.

సుప్రసిద్ధ కవి భారత కోకిల సరోజినీనాయుడు భర్త గోవిందరాజులు నాయుడుకు జైరాజ్ మేనల్లుడవుతారు. జయరాజ్‌కు ఇద్దరు అన్నలు. ఒకరు సుందర్‌రాజ్ నాయుడు, దీన్ దయాళ్ నాయుడు. 1909 సెప్టెంబర్ 28న కరీంనగర్‌లో జన్మించిన జైరాజ్ హైదరాబాద్ నిజాం కాలేజీలో చదివి సినిమాలపై ఇష్టంతో 1928లో బొంబాయి చేరుకున్నారు. తన ఇరువయ్యో ఏట 1930లో తొలిసారిగా 'స్పార్క్లింగ్ యూత్' అనే మూకీ చిత్రంలో నటించారు. అదే సంవత్సరంలో 'ట్రయంఫ్ ఆఫ్ లవ్' అనే చిత్రం లో కథానాయకునిగా నటించారు. జైరాజ్ మొత్తం 11 మూకీ చిత్రాల్లో నటించారు. 1931లో ప్రారంభమైన టాకీ యుగంలో ఆయన 'షికారి' ఉర్దూ చిత్రంతో టాకీల్లో ప్రవేశించారు. తర్వాతి కాలంలో శాంతారాం, పృథ్వీరాజ్ కపూర్ లాంటి వాళ్లు హీరోలుగా వెలుగుతున్న కాలంలోకూడా పెద్ద హీరోగా పేరు తెచ్చుకున్నారు. నిరుపారాయ్, శశికళ, దేవికారాణి, మీనాకుమారి లాంటి హీరోయిన్లతో నటించారు.

11 మూకీ సినిమాల, తర్వాత సుమారు 156 'టాకీ' సినిమాల్లో కథానాయకుడిగా, విలక్షణమైన నటుడిగా పలు వైవిధ్యమైన పాత్రలు పోషించారు. హీరో పాత్రలతోపాటు అనేక వైవిధ్యమైన పాత్రలు పోషించిన జైరాజ్ తాను మాత్రం దేశ నాయకుల పాత్రలు, చారిత్రక పాత్రలు ఎంతో ఉత్సాహాన్నీ సంతృప్తిని కలిగించాయని చెప్పుకున్నారు. జైరాజ్ పోషించిన టిప్పుసుల్తాన్, పృథ్వీరాజ్ చౌహాన్, రాణాప్రతాప్ మొదలైన చారిత్రక సంబంధ పాత్రలు విశిష్ఠమైనవి. షాహిద్ ఏ ఆజమ్‌లో ఆయన పోషించిన చంద్రశేఖర్ ఆజాద్ పాత్ర విలక్షణమైంది.

భారతీయ సినీరంగంలో కరీంనగర్‌కు తెలంగాణకు విశిష్ఠమైన స్థానాన్ని గుర్తింపును తెచ్చిన పైడి జైరాజ్ భార్య సావిత్రి పంజాబీ. వారి పెళ్లిని పృథ్వీరాజ్‌కపూర్ తండ్రి జరిపించాడని చెబుతారు.ఆయనకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. 2000, ఆగస్టు 11న ఆయన పరమపదించారు. తెలంగాణ బిడ్డ అయిన పైడి జైరాజ్‌ను ఈ గడ్డ స్మరించుకుంటున్నది. ప్రభుత్వం కూడా ఆయన పేర జాతీయస్థాయిలో అవార్డును నెలకొల్పేందుకు పూనుకున్నట్టు తెలిసి తెలంగాణవాదులు, తెలంగాణలో సినిమా అభివృద్ధిని కాంక్షిస్తున్న వాళ్లు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



కాళేశ్వరం.. త్రిముఖ వ్యూహం!

- ఏడాదిలో కళకళ తథ్యం!



ఈ ఫొటో చూశారా! ఉత్తర తెలంగాణకు వరప్రదాయినిగా చెప్తూ సమైక్య పాలకులు నిర్మించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దుస్థితి ఇది. ప్రస్తుతం ఎగువ నుంచి వరద రాక, గత పాలకులకు చిత్తశుద్ధి లేక ప్రాజెక్టులో రాళ్లు తేలాయి. వాస్తవంగా ఈ ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ 1091అడుగులు(90 టీఎంసీలు). ఈ మేరకు 1978లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నది. ఆ ఒప్పందంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం మహారాష్ట్రకు అస్త్రంగా మారింది. ఒక రాష్ట్ర ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్‌లో ఎగువ రాష్ట్రం మరో ప్రాజెక్టును నిర్మించడం అసాధ్యం. కానీ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు విషయంలో అదే జరిగింది. ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ పరిధిలో మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్టు నిర్మించినా సాంకేతికంగా నిలదీయలేని దుస్థితి. ఒప్పందంలో జాగ్రత్తలు తీసుకోకపోవడమే ప్రధానకారణమని రిటైర్డ్ ఇంజినీర్ కొండపల్లి వేణుగోపాల్‌రావు తెలిపారు. అందువల్లే ప్రస్తుతం ఎస్సారెస్పీ డెడ్‌స్టోరేజీకి చేరడంతో 9.3 టీఎంసీల నీరున్నది. కానీ దుస్థితి ఈ ఏడాదికే పరిమితం కానున్నది. గురువారం పోచంపాడ్ వద్ద ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి శంకుస్థాపన చేసిన సీఎం కేసీఆర్ వచ్చే వానాకాలం నాటికి మేడిగడ్డ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తామని శపథం చేశారు. వచ్చే ఏడాది ఎగువన నుంచి చుక్క వరద నీరురాకున్నా, పునర్జీవంతో ఎస్సారెస్పీలో జలకళ ఉట్టిపడనున్నది. **- హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

మా బోర్లలో నీళ్లొస్తయ్



నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. మా బోర్లు, బావుల్లో నీళ్లు లేవు. ఎస్సారెస్పీలో నీరు నిండుగా ఉన్నప్పుడు మా బోరుబావుల్లో నీళ్లు ఉండేవి. ఇప్పుడు ఎస్సారెస్పీలో నీరు సరిగా రాకపోవడంతో బోరుబావులు ఎండిపోతున్నాయి. సీఎం కేసీఆర్ సార్ ఎస్సారెస్పీకి మళ్లీ ప్రాణం పోస్తున్నడు. ఆ విషయం తెలిసే ఈ సభకు అచ్చిన. సీఎం సారుపై నమ్మకం ఉంది. 365 రోజులు నీళ్లుంటే మాకు చేతినిండా పని ఉంటది.

– గడ్డం మల్కన్న, వన్నెల్ (బి), బాల్కొండ , నిజామాబాద్ జిల్లా

నాలుగేండ్ల నుంచి సాగునీళ్లు లేవ్



నాకు ఎకరం భూమి మా ఊరి చెరువు కింద ఉన్నది. చెరువులో నీళ్లు లేవు. నాలుగేండ్లు నుంచి చెరువుల్లో నీరు నింపుతలేరు. చెరువు వరకు పోచంపాడ్ నీళ్లు కొన్నిమాత్రమే వస్తున్నాయి. ఆ చెరువు కింద 700 నుంచి 800 ఎకరాల ఆయకట్టు ఉంది. అసలే పారడం లేదు. సీఎం కేసీఆర్ తలపెట్టిన ఈ ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో మళ్లీ మా చెరువులు నిండుతాయి.

– ముత్తన్న, బషీరాబాద్, భీమ్‌గల్, నిజామాబాద్ జిల్లా

కాకతీయ కాల్వతో మా భూములకు నీళ్లు



మా ఊరి పక్క నుంచే కాకతీయ కాలువ పోతుంది. కాకతీయ కాలువలో పూర్తిస్థాయిలో నీరు పారకపోవడంతో మా ఊరి భూములకు సరిగా సాగునీరు అందడం లేదు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో ఎస్సారెస్పీ నిండుతుందని అనుకుంటున్నాం. కాకతీయ కాల్వ నుంచి మా భూములకు నీళ్లందుతయ్.

–పీ చంద్రశేఖర్‌రెడ్డి,ఏర్గట్ల, నిజామాబాద్ జిల్లా

మహిళలకు సార్ మస్తు చేస్తున్నడు



తెలంగాణ తెచ్చుడే కాదు ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల కోసం మస్తు పనులు చేస్తుండు. వృద్ధాప్య, వితంతు ఫించన్లు ఇచ్చి ఇంటికి పెద్దకొడుకులా ఆదుకున్నడు.ఇంటింటికీ నల్లా ఇప్పిచ్చుడే కాదు, ఇప్పుడు ఊరూరా బోర్లలో చెరువుల్లో నీళ్లు ఉండేలా పనుల కోసం వస్తుండని తెలుసుకొనే ఈ సభకు వచ్చినం.

– బాలవ్వ, కమ్మర్‌పల్లి, నిజామాబాద్ జిల్లా

ఒక్క ప్రాజెక్టుతో
మూడు మార్గాల్లో గోదారి పరుగు

లోయర్ మానేరుడ్యాంకు జీవం...
ఎస్సారెస్పీకి పునర్జీవం

దక్షిణ తెలంగాణ పొలాలను
తడుపనున్న జీవనది

ప్రాజెక్టులో భాగంగా 36 లక్షల
ఎకరాలకు ప్రాణం

చారిత్రాత్మకంగా నిలిచిపోతున్న
ప్రాజెక్టుల రీడిజైనింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు అందించాలనేది ఒక సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలోని ఉద్దేశం. అదే ప్రాజెక్టు ఇతర ప్రాజెక్టులకు జీవం పోయడంతోపాటు, పునర్జీవం కల్పించడమనేది కొత్త చరిత్ర. సాగునీటిరంగంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ఇలాంటి చరిత్రను లిఖించబోతున్నది. ఉమ్మడిరాష్ట్రంలో గోసపడిన తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్ ఘనత ఇది. బంగారు తెలంగాణ నిర్మాణాన్ని భుజాన వేసుకున్న సీఎం కేసీఆర్ ఓ ఇంజినీర్‌లా మారి, సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పనలో చరిత్రను తిరుగరాస్తున్నారు. ఉత్తర తెలంగాణకు వర ప్రదాయినిగా ఉన్న గోదావరిని దక్షిణ తెలంగాణకు మళ్లించి, పల్లేర్లు మొలిచిన నేలలో బంగారం పండించడంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా త్రిముఖ వ్యూహాన్ని అమలు చేయబోతున్నారు. లోయర్ మానేరు డ్యాంకు జీవం పోసి, ఎస్సారెస్పీకి పునర్జీవం కల్పించడంతో పాటు దక్షిణ తెలంగాణకు నీళ్లు పారించడమే ప్రస్తుత ప్రణాళిక. గోదావరిపై తలపెట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం రాష్ట్ర సాగునీటి రంగంలో పెను మార్పులకు కేంద్ర బిందువు. దీని ద్వారా గోదావరి జలాలను అత్యధికంగా వినియోగించుకోవడమనేది ప్రధాన లక్ష్యంగా పైకి కనిపిస్తున్నప్పటికీ రీడిజైనింగ్ మూలాల్లో త్రిముఖ వ్యూహం ఉన్నది. కాళేశ్వరం ప్రాజెక్టుకు మూలాధారమైన భారీ బరాజ్ నిర్మాణ ప్రదేశాన్ని మేడిగడ్డ వద్ద ఎంపిక చేయడమే గొప్ప మలుపు. గోదావరిలో ఇక్కడ నీటి లభ్యత పుష్కలంగా ఉన్నదని అనేక సాంకేతిక అధ్యయనాలు తేల్చిచెప్పాయి. అందుకే మేడిగడ్డ కేంద్రంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రభుత్వం రూపకల్పన చేసింది. మేడిగడ్డ వద్ద నీటి లభ్యత పుష్కలంగా ఉండటంతో పలు విధానాలు వినియోగించుకునేందుకు ఆస్కారం ఏర్పడింది. పుష్కలంగా ఉన్న నీటి వనరులను పద్ధతిగా వాడుకుంటే తెలంగాణ కోటి ఎకరాల మాగాణంగా మారుతుందనే సత్యాన్ని ఏడాదిలో రుజువు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కేవలం మెరుపువేగంతో ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నది.



గురువారం నిజామాబాద్ జిల్లా పోచంపాడ్‌లో ఏర్పాటు చేసిన శ్రీరాంసాగర్ పునర్జీవ పథకం శంకుస్థాపన సభకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు

ఎత్తిపోతల పథకాల్లో కొత్త కోణం

తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాలను బీడు భూములకు తరలించాలంటే భారీ ఎత్తిపోతల పథకాలు అనివార్యం. ఇప్పటివరకు ఎత్తిపోతల పథకాలను పరిశీలిస్తే వాటిలో వినియోగించే మోటర్ల సామర్థ్యం ఒకేలా ఉంటుంది. ఎలిమినేటి మాధవరెడ్డి, కల్వకుర్తి, కాళేశ్వరం తదితర ప్రాజెక్టుల్లో వంద, ఆపై మీటర్ల ఎత్తులో నీటిని ఎత్తిపోయాలనే లక్ష్యంగా మోటర్ల తయారీ ఉంటుంది. ఆ మేరకు 300–600 క్యూసెక్కుల డిశ్చార్జికి తగ్గట్టుగానే డిజైన్ చేస్తారు. ఏఎమ్మార్పీలో ఒక్కో మోటరు ద్వారా 600 క్యూసెక్కుల డిశ్చార్జి ఉంటుంది. ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలోని మోటర్ల డిజైన్ భిన్నం. ఇందులో ఎత్తు ప్రధానం కాదు. డిశ్చార్జి ఎక్కువగా ఉండాలనేది లక్ష్యం. వరదకాల్వ లోతు పది మీటర్లు మాత్రమే. ఈ క్రమంలో మోటర్ల హెడ్ గరిష్ఠంగా తొమ్మిది మీటర్ల వరకు ఉంటున్నందున మోటర్ల డిజైన్‌లో పదిమీటర్లను ప్రామాణికంగా తీసుకుంటున్నామని ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. కానీ డిశ్చార్జి మాత్రం ఇతర ప్రాజెక్టుల్లో కంటే రెట్టింపు, అంతకంటే ఎక్కువగా ఉంటుందన్నారు. పునర్జీవ పథకంలో భాగంగా రెండు దశల్లో పది మీటర్లు, ఒక దశలో పదకొండు మీటర్ల మేర మాత్రమే లిఫ్టు ఉంది. కానీ డిశ్చార్జి మాత్రం ఒక్కో మోటారు నుంచి 1300 క్యూసెక్కుల పైమాటే. ఇలా ఒక్కో దశలో ఏర్పాటు చేసే మోటర్ల ద్వారా 8800 క్యూసెక్కులకుపైగా నీటిని ఎత్తిపోయనున్నారు.

వ్యూహం-1: 36 లక్షల ఎకరాలకు సాగునీరు

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం డిజైన్ ప్రకారం 18.80 లక్షల కొత్త ఆయకట్టు, మరో 18 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టు స్థిరీకరణ ప్రధాన లక్ష్యం. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసి అన్నారం, సుందిల్ల బరాజ్‌ల ద్వారా ఎల్లంపల్లికి తరలిస్తారు. అటు నుంచి మిడ్‌మానేరు, ఆపై పలు రిజర్వాయర్ల ద్వారా కీలకమైన మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లలోకి తరలించి సాగునీరు అందిస్తారు. ఈ క్రమంలోనే 151 టీఎంసీలకుపైగా గోదావరిజలాలను నిల్వ చేయనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడం, నీటిని నిల్వ చేసుకోవడమనేది ప్రధాన లక్ష్యం. వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పటికీ ఏటా రెండు పంటలు పండించేలా చూడటమే దీని ఉద్దేశం

వ్యూహం-2: లోయర్ మానేరుకు జీవం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ నుంచి తరలించిన నీటిని ఎలాగూ మిడ్‌మానేరు ద్వారా తీసుకెళ్తారు. ఇక్కడి నుంచి లోయర్ మానేరుడ్యాంకు నీటిని తరలించనున్నారు. దీంతో ప్రధాన గోదావరిలో తగ్గుతున్న నీటి లభ్యతతో ఆందోళనకరంగా ఉన్న శ్రీరాంసాగర్, లోయర్‌మానేరుకు కాళేశ్వరం ప్రాజెక్టు జీవం పోసినట్టవుతుంది. అలాగే ఎస్సారెస్పీపైనా భారం గణనీయంగా తగ్గుతుంది. ఎస్సారెస్పీ ద్వారా ఎల్ఎండీ వరకు ఉన్న ఆయకట్టుకు నీరందించి, మిడ్‌మానేరు–ఎల్ఎండీ గోదావరి జలాల తరలింపు ద్వారా ఎల్ఎండీ దిగువన ఉండే ఎనిమిదిన్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించనున్నారు. దీంతో చివరి ఆయకట్టుకూ పుష్కలంగా సాగునీరు అందనున్నది.

వ్యూహం-3: ఎస్సారెస్పీకి పునర్జీవం

వాస్తవంగా ఎస్సారెస్పీ డిజైన్ సమయంలో నీటి లభ్యత 196 టీఎంసీలుగా అంచనా వేశారు. మానేరు ద్వారా ఎల్ఎండీకి మరో 12 టీఎంసీలు వస్తుందని భావించి 208 టీఎంసీల లభ్యతను లెక్కగట్టారు. ఎగువన మహారాష్ట్ర గోదావరి నీటిని ఒడిసిపట్టడంతో నీటి లభ్యత 54 టీఎంసీలకు పడిపోయింది. ఐదారేండ్లుగా లభ్యత మరింతగా తగ్గింది. అందుకే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు జలాలను తరలించే క్రమంలో వరదకాల్వ ద్వారా జలాల్ని ఎస్సారెస్పీలోకి రివర్స్ పంపింగ్ చేసేందుకే పునర్జీవ పథకాన్ని రూపొందించారు. కేవలం రూ.1067 కోట్లతో 60 టీఎంసీల జలాల్ని తరలించేలా ప్రాజెక్టును డిజైన్ చేయడమనేది ఒక రికార్డు.

ఉత్తర తెలంగాణ సస్యశ్యామలమే లక్ష్యం

నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల,నమస్తే తెలంగాణ ప్రతినిధి: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవం పోసి ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. టీఆర్ఎస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో పోచంపాడ్ ట్రాక్టర్ల ర్యాలీని జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎంపీ కవిత జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలోని లక్షలాది ఎకరాలకు నీరందించనున్నామని చెప్పారు. ఒకే సంవత్సరంలో లక్ష్యం మేరకు ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరం నుంచి పోచంపాడుకు నీటిని ప్రతిరోజు 1టీఎంసీ వరకు తరలిస్తారని, దీనివల్ల ఏడాది పొడుగున వరద కాలువలో నీరు నిల్వ ఉంటుందని చెప్పారు. భూగర్భ జలాలు సైతం పెరుగుతాయన్నారు. ఏడాదిలో కనీసం 60టీఎంసీల నీటిని వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీకి తరలించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎస్సారెస్పీని నింపడం వల్ల ప్రాజెక్టు ఆయకట్టు రైతులు రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ రివర్స్ పంపింగ్ ద్వారా నీటి ప్రాజెక్టులో నీటి నిల్వ చేయడం గొప్ప పథకమన్నారు. దీంతో ఆయకట్టులో రెండు పంటలకు డోకా ఉండదని అనంతరం టీఆర్ఎస్ జగిత్యాల నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో 80ట్రాక్టర్లతో రైతులు, నాయకులు తరలివెళ్లారు.



పోచంపాడ్ సభకు వెళ్లే ట్రాక్టర్ల ర్యాలీని జగిత్యాలలో జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, నియోజక వర్గ ఇన్‌చార్జి సంజయ్ కుమార్ కూడా ఉన్నారు.

నేరెళ్ల ఘటనలో ఎస్సైపై వేటు

- రవీందర్ సస్పెన్షన్‌కు డీజీపీ ఆదేశం
- చర్యలు తీసుకున్న ఐజీ నాగిరెడ్డి
- మంత్రి కేటీఆర్ చొరవతో ఘటనపై విచారణ
- ఎస్సై దురుసుగా వ్యవహరించారని నివేదిక
- ట్విట్టర్‌లో వెల్లడించిన మంత్రి కేటీఆర్
- బాధితులకు హామీ ఇచ్చిన 48 గంటల్లో చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

నేరెళ్ల ఘటనలో ఎస్సై రవీందర్‌పై వేటు పడింది. అత్యుత్సాహం ప్రదర్శించి ప్రజలపై తీవ్రంగా లాఠీచార్జీకి దిగిన ఎస్సైని సస్పెండ్ చేశారు. ఆయన దూకుడుగా వ్యవహరించి, తీవ్రంగా లాఠీచార్జీ చేయడంవల్లనే పలువురికి తీవ్ర గాయాలైనట్టు శాఖాపరంగా డీఐజీ రవివర్మ చేసిన విచారణలో తేలింది. విచారణ నివేదికను పరిశీలించిన డీజీపీ అనురాగ్‌శర్మ.. ఎస్సైని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం వరంగల్ జోన్ ఐజీ నాగిరెడ్డి ఎస్సై సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేశారు. కొద్దిరోజుల క్రితం మిడ్‌మానేరు నుంచి ఇసుకను రవాణా చేస్తున్న లారీకింద పడి ప్రమాదవశాత్తూ భూమయ్య అనే వ్యక్తి మరణించాడు. దీనితో కోపోద్రిక్తులైన కొందరు ఇసుక లారీలను దగ్ధం చేశారు. ఈ సంఘటనలో పోలీసులు జరిపిన లాఠీచార్జీలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. లారీల దహనం కేసులో పోలీసులు పలువురిపై కేసులు పెట్టి జైలుకు పంపించారు. అయితే తీవ్రంగా గాయాలైన బాధితులను తీసుకోవడానికి జైలు అధికారులు అంగీకరించకపోవడంతో విషయం బయటకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ సంఘటనకు రాజకీయ, కులం రంగులు పులిమేందుకు కాంగ్రెస్ తదితర పార్టీలకు చెందిన నేతలు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో మంత్రి కే తారకరామారావు నేరెళ్ల ఘటన బాధితులను మంగళవారం దవాఖానలో పరామర్శించారు. వారినుంచి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొంటూ బాధితులకు అండగా ఉంటామన్నారు. బాధితులు పోలీసులపై ఫిర్యాదు చేయడంతో తప్పు చేసిన వారు ఎవరైనా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన మంత్రి, ఈ ఘటనపై విచారణ జరుపాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. ఈ మేరకు డీజీపీ అనురాగ్‌శర్మ ఆదేశంతో ఐజీ నాగిరెడ్డి వరంగల్ డీఐజీ రవివర్మను విచారణకు ఆదేశించారు. బుధవారం బాధితుల నుంచి వాంగ్మూలం, సంఘటనస్థలంలో ప్రత్యక్ష సాక్షుల నుంచి సమాచారం సేకరించిన డీఐజీ, సంఘటనలో పోలీసుల పాత్రపై ఆరాతీశారు. విచారణ నివేదికను గురువారంనాడు ఐజీ నాగిరెడ్డికి అందజేయగా ఆయన డీజీపీ అనురాగ్‌శర్మకు నివేదించారు. సీసీఎస్ ఎస్సై రవీందర్ దూకుడుతనం, లాఠీచార్జీ వల్లే పరిస్థితి మారిందన్న విషయాన్ని అందులో స్పష్టం చేశారు. దీనితో ఎస్సైపై చర్యలకు అనురాగ్‌శర్మ ఆదేశించారు. ఆ మేరకు ఎస్సై రవీందర్‌ను సస్పెండ్ చేసినట్టు ఐజీ నాగిరెడ్డి తెలిపారు. విచారణలో రవీందర్ దూకుడు వ్యవహారం, తప్పిదం కనిపిస్తుందని పేర్కొన్నారు.



సస్పెండయిన ఎస్సై రవీందర్



మంత్రి కేటీఆర్ ట్వీట్

ఎస్సై సస్పెన్షన్ విషయాన్ని మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో వెల్లడించారు. బాధితులను పరామర్శించిన సందర్భంగా వారికిచ్చిన హామీ మేరకు డీఐజీతో విచారణ చేయించామని తెలిపారు. సంఘటనలో సదరు పోలీసు అధికారి అతిగా ప్రవర్తించాడన్న నివేదిక ఆధారంగా బాధ్యుడైన ఆ అధికారిపై సస్పెన్షన్ వేటు వేసినట్టు పేర్కొన్నారు.

'మల్లన్నసాగర్' టెండర్‌పై స్టేకు నిరాకరణ

కొంతమంది కోసం ప్రాజెక్టు పనులను నిలిపివేయలేమన్న హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం జారీచేసిన టెండర్ నోటిఫికేషన్ నిలిపివేయాలనే అభ్యర్థనలను ఉమ్మడి హైకోర్టు తోసిపుచ్చింది. ప్రాజెక్టుకు అవసరమయ్యే వేల ఎకరాల భూమిలో అధికశాతం ప్రజానీకం భూములు ఇచ్చినప్పుడు, కొంతమంది కోసం రిజర్వాయర్ పనులను నిలిపివేయడం సరికాదని న్యాయస్థానం పేర్కొన్న ది. మల్లన్నసాగర్ నిర్మాణానికి గతనెల 29న జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ రద్దుచేయాలని సిద్దిపేట జిల్లా వేములఘాట్‌కు చెందిన ఆరుగురు పిటిషన్ దాఖలుచేశారు. గురువారం ఈ వ్యాజ్యంపై జస్టిస్ ఏ రామలింగేశ్వర్‌రావు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం 17వేల ఎకరాల భూమిని యజమానుల నుంచి సేకరించాల్సి ఉండగా, గరిష్ఠంగా సేకరణ పూర్తయిందని, 1600 నుంచి 2 వేల ఎకరాలు మాత్రమే సేకరించాల్సి ఉందని ప్రభుత్వం తరపున ఏజీ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వివరించారు. భూసేకరణ చట్టం –2013 ప్రకారం భూములను సేకరించడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. పర్యావరణ అనుమతులపై గ్రీన్‌ట్రిబ్యునల్‌లో పిటిషన్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. తాగునీటి వసతి కోసం ప్రాజెక్టు పనులు చేస్తున్నామని వివరించారు. పరిహారం చెల్లింపు తదితర అభ్యంతరాలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ప్రాజెక్టు పనులను నిలిపివేయాలనే దురుద్దేశంతో కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. టెండర్ నోటిఫికేషన్లపై స్టే విధించడానికి నిరాకరించింది. ప్రభుత్వాన్ని కౌంటర్ దాఖలు చేయాలని చెప్తూ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

వేదపండితుడి వైద్యానికి 15 లక్షలు మంజూరు చేసిన సీఎం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అనారోగ్యంతో బాధపడుతున్న కరీంనగర్‌కు చెందిన వేదపండితుడు కే శంకరశర్మకు రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సాయం అందించారు. శంకరశర్మ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి నుంచి రూ.15లక్షలు మంజూరుచేశారు. ముఖ్యమంత్రి తమ అభ్యర్థనను మన్నించి వైద్యఖర్చులకు నిధులు మంజూరుచేశారని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు ఎం వెంకటరమణశర్మ కృతజ్ఞతలు తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు గడువు పెంపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అక్టోబర్ 5 నుంచి ప్రారంభం కానున్న ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపు గడువును పొడిగించారు. ఈ నెల 16 నుంచి 21 వరకు తత్కాల్ పథకం ద్వారా పరీక్ష ఫీజులు చెల్లించడానికి అవకాశం ఇచ్చామని ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ బాలయ్య పేర్కొన్నారు. ఎస్సెస్సీ పరీక్షలకు రూ.500, ఇంటర్మీడియట్ పరీక్షలకు రూ.వెయ్యి చెల్లించాలని చెప్పారు.

రహదారుల భద్రతకు 'స్మార్ట్ స్ట్రీట్స్ ల్యాబ్ ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆధునిక పరిజ్ఞానంతో రహదారుల భద్రతను మెరుగుపర్చుకోవచ్చని రాష్ట్ర ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ చెప్పారు. రహదారుల భద్రతపై డబ్ల్యూఆర్ఐ ఇండియా– రాస్ సెంటర్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్మార్ట్‌స్ట్రీట్స్ ల్యాబ్' అనే వినూత్న కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అవసరమేనన్నారు. డబ్ల్యూఆర్ఐ ఇండియా– రాస్ సెంటర్ డైరెక్టర్ జ్యోతి చడ్డా మాట్లాడుతూ స్మార్ట్ స్ట్రీట్ ల్యాబ్ ప్రయోగంతో రోడ్డు ప్రమాదాల్ని నిరోధించవచ్చని చెప్పారు. ఐఎస్‌బీహెడ్ అరుణారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్మార్ట్ స్ట్రీట్స్ ల్యాబ్‌లో భాగంగా తెలంగాణ ఐటీ విభాగం హైదరాబాద్ వీధులను సుందరంగా తీర్చిదిద్దడానికి సరికొత్త డిజైన్ల కోసం ఆన్‌లైన్ పోటీలు ఏర్పాటు చేసింది. www. wricitieshub.org/ smartstreetslabలో దరఖాస్తులను నమోదు చేయాలని డబ్ల్యూఆర్ఐ ఇండియా– రోస్ సెంటర్ తెలియజేసింది.

పెరుగుతున్న ప్రమాదాలు: కేంద్రం వెల్లడి

ద్విచక్రవాహనాల వినియోగం పెరిగి, రహదారుల భద్రతపై పెనుప్రభావం పడిందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ తాజా నివేదిక వెల్లడించింది. 2014 నుంచి 2015 దాకా భారత్‌తో 2.5 శాతం రోడ్డు ప్రమాదాలు పెరిగాయని, దుర్మరణం పాలైన వారి శాతం 4.6కు చేరుకున్నదని గాయపడ్డవారి సంఖ్య 1.4 శాతం అధికమైందని తెలిపింది.

ఒంటరి మహిళలు, అనారోగ్య బాధితులకు బదిలీల్లో అవకాశం!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ, ఏపీల మధ్య ఉద్యోగుల బదిలీల్లో ఒంటరి మహిళలకు, అనారోగ్య బాధితులకు అవకాశం కల్పిస్తామని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్పీ సింగ్ హామీ ఇచ్చారు. అంతర్రాష్ట్ర బదిలీలపై జారీచేసిన జీవోలో వీరికి సంబంధించిన మార్గదర్శకాలు లేకపోవడంతో గురువారం టీఎన్జీవో నాయకులు సీఎస్‌ను కలిసి చర్చించారు. తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లేందుకు విజ్ఞప్తి చేసిన వితంతువులు, ఒంటరిమహిళలు, అనారోగ్యబాధితుల సమస్యను మానవతాదృక్పథంతో పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు. జోనల్, మల్టీజోనల్, రాష్ట్రస్థాయిల్లో అంతరాష్ట్ర బదిలీలకు మార్గదర్శకాలు ఇచ్చినందుకు ప్రభుత్వానికి టీఎన్జీవో నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో ఉన్న తెలంగాణకు చెందిన ఒంటరి మహిళలను, వితంతువులను సొంత రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, నగరశాఖ అధ్యక్షుడు ఆర్ ప్రతాప్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో గురువారం బౌద్ధగురువు దలైలామాను కలిసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఉద్రిక్తతలకు ఉపశమనం సంతోషమే

- 'ఆర్ట్ ఆఫ్ హ్యాపీనెస్'లో దలైలామా సందేశం

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ప్రజలు సంతోషంగా ఉంటే సరిహద్దులు కూడా ప్రశాంతంగా ఉంటాయని బౌద్ధగురువు దలైలామా అన్నారు. ప్రజల మధ్య, రాష్ట్రాలు, దేశాల మధ్య ఆందోళనలు, ఉద్రిక్తతల సడలింపుకు సంతోషమే సరైన ఔషధమని చెప్పారు. భారత్ చైనాలు మిత్రులందంతో కలిసి ఉండాలని ఆకాంక్ష వ్యక్తంచేశారు. ఢిల్లీలో గురువారం 'ఆర్ట్ ఆఫ్ హ్యాపీనెస్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దలైలామాతో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జీవన విధానంలో ప్రతి ఒక్కరూ మానసిక సంతృప్తిని, ఒత్తిడి గురవుతున్నారని, ప్రశాంతత కోసం తపిస్తున్నారని, ఇలాంటి సమయంలో 'ఆర్ట్ ఆఫ్ హ్యాపీనెస్' కార్యక్రమంలో దలైలామా ఇచ్చే సందేశం ఉపశమనంగా ఉంటుందన్నారు.

ఏపీ ప్రాజెక్టులపై జోక్యం చేసుకోం

- చేతులెత్తేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సాగునీటి ప్రాజెక్టుల వివాదాల్లో కేంద్రం కల్పించుకోదని కేంద్ర జలవనరులశాఖ సహాయమంత్రి సంజీవ్ బాల్యాన్ చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య నదీజలాల పంపిణీ, ప్రాజెక్టుల వివాదాల అంశం జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణలో ఉన్నదని, న్యాయపరిధిలోని అంశాల పై బయటినుంచి జోక్యం సరికాదన్నారు. ట్రిబ్యునల్ తుది అవార్డు తర్వాత ఏదేని ప్రాయాలు ఉంటే పరిష్కారం కోసం చొరవ తీసుకుంటామని తెలిపారు. గురువారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్‌ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి వేసిన ప్రశ్నకు ఆయన పైవిధంగా బదులిచ్చారు. కృష్ణా, గోదావరిపై అనుమతులు లేకుండా ఏపీ ప్రాజెక్టులు నిర్మిస్తుంటే కేంద్రం ఏం చర్యలు తీసుకున్నదని జితేందర్‌రెడ్డి ప్రశ్నించారు. కేంద్ర మంత్రి సంజీవ్ బాల్యాన్ బదులిస్తూ పెద్ద ప్రాజెక్టుల అనుమతుల కోసం దరఖాస్తులు వస్తాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అనుమతులు కోరుతూ తమకు ఎలాంటి విజ్ఞప్తులు అందలేదని, అందాల్సిన అవసరం లేదని వివరణ ఇచ్చారు. అనంతరం జితేందర్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులను కొత్త ప్రాజెక్టులుగా చిత్రిస్తూ గత నెలలో కేంద్ర జలసంఘానికి ఏపీ లేఖ రాసిందని, తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ అడ్డుపడుతున్నందునే ఏపీ ప్రాజెక్టుల అంశాన్ని లోక్‌సభలో ప్రస్తావించాల్సి వచ్చిందని చెప్పారు.

బ్యాంకుల రుణాల్లో వివక్ష ఎందుకు?

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: నిరర్థక ఆస్తుల సమస్య పరిష్కారానికి భారతీయ స్టేట్ బ్యాంకులో అనుబంధ బ్యాంకులను విలీనం చేయడం మాత్రమే సరైన పరిష్కారమా అని ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ప్రశ్నించారు. యువకులు రుణాలను మంజూరు చేయడంలో వివక్ష చూపిస్తున్నాయని, బడా పెట్టుబడిదారులకు ఉదారంగా రుణాలిస్తూ.. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇవ్వడంలేదని విమర్శించారు. అనుబంధ బ్యాంకులను భారతీయ స్టేట్ బ్యాంకులో విలీనం చేసే బిల్లు చర్చలో భాగంగా లోక్‌సభలో గురువారం టీఆర్‌ఎస్ ఎంపీ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర లీడ్ బ్యాంకుగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ప్రస్తుతం భారతీయ స్టేట్ బ్యాంకులో కలిసిపోయింది) వార్షిక క్రెడిట్ పరిమితి రూ. 6,365 కోట్లుకాగా దీనికన్నా అధికంగా (రూ. 6,750 కోట్ల వరకు) రుణాలను మంజూరు చేసిందని, ఇందులో గ్రామీణ ప్రాంతానికి రూ.511 కోట్లనే ఇచ్చిందన్నారు. అనంతరం బిల్లుకు టీఆర్‌ఎస్ మద్దతు తెలుపుతుందని ఎంపీ స్పష్టం చేశారు.

ఆరోగ్య తెలంగాణకు సర్కారు కృషి అమోఘం

- గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రశంసలు
- సర్కారు వైద్యంపై నమ్మకం పెరిగింది: మంత్రి లక్ష్మారెడ్డి
- గాంధీ దవాఖానలో అత్యాధునిక సేవలు ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్యరంగంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులతో ఆరోగ్య తెలంగాణ సాధ్యమవుతుందని రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. తక్కువ సమయంలోనే వైద్యరంగంలో ఎంతో ప్రగతి సాధిస్తున్నామన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానలోని ఎమర్జెన్సీ బ్లాక్‌లో 65 పడకల అత్యాధునిక ఇంటెన్సివ్ కేర్ యూనిట్, పౌర సమాజ సమాచార యంత్రం, డిజిటల్ రేడియోగ్రఫీ, సీటీ స్కాన్, సెంట్రల్ డయాగ్నసిస్ లేబొరేటరీని వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి గవర్నర్ ప్రారంభించారు. అనంతరం నరసింహన్ మీడియాతో మాట్లాడుతూ సర్కారు దవాఖానలను ప్రజలంతా తమదిగా భావించాలని కోరారు. 'నేను నమ్మకంగా హామీ ఇస్తున్నా. వచ్చే రెండేండ్లలో తెలంగాణ వైద్య ముఖచిత్రం సమూలంగా మారుతుంది. ఏడాది కిందట నేను గాంధీ దవాఖానకు ఇలా వచ్చి అలా వెళ్లాను. ఎవరినీ కలువలేదు. ఎవరితోనూ మాట్లాడలేదు. కానీ గవర్నర్ గాంధీ దవాఖానకు వచ్చివెళ్లారని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చెప్పారు. ఆ తర్వాత గాంధీలో అద్భుత మార్పులు తీసుకొచ్చారు. ఇప్పుడు మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం చేయాల్సినంత చేసింది. ఇక వైద్యులు, సిబ్బందిదే బాధ్యతంతా. రోగులు కూడా వైద్యులు, అధికారులకు సహకరించాలి' అని గవర్నర్ పేర్కొన్నారు. 'తెలంగాణ ప్రభుత్వం వచ్చి 38 నెలలు అయింది. మొదటి ఏడాది పరికరాలు లేవు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఎలాంటి వైద్య సమస్యలు ఉన్నా గాంధీ దవాఖానకు రండి' అని నరసింహన్ సూచించారు. గాంధీ దవాఖానను సూపర్ స్పెషాలిటీగా తీర్చిదిద్దారంటూ మంత్రి లక్ష్మారెడ్డికి, వైద్య విభాగాలకు అభినందనలు తెలిపారు. 'నేను కూడా సర్జికల్ ఇంటర్‌వెన్షన్ కోసం గాంధీ దవాఖానలోనే చికిత్స చేయించుకున్నా. ప్రభుత్వ దవాఖానల్లో పీపీపీ (పబ్లిక్, ప్రైవేటు పార్టిసిపేషన్) మోడల్ కాదు జీపీపీ (గవర్నమెంట్, పబ్లిక్ పార్టిసిపేషన్) రావాలి' గవర్నర్ పేర్కొన్నారు. ప్రభుత్వ దవాఖానలలో సమస్యలుంటాయని, ప్రతి చిన్న విషయాన్ని పత్రికలు పెద్దగా చూపుతున్నాయన్నారు. సర్కార్ దవాఖానలపై నమ్మకం పెరిగేలా మంచిని మంచిగా చూపాలని సూచించారు. పేదల బాధలు తెలిసిన సీఎం కేసీఆర్ మెరుగైన వైద్యసేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ దవాఖానల అభివృద్ధికి పాటుపడుతున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరిగిందని, సర్కారు దవాఖానల్లో పెరిగిన ఓపీ, ఐపీ ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో గాంధీ దవాఖానకు ఆధారాల్లేని వార్తలు వచ్చాయని, అవన్నీ అసత్యాలని ప్రజలు తెలిపెట్టాయన్నారు. గవర్నర్ సూచనలు, సీఎం ప్రోత్సాహంతో గాంధీ దవాఖానను తీర్చిదిద్దామని వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బొంతు రామ్మోహన్, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ వేణుగోపాల్‌రావు, చీఫ్ ఇంజినీర్ లక్ష్మణ్‌రెడ్డి, డీఎంఈ రమేశ్ రెడ్డి, గాంధీ వైద్యకళాశాల ప్రిన్సిపల్ మంజుల, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి, గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్. చిత్రంలో జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

ఓబీసీ వర్గీకరణకు కేంద్రం కసరత్తు!



ప్రధాని మోదీకి విజ్ఞాపన పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నేత ఆర్ కృష్ణయ్య తదితరులు



కేంద్ర మంత్రి గెహ్లాట్‌కు వినతి పత్రం ఇస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ సమన్వయకర్త జాజుల శ్రీనివాస్‌గౌడ్

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: వెనకబడిన తరగతుల హక్కులపై గత మూడురోజులుగా ఢిల్లీలో ఆందోళన నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్‌ను గురువారం పార్లమెంటులో కలిశారు. ఈకగాంటకుపైగా జరిగిన ఈ భేటీలో బీసీ రిజర్వేషన్లు, కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి, ప్రత్యేక మంత్రిత్వశాఖ, పదోన్నతుల్లో రిజర్వేషన్లపై చర్చించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ సమన్వయకర్త జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానికి ఆర్ కృష్ణయ్య విజ్ఞాపనపత్రం: నాలుగైదు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసిన బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ఆర్ కృష్ణయ్య పార్లమెంటులో ప్రధానిని కలిసి విజ్ఞాపన పత్రం సమర్పించారు. చట్టసభల్లో బీసీలకు వాటా ఉండాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని ప్రధానిని కోరారు.

ఇంజినీరింగ్ కాలేజీల్లో మిగులుతున్న సీట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో వెబ్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థుల్లో 30 శాతం మంది కళాశాలల్లో చేరడానికి ముందుకు రాలేదని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు తెలిపాయి. గత ఏడాది కాలేజీలలో రిపోర్టింగ్ శాతం 90 శాతానికి పైగా నమోదు కాగా, ఈ విద్యా సంవత్సరంలో 70 శాతమే అయిందని, ఈ ప్రభావం టాప్ ఇంజినీరింగ్ కాలేజీలపై తీవ్రంగా పడిందని పేర్కొన్నాయి. టాప్ ఇంజినీరింగ్ కాలేజీలలో యాజమాన్య కోటాలో సీట్లు భారీ సంఖ్యలోనే మిగిలాయి. పేరున్న ఇంజినీరింగ్ కాలేజీలు అధిక సంఖ్యలో సీట్లు, సెక్షన్లకు అనుమతులు తెచ్చుకుని, ఫ్యాకల్టీని ఏర్పాటు చేసుకున్నా, విద్యార్థులను ఆకర్షించలేకపోతున్నాయి. 2017-18లో ప్రమాణాలు పాటించిన ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు, కోర్సులకు, సెక్షన్ల వారీగా అఫిలియేషన్లు ఇచ్చారు. 95 వేలకు పైగా సీట్లకు అనుమతులు ఇచ్చారు. కన్వీనర్ కోటా, యాజమాన్య కోటాల్లో 60 వేల లోపే సీట్లు భర్తీ అయినట్లు ఎంసెట్ క్యాంపు అధికారులు చెప్తున్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఇతర జాతీయ విద్యాసంస్థలలో సీట్లు పొందినవారి సంఖ్య ఈ ఏడాది పెరిగింది. రాష్ట్రంలో టీఎస్ ఎంసెట్‌లో ర్యాంకులు పొందిన విద్యార్థుల్లో 15 శాతం మంది ఐఐటీ-జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి, ఐఐటీ, ఎన్ఐటీలలో సీట్లు పొందారు. వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలలో 250 సీట్లవరకు మిగిలినట్లు తెలుస్తున్నది. బీ క్యాటగిరీ కాలేజీలపై ఈ ప్రభావం తక్కువగా పడింది. ఈ నెల 16 తర్వాత సీట్ల సంఖ్యపై స్పష్టత వస్తుందని అధికారులు అంటున్నారు.

పునర్జీవానికి అందరూ సహకరించాలి

- తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమైక్యపాలనలో నిర్లక్ష్యానికి గురైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు జీవం పోసేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఎస్సారెస్పీ పునర్జీవ పథకం రీడిజైనింగ్‌కే తలమానికమని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్(ట్రీ) తెలిపింది. ట్రీ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ ఏడాదిలో ఈ పథకాన్ని పూర్తిచేస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించడం హర్షణీయమన్నారు. దీనికి అన్నివర్గాలు సహకరించాలని కోరారు.

2496 మంది తప్పిపోయిన పిల్లల గుర్తింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆపరేషన్ ముస్కాన్ ఫేజ్-త్రీ తనిఖీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 2,496 మంది తప్పిపోయిన పిల్లలను గుర్తించినట్లు మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మి తెలిపారు. మహిళా, శిశుసంక్షేమశాఖ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆమె ముస్కాన్ ఫేజ్-3 వివరాలను మీడియాకు వెల్లడించారు.

వక్ఫ్ భూముల పరిరక్షణకు వాణిజ్య సముదాయాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో అన్యాక్రాంతమవుతున్న రూ.వేలకోట్ల విలువచేసే వక్ఫ్ భూముల పరిరక్షణపై తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు దృష్టిసారించింది. బోర్డు భూముల్లో వాణిజ్య సముదాయాలు నిర్మించాలని నిర్ణయించింది. ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉండటంతోపాటు భూములను పరిరక్షించవచ్చనేది బోర్డు ఆలోచన. హైదరాబాద్‌తోపాటు నగర శివారు ప్రాంతాలు, ఇతర జిల్లాల్లో బోర్డు పరిధిలో విలువైన భూములు ఉన్నాయి. మార్కెట్లకు సమీపంలో వ్యాపార కార్యకలాపాలకు అనువుగా ఉండే ప్రాంతాల్లో కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మించాలని పాలకవర్గం నిర్ణయించింది. గతంలోనూ భవనాలను నిర్మించి అద్దెకు ఇవ్వాలని ప్రతిపాదనలు వచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం స్థానిక వ్యాపారుల నుంచి వస్తున్న అభ్యర్థనల మేరకు పాలకవర్గం ఈ ఆలోచన చేస్తున్నది. ఇందుకోసం ఈనెల 19న వక్ఫ్‌బోర్డు ఆస్తుల అభివృద్ధి కమిటీ, ఫైనాన్స్ కమిటీలతో పాలకవర్గం సమావేశం కానున్నది.


జగిత్యాల జిల్లా మెట్‌పల్లి నుంచి ర్యాలీగా బయలుదేరిన యువకులు. (ఇన్‌సెట్) బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


జనగామ జిల్లా కేంద్రంలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి


జగిత్యాల జిల్లా నుంచి సభకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

పోచంపాడ్ దారిలో జనజాతర

సీఎం సభకు భారీగా తరలివచ్చిన రైతులు, టీఆర్ఎస్ నేతలు

నమస్తే తెలంగాణ, న్యూస్‌నెట్‌వర్క్: ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ పునర్జీవ సభకు రైతులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. దారులన్నీ పోచంపాడ్‌వైపే సాగాయి. బుధవారం సాయంత్రం నుంచే జన ప్రవాహం మొదలైంది. గురువారం సాయంత్రం వరకు జనజాతర కొనసాగింది. వివిధ జిల్లాల నుంచి ట్రాక్టర్లలో రైతులు సీఎం సభకు తరలిరావడం మొదలైంది. జనగామ జిల్లా నుంచి ఎమ్మెల్యేల నేతృత్వంలో భారీ సంఖ్యలో రైతులు తరలారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచి సుమారు 10 వేల మంది తరలివెళ్లారు. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తన పరిధిలో మండలానికి 20 వాహనాలను కేటాయించారు వీటికి తోడు నాయకులు తమ సొంత, ప్రైవేటు వాహనాల్లో వెళ్లారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో మండలానికి 20 వాహనాలు అందుబాటులో ఉంచడంతో జనం తరలివెళ్లారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తన నియోజకవర్గం నుంచి సుమారు 2 వేల మందిని తరలించారు. జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్ కుమార్ స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీలో ముందు వరుసలో నిలిచారు. రెండు వందల ఆర్టీసీ బస్సులు, మరో వంద ప్రైవేటు బస్సుల్లో పోచంపాడ్ సభకు తరలివెళ్లారు. మెట్‌పల్లి నుంచి పెద్ద ఎత్తున జనం సభకు వెళ్లారు. వెయ్యి మంది యువకులు హెల్మెట్లు ధరించి ద్విచక్రవాహనాలపై పోచంపాడ్‌కు బయలుదేరారు. అలాగే 300 ఆర్టీసీ బస్సులు, 120 ప్రైవేట్ బస్సుల్లో దాదాపు నలభై వేల మంది ప్రజలు ఒక్క మెట్‌పల్లి నియోజకవర్గం నుంచే సభకు బయలుదేరారు. మెట్‌పల్లి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు స్వయంగా రైతులు, యువకులతో కలిసి సభ జరిగే పోచంపాడ్‌కు చేరుకున్నారు. ధర్మపురి నియోజకవర్గం నుండి చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో పెద్ద ఎత్తున జనం పోచంపాడ్‌కు వెళ్లారు. వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి ప్రజలతో కలిసి సభకు వెళ్లారు. చొప్పదండి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే బోడిగ శోభ ఆధ్వర్యంలో భారీ గా తరలారు. జయశంకర్ భూపాలపల్లి. వరంగల్ రూరల్ జిల్లా నుంచి నర్సంపేట, పరకాల, వర్ధన్నపేటతోపాటు ఇతర మండలాల నుంచి ప్రజలు భారీగా తరలివెళ్లారు. వరంగల్ అర్బన్, మహబూబాబాద్ జిల్లాల నుంచి టీఆర్ఎస్ కార్యకర్తలు రైతులు వందలాది వాహనాల్లో పోచంపాడ్ చేరుకున్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమం నుంచి ఎమ్మెల్యే పుట్ట మధు 15 కలశాలతో నీటిని పోచంపాడ్ సభకు తీసుకెళ్లారు. నిర్మల్ నుంచి మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి ఆధ్వర్యంలో సుమారు ఐదు వేల బైకులతో భారీ ర్యాలీ పోచంపాడ్‌కు చేరుకుంది.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు


కర్ణాటక నుంచి నీళ్లు తేవాలనే సోయి లేదా?

అక్కడున్నది మీ కాంగ్రెస్ సర్కారే కదా?

కాంగ్రెస్ నేతలపై ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఫైర్

నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలు పూర్తిగా ఎండిపోయి జనం తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కర్ణాటక ప్రభుత్వం దిగువకు నీటిని విడుదల చేయడం లేదని నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున వారిని అడిగి నీళ్లు తీసుకురావాలనే సోయి ఇక్కడి పీసీసీ చీఫ్, ప్రతిపక్ష నేతలకు లేకుండా పోయిందని విమర్శించారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గుత్తా మాట్లాడుతూ.. ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో నిండిన నేపథ్యంలో తాగునీటి అవసరాలకు కనీసం 15 టీఎంసీల నీళ్లు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం, నీటిపారుదలశాఖ మంత్రి లేఖలు రాసినా అక్కడి ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు తోడు ఇక్కడి కాంగ్రెస్ పార్టీ నేతలు అధిష్ఠానంతో మాట్లాడి నీళ్లు విడుదల చేయించే విషయంలో చొరవ తీసుకోవాల్సింది పోయి నేరెళ్ల, కరీంనగర్ అంటూ ప్రాధాన్యత లేని అంశాలను ప్రస్తావిస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే నీటి విడుదల కోసం కర్ణాటక సర్కార్‌ను ఒప్పించాలని డిమాండ్ చేశారు. శ్రీరాంసాగర్ పునర్జీవ పనులు ప్రారంభించిన సీఎం కేసీఆర్ అపర భగీరథుడని కొనియాడారు. విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, నల్లగొండ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జి దుబ్బాక నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు


(జూన్1 నుంచి ఇప్పటివరకు 325.637 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	1003	1003	1705	1704.72	128.72	128.19
నారాయణపూర్	0	11747	1615	1612.17	37.646	34.77
జూరాల	8422	4846	1045	1040.39	9.66	6.932
తుంగభద్ర	13319	99	1633	1615.64	100.86	47.23
శ్రీశైలం	30	30	885	778.1	215.807	19.65
నాగార్జునసాగర్	619	619	590	500.40	312.045	115.94
పులిచింతల	847	720	175	111.36	45.77	2.10
ప్రకాశం బ్యారేజీ	8323	8323	57.05	54.95	3.070	2.52

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	05	3333	1522	1512.09	102.732	66.50
కడెం	21	669	700	686.55	7.6	4.59
ఎస్సారెస్పీ	0	432	1091	1055.10	90.313	9.36
సింగూరు	245	245	1717.93	1708.85	29.91	17.73
నిజాంసాగర్	134	134	1405	1380.10	17.803	1.310
ఎల్లంపల్లి	418	418	485	471.78	20.175	10.33
లోయర్‌మానేరు	0	129	920	893.55	24.07	7.354
ధవళేశ్వరం	41883	42115	45	45	2.93	2.93


ఖమ్మం నగరంలో జోరుగా కురుస్తున్న వర్షం


నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జలమయమైన రోడ్డు


రాజన్న సిరిసిల్ల వేములవాడ రాజన్న ఆలయం జాతర గ్రౌండ్‌లో కురుస్తున్న వర్షం

పలు జిల్లాల్లో జోరు వాన

- అత్యధికంగా ఖమ్మం అర్బన్‌లో 12 సెం.మీ.,
- కొణిజెర్లలో 11 సెం.మీ. వర్షపాతం
- నేడు ఓ మోస్తరు వర్షాలు : వాతావరణ శాఖ

హైదరాబాద్/న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా గురువారం కూడా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతోపాటు దీనికి అనుబంధంగా మధ్య మహారాష్ట్ర పరిసర ప్రాంతాల్లో సముద్ర ఉపరితలం నుంచి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈ రెండింటి ప్రభావంతో నైరుతి రుతు పవనాలు చురుగ్గా కదులుతున్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, వేములపల్లి, త్రిపురారం, కేతేపల్లి, నకిరేకల్, మునుగోడు తదితర ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. ఖమ్మం నగరంలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలంలో 12.3 సెం.మీ., వర్షపాతం నమోదైంది. ఖమ్మం రూరల్ మండలంలో 10.8 సెం.మీ., కొణిజర్లలో 11 సెం.మీ., కూసుమంచిలో 6.5సెం.మీ., చింతకానిలో 6.5 సెం.మీ., వైరాలో 6.3 సెం. మీ., బోనకల్‌లో 6.2 సెం.మీ., తిరుమలాయపాలెంలో 53.2 సెం.మీ., కల్లూరులో 41.8 మి.మీ., ముదిగొండలో 51.8 మి.మీ, తల్లాడలో 2.4 సెం.మీటర్ల వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 3.9 మి.మీటర్లుగా నమోదైంది. చొప్పదండిలో అత్యధికంగా 19.6 మి.మీ., శంకరపట్నంలో 9.0 మి.మీటర్లు కురిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. వేములవాడలో 2 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లాలో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ధారూర్ మర్పల్లి, మోమిన్‌పేట, నవాబుపేట, వికారాబాద్, పరిగి, కుల్కచర్ల, దోమ, బొంరాస్‌పేట, బంట్వారం, పెద్దేముల్, తాండూరు, యాలాల, దౌల్తాబాద్‌లో వాన పడింది. ధారూర్‌లో అత్యధికంగా 5.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా కురుస్తున్న చిరు జల్లులతో వాతావరణం చల్లబడింది. గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంట పొలాలు కళకళలాడుతున్నాయి. రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. హైదరాబాద్ పాతబస్తీ గోల్కొండలో 3.1 సెం.మీ., సరూర్‌నగర్‌లో 2.7సెం.మీ., రంగారెడ్డి జిల్లా యాచారంలో 6.2సెం.మీ., ఇబ్రహీంపట్నంలో 3.6 సెం.మీ., రాజేంద్రనగర్‌లో 3.3 సెం.మీటర్ల వర్షం కురిసింది.

మరో రెండు రోజులపాటు వర్ష సూచన..

శుక్రవారం నుంచి మరో రెండు రోజులపాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వచ్చే వారం రోజులు భారీ వర్ష సూచనలు లేనప్పటికీ, చిరు జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వారు పేర్కొన్నారు.


నేరెళ్ల బాధితులను పరీక్షిస్తున్న ఎంజీఎం వైద్యులు

నేరెళ్ల బాధితులకు ఎంజీఎం బృందం వైద్య పరీక్షలు

వేములవాడ, నమస్తే తెలంగాణ: హైకోర్టు ఆదేశాల మేరకు వరంగల్ ఎంజీఎం వైద్య బృందం గురువారం వేములవాడలోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న నేరెళ్ల బాధితులను పరీక్షించింది. ఎంజీఎం వైద్యులు కృపాల్‌సింగ్, చంద్రశేఖర్ వీరికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి వైద్యులు కోటగిరి మనోహర్, బీజేపీ నాయకులు బండి సంజయ్ వైద్య బృందానికి వివరించారు. అయితే ఈ నివేదికను హైకోర్టుకు సమర్పిస్తామని ఎంజీఎం వైద్యులు తెలిపారు.


వరంగల్ రైల్వే స్టేషన్‌లో పట్టుబడ్డ నగదును చూపుతున్న పోలీసులు

అక్రమంగా తరలిస్తున్న రూ.21.36 లక్షల నగదు స్వాధీనం

ఖిలావరంగల్ (వరంగల్): వరంగల్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని పోలీసులు సోదా చేయగా భారీ మొత్తంలో నగదు బయటపడింది. రైల్వే సీఐ జూపల్లి వెంకటరత్నం కథనం ప్రకారం.. రైల్వేస్టేషన్‌లో గురువారం సాధారణ తనిఖీలు చేపట్టారు. బుకింగ్ కౌంటర్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మధ్యప్రదేశ్ రాష్ట్రం సాత్న జిల్లాకు చెందిన వికాస్ ఖేమ్కాను అదుపులోకి తీసుకొని అతడి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా రూ. 21,36,370 నగదు లభించింది. ఇందుకు సంబంధించి అతని వద్ద ఎటువంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఉద్యోగుల పనితనానికి ఈ-లెర్నింగ్‌తో మెరుగు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ-లెర్నింగ్ శిక్షణతో ఉద్యోగుల పనితనం మెరుగుపడుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థంగా ప్రజలకు చేరుతాయని డీవోపీటీ జాయింట్ సెక్రటరీ దివేశ్‌చతుర్వేది పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన రాష్ట్రాల నుంచి 82 వేల మంది ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దివేశ్ పేర్కొన్నారు. ప్రత్యక్షంగా శిక్షణ ఇస్తే ఒక్కో ఉద్యోగికి రూ.18 వేలు ఖర్చు వస్తుందని, ఈ-లెర్నింగ్ మాడ్యూల్ ద్వారా రూ.1500 మాత్రమే ఖర్చు అవుతుందన్నారు.

ప్రజలను మోసం చేసేందుకే దీక్ష

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్ రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: ఆర్డీఎస్, జూరాల ప్రాజెక్టులకు అన్యాయం చేస్తూ పాలమూరు ప్రజలను నిట్టనిలువునా ముంచింది కాంగ్రెస్ పార్టీయేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. మోసం చేసిన వాళ్లే దీక్షకు దిగడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. జూరాల, ఆర్డీఎస్‌లను పునర్జీవం చేయాలని వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి గురువారం ఒకరోజు దీక్షకు పూనుకున్నారు. దీనిపై నిరంజన్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రజలను ఇంకా మోసం చేయడానికే వనపర్తి ఎమ్మెల్యే ఒక రోజు దీక్షకు పూనుకున్నారని, జూరాల ప్రాజెక్టును 18టీఎంసీల నుంచి 12టీఎంసీలకు కుదించినప్పుడు నోరుమెదపని వారు ఇప్పుడు ప్రజలను తప్పుదారి పట్టించే యత్నం చేస్తున్నారన్నారు. ఆర్డీఎస్, సుంకేసులను నిజాం హయాంలో నిర్మించారని, సమైక్య పాలనలో ఆర్డీఎస్‌ను పట్టించుకోకుండా సుంకేసులకు మాత్రం కోట్లాది రూపాయల నిధులిచ్చినప్పుడు ఎందుకు మౌనం వహించారో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చెప్పాలన్నారు. తెలంగాణ ఉద్యమ సారథిగా నేటి సీఎం కేసీఆర్ ఆర్డీఎస్ అన్యాయంపై పాదయాత్ర చేసి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారన్నారు. అనుకున్నట్టుగానే రూ.730 కోట్లతో ఆర్డీఎస్‌కు ప్రత్యామ్నాయంగా తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం చేపట్టి 87వేల 500 ఎకరాలకు సాగునీరందించేందుకు సీఎం కంకణం కట్టుకున్నారన్నారు. ఇటీవలే టెండర్లు పూర్తి అయ్యాయని, ఏడాదిలోపు తుమ్మిళ్ల లిఫ్టును పూర్తి చేయించాలన్న పట్టుదలతో సీఎం ఉన్నారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రాజెక్టులను శరవేగంగా చేపడుతుంటే, ఓర్వలేక వివిధ కారణాల పేరిట కోర్టుల్లో 130 కేసులు వేయించిన కాంగ్రెస్ నాయకులు మరోసారి ప్రాజెక్టుల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. జూరాల ప్రాజెక్టులో కర్ణాటకకు చెందిన 6 గ్రామాలు నీట మునిగితే, వీటికి రూ. 70 కోట్ల పరిహారం ఇవ్వకుండా ఏళ్లతరబడి పెండింగ్‌లో పెట్టి జూరాలలో నీళ్లు ఆపకుండా చేసిన ఘనత కాంగ్రెస్ నాయకులదేనన్నారు. ప్రభుత్వంపై అసెంబ్లీలో కేసీఆర్ ఒత్తిడి తేవడంతోనే 2013లో పరిహారం చెల్లించిన విషయాన్ని నిరంజన్‌రెడ్డి గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ లక్ష్మయ్య, మున్సిపల్ చైర్మన్ పలుస రమేశ్ గౌడ్, ఎంపీపీలు శంకర్ నాయక్, జానకీరాంరెడ్డి తదితరులున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

ఖమ్మం జిల్లాలో తండ్రీకూతురు.. పటాన్‌చెరు ఔటర్‌పై ఇద్దరు స్నేహితులు మృతి

ఏన్కూరు/పటాన్‌చెరు రూరల్: రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. ఖమ్మం జిల్లాలో తండ్రీ కూతురు, సంగారెడ్డి జిల్లాలో స్నేహితులు ప్రాణాలు కోల్పోయారు. ఖమ్మం జిల్లా ఏన్కూరుకు చెందిన నందిని (32) తన మేనల్లుడి అన్నప్రాసన కోసం గురువారం తన పుట్టినిల్లు అయిన తల్లాడ మండలం బాలాపేట గ్రామానికి వెళ్లింది. శుభకార్యం ముగిసిన తరువాత తన తండ్రి శ్రీనివాసరావు (55)తో కలిసి ట్రాలీ ఆటోలో బయలుదేరారు. వీరి ఆటోను ఎదురుగా వస్తున్న గూడ్స్ వ్యాన్ ఢీకొట్టడంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన నందినిని ఖమ్మం దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందింది. ఆమెకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పటాన్‌చెరు ఔటర్ రింగ్‌రోడ్డుపై..

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్డుపై జరిగిన ప్రమాదంలో హైదరాబాద్ పాతబస్తీకి చెందిన జహీర్ (30), సయ్యద్ షకీల్ (32) అనే ఇద్దరు స్నేహితులు దుర్మరణం చెందారు. వీరు బుధవారం అర్ధరాత్రి ముత్తంగి రింగ్‌రోడ్డు జంక్షన్ వద్ద గల పాన్ షాప్ మూసివేసి అక్కడే కారులో ఔటర్‌పైకి చేరుకున్నారు. వెలిమెల పరిసరాల్లోకి ముందున్న గుర్తుతెలియని వాహనాన్ని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొంది. అతివేగం కారణంగా షకీల్, జహీర్‌లు అక్కడికక్కడే మృతి చెందగా, వీరి కారు నుజ్జునుజ్జయింది.

శ్రీచైతన్య, నారాయణ కాలేజీలకు జరిమానా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలు చెల్లించాల్సిన రూ.1.55 కోట్ల జరిమానాలను తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు వసూలుచేసింది. ఆయా కాలేజీలకు అనుమతులు తీసుకోకపోవడం, అదనపు సెక్షన్లు ఏర్పాటుచేయడం, ఆర్ట్స్ గ్రూపుల పేరుతో సైన్స్ కోర్సులను కొనసాగించడం, వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించడం, కనీస ప్రమాణాలు లేకపోవడం వంటి కారణాలతో శ్రీచైతన్య జూనియర్ కాలేజీలకు రూ.1.55 కోట్లు జరిమానా విధించినట్టు బోర్డు అధికారులు ధ్రువీకరించారు. ఆ మొత్తాన్ని ప్రస్తుతం వసూలు చేసినట్టు చెప్పారు. నారాయణ జూనియర్ కాలేజీల నుంచి రూ.62 లక్షల జరిమానాలు వసూలు చేశామని బోర్డు అధికారులు తెలిపారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు విదేశీ విద్యాపథకానికి ఇంటర్వ్యూలు నేడు, రేపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ద్వారా వివేకానంద విదేశీ విద్యాపథకానికి ఎంపికైన అభ్యర్థులకు శుక్ర, శనివారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఎంపికైన 23 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి విదేశాలలో చదువుకొనేందుకు నిధులు మంజూరు చేస్తారు. అభ్యర్థుల్లో అత్యధికులు అమెరికా, ఆస్ట్రేలియాల్లో ఎంఎస్ చదువుకొనేందుకు దరఖాస్తు చేసుకున్నారు.

ఆన్‌లైన్‌లో తక్‌పట్టీలు అందజేయాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'మార్కెట్లలో రైతులకు గిట్టుబాట ధర, కచ్చితమైన తూకం వచ్చేలా చర్యలు చేపట్టాలి. వ్యాపారులు అధిక కమిషన్, ఇతర చార్జీలు తీసుకున్నట్టయితే కఠిన చర్యలు తీసుకోండి. అక్రమాలను నివారించటానికి ఆన్‌లైన్‌లో తక్‌పట్టీ, అమానత్ పట్టీలను రైతులకు, వ్యాపారస్తులకు లైసెన్స్, ట్రాన్స్‌పోర్టు పర్మిట్లు అందించాలి'అని మార్కెటింగ్ అధికారులు, కార్యదర్శులకు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారథి సూచించారు. తెలంగాణ మార్కెట్‌చట్టం-1966లో ముఖ్యమైన సెక్షన్లకు గత ఏడాది ఏప్రిల్ 12న చేసిన మార్పులకు అనుగుణంగా నిబంధనలను ఏర్పాటుచేయడానికి, జూలై 27న నోటిఫై చేసిన డ్రాఫ్ట్‌రూల్స్ పై అవగాహన కల్పించేందుకు గురువారం హైదరాబాద్‌లో జిల్లా మార్కెటింగ్ అధికారులు, మార్కెట్ కార్యదర్శులకు రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ మార్కెటింగ్ చట్టంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని, చట్టం రూపకల్పన బాధ్యతను నల్సార్ వర్సిటీకి అప్పగించినట్టు చెప్పారు. చట్టంలో మార్పులపై అభిప్రాయాలను 24 లోపు తెలియజేయాలని మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ జీ లక్ష్మీబాయి కోరారు. ఈ నామ్(నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) వ్యవస్థ విస్తరణలో భాగంగా నాణ్యత ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖలు నిర్ణయించాయి. వరంగల్, నిజామాబాద్, కే సముద్రం(మహబూబాబాద్), ఖమ్మం, మలక్‌పేట(హైదరాబాద్), మహబూబ్‌నగర్, సూర్యాపేట, బాదేపల్లి మార్కెట్లలో నాణ్యత ప్రమాణాలను గుర్తించే ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు.



తల్లిపాలే ఆరోగ్యం

ఒకప్పుడు ఆ ఊళ్లో తల్లి బిడ్డకు పాలిచ్చేందుకు భయపడేది. ఎందుకంటే మూఢవిశ్వాసం. కానీ ఇప్పుడు అక్కడి మహిళలు చైతన్యవంతులయ్యారు.

దేశంలోని మారుమూల గ్రామాల్లో ఇంకా మూఢవిశ్వాసాలు కనిపిస్తూనే ఉన్నాయి. అప్పుడే పుట్టిన తల్లి పాలు మంచివి కావనే ప్రచారం కూడా అలాంటిదే. బిడ్డ పుట్టగానే తల్లిపాలు ఇవ్వకూడదని చెబుతుంటారు చాలామంది. ఇప్పటికీ ఇలాంటి అంధవిశ్వాసాలు ఉన్నాయి. గుజరాత్‌లోని కచ్ జిల్లాలోనూ ఇలాంటి పరిస్థితే ఉండేది. సరైన అవగాహన లేకపోవడం వల్ల చనుబాల వల్ల పిల్లలకు రోగాలు వస్తాయనే మూఢనమ్మకం స్థిరపడిపోయింది. పిల్లలు ఆకలితో ఏడ్చినప్పుడు నీటితో లేదా స్పిరిట్‌తో పెదాలను తడుపడం చేసేవారు. జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటిస్తున్న జీఎస్ఎస్ టీమ్ అక్కడి మహిళల్లో అపోహలను తొలిగించే ప్రయత్నం చేస్తున్నది. గర్భిణీలకు, బాలింతలకు ప్రత్యేక శిక్షణాతరగతుల ద్వారా తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్నది.

పట్టణాలు ప్రొటీన్లకు దూరం!

రోజూ ఏం తింటున్నాం? వాటిలో ఏముంటున్నాయి? ప్రొటీన్లు.. విటమిన్లు.. మినరల్స్ ఎట్సెట్రా. ఇవన్నీ చూసి కొనడం.. చూసుకుని తినడం సాధ్యమయ్యే పనేనా?

సముతుల్య ఆహారం తీసుకోవడంలో భారతీయులు విఫలమవుతున్నారని తాజాగా ఓ సర్వే ద్వారా తెలుస్తున్నది. ఐఎంఆర్బీ చేసిన ఈ సర్వే ప్రకారం పట్టణ ప్రాంత వాసుల్లో పోషకార విషయంలో అవగాహన ఉన్నప్పటికీ వాటిని చాలా తక్కువ మోతాదులో తీసుకుంటున్నారు. పట్టణాల్లో 73శాతం మంది ప్రొటీన్లు లేని ఆహారమే తీసుకుంటున్నారట. ప్రొటీన్ల విషయంలో వాళ్లకున్న అపోహలు.. సమస్యలే దీనికి కారణమని ఐఎంఆర్బీ పేర్కొన్నది. 93శాతం మందికి ప్రొటీన్లు ఎంతవరకు అవసరమో తెలియదట. మరీ ముఖ్యంగా గర్భిణులకు ప్రొటీన్లపై అవగాహన లేదట. ఇలా లేనివాళ్లు 97శాతం ఉన్నట్లు సర్వే చెప్తున్నది. అక్షరాస్యత ఎక్కువగా ఉన్న పట్టణాల్లో ప్రొటీన్ల ఆవశ్యకత గురించి తెలిసినా కూడా 53శాతం మంది వాటిని తీసుకోవడం లేదట. ప్రొటీన్ల లోపం వల్ల నీరసం.. అలసట ఏర్పడుతుందని కేవలం 1/3 మందికి మాత్రమే తెలుసునని సర్వే ద్వారా తెలుస్తున్నది.



జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.

zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

ఓ చెలీ.. అనార్కలీ!

ఆనాటి అనార్కలీ ఇలాంటి డ్రెస్‌ల్లో ఎంత మురిసిందో కానీ.. నేటి తరం అమ్మాయిలు మాత్రం ఏ ఈవెంట్‌లోనైనా వీటికే ఓటేస్తున్నారు.. పండుగలు, పెళ్లిళ్లు.. సెలబ్రేషన్ ఏదైనా.. లాంగ్‌గా ఉండే అనార్కలీలో మెరిసిపోవాలనుకుంటున్నారు.. అప్పటికి.. ఇప్పటికి.. ఎప్పటికీ అనార్కలీలదే అగ్రస్థానం! ట్రెండీగా ఉంటూనే, సంప్రదాయం మెరిసిపోతున్న.. ఈ అనార్కలీల సోయగాలపై మీరూ ఓ లుక్కేయండి..





ఈ కాంబినేషన్ ఎప్పటికీ ఎవర్‌గ్రీన్! బ్లూ రాసిల్క్‌ని హైలో హెమ్ తరహాలో డిజైన్ చేశాం. దానికి సింపుల్‌గా పింక్ కలర్ రాసిల్క్‌ని బార్డర్‌ని జత చేశాం. పైన పింక్ రాసిల్క్ మీద జర్దోసీ, థ్రెడ్ వర్క్‌తో నింపేశాం. దీనికి బోట్ నెక్, కోల్డ్ షోల్డర్స్ అదనపు ఆకర్షణ.

సింపుల్ అండ్ స్వీట్‌గా మెరిసిపోయేందుకు ఈ డ్రెస్ ఎంచుకోవాల్సిందే! పీచ్ కలర్ సిల్క్‌కి, ఆకుపచ్చని రాసిల్క్ మెటీరియల్‌ని అటాచ్ చేసి అనార్కలీగా డిజైన్ చేశాం. పైన భాగం మొత్తం స్టోన్ వర్క్‌తో నింపేశాం.



పీచ్ కలర్ సిల్క్ ఫ్యాబ్రిక్‌ని అనార్కలీగా కుట్టాం. పైన చిన్న చెక్స్ వచ్చిన సిల్క్ ఫ్యాబ్రిక్‌ని ఎంచుకొని దాని మీద బ్లూ, బ్లాక్ కాంబినేషన్‌లో థ్రెడ్ వర్క్ చేశాం. కోల్డ్ షోల్డర్‌ల దగ్గర కూడా ఇదే వర్క్ కంటిన్యూ చేశాం. దీనికి నెట్ దుపట్టా హైలైట్. పీచ్ కలర్ నెట్ మీద పీచ్ కలర్ ముత్యాలు, కట్ వర్క్ బార్డర్‌తో అందంగా డిజైన్ చేశాం.



రాజకుమారిలో మెరిసిపోయేందుకు ఇది పర్‌ఫెక్ట్ కాంబినేషన్. సీ గ్రీన్ రాసిల్క్ మీద ఫుల్‌గా బుటీస్ ఇచ్చాం. పైన మాత్రం చిప్స్, కుందన్స్, థ్రెడ్ వర్క్‌తో కాస్త హెవీ డిజైన్ ఇచ్చాం. ఇక గోల్డ్, పీచ్ బార్డర్ డ్రెస్ అందాన్ని మరింత పెంచాయి. పీచ్ కలర్ నెట్ దుపట్టాకి కూడా గోల్డ్ బార్డర్, అక్కడక్కడా బుటీస్ కుట్టాం.



అభినయ రావెళ్ల
అనూష ఇరగవరపు
ఫ్యాషన్ డిజైనర్స్
స్టైలస్ బొటిక్
కొండాపూర్
ఫోన్ :9247663022
stylus.qak@gmail.com



బుట్టబొమ్మలా కనిపించాలంటే ఈ డ్రెస్ వేయాల్సిందే! ఆకుపచ్చని ఫాల్ సిల్క్‌తో ఈ అనార్కలీని డిజైన్ చేశాం. దీనికి చెక్స్ వచ్చిన సిల్క్ మెటీరియల్‌ని కోల్డ్ షోల్డర్స్ హ్యాండ్స్‌కి, పైన సగం వరకు అటాచ్ చేశాం. జరీ, థ్రెడ్, బీడ్స్‌తో వర్క్ చేశాం. ఎర్రని రాసిల్క్ మీద కుందన్స్‌తో కట్ వర్క్ బార్డర్ ఇచ్చాం. ఎర్రని నెట్ దుపట్టా మీద ఫుల్‌గా వర్క్‌తో మెరిపించేశాం.

పాపకు తల్లిపాలు పడవా?

మా పాప వయసు రెండు నెలలు. పది రోజుల క్రితం నుంచి మలవిసర్జనలో ఇబ్బంది పడుతున్నది. నా పాలే తాగుతున్నది కాబట్టి నేను పప్పు తినడం తగ్గిస్తే సరిపోతుందన్నారు మా అత్తగారు. అయినా తన సమస్య పోలేదు. ఇప్పుడు నాలుగైదు రోజుల నుంచి విపరీతంగా విరేచనాలు అవుతున్నాయి. పాలు తాగిన పది నిమిషాలకే విరేచనం అయిపోతున్నది. మలద్వారం దగ్గర ఎర్రగా అయింది. నాకేంటో భయంగా ఉంది. పాపకు ఎందుకిలా అవుతున్నది? దీనికి పరిష్కారం ఏమిటి?

పద్మజ, మందమర్రి





డాక్టర్ దుర్గాప్రసాద్
శిశువైద్య నిపుణులు
అపోలో హాస్పిటల్
హైదరాబాద్

మీరు చెప్పిన లక్షణాలను బట్టి పాపకు మీ పాలు పడటం లేదనిపిస్తున్నది. దీన్నే లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ అంటారు. అంటే పాలలో ఉండే లాక్టోజ్ చక్కెరను అరిగించుకోలేకపోవడం. ఈ సమస్య రెండు కారణాల వల్ల రావచ్చు. కొందరికి పుట్టుకతోనే లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ ఉండొచ్చు. ఇలాంటి పిల్లల్లో లాక్టోజ్‌ని జీర్ణం చేసే లాక్టేజ్ ఎంజైమ్ ఉత్పత్తి కాదు. అంటే ఈ ఎంజైమ్ జీవక్రియను నియంత్రించే జన్యువు వాళ్లలో లోపిస్తుంది. ఇకపోతే మరికొందరికి ఇన్‌ఫెక్షన్లకు గురైనప్పుడు తాత్కాలికంగా పాలు పడవు. ఇన్‌ఫెక్షన్ తగ్గిపోతే మళ్లీ ఎప్పటిలా పాలు జీర్ణం అవుతాయి. ఇన్‌ఫెక్షన్ వల్ల పొట్టలోని ఎపిథీలియం పొర (లాక్టేజ్‌ని ఉత్పత్తి చేసేది) డ్యామేజీ అవుతుంది. అందువల్ల పాలు అరిగించుకోలేరు. మీ పాప విషయంలో ఇన్‌ఫెక్షన్ వల్లనే ఇలా జరుగుతున్నది. విరేచనాలు కూడా ఇన్‌ఫెక్షన్ వల్లనే. కాబట్టి మీ దగ్గర్లోని పిల్లల డాక్టర్‌ని కలిసి ఇన్‌ఫెక్షన్‌కి చికిత్స తీసుకుంటే ఏ సమస్యా ఉండదు.

మాకు రాయండి

మీకు ఆరోగ్యపరమైన సమస్యలు, సందేహాలున్నాయా? అయితే మాకు రాయండి. నిపుణులతో సలహాలు ఇప్పిస్తాం.నమస్తే తెలంగాణ - అడుగండి చెబుతా(హెల్త్‌డెస్క్) మా అడ్రస్ : #8-2-3\1\7\8\9, క్రిష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. health@ntdaily.news

అడుగండి చెబుతా

బాక్సర్ జమున



దృఢ సంకల్పంతో కృషి చేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చు. కృషి, పట్టుదల ఉంటే ప్రతిభను పేదరికం అడ్డుకోలేదని నిరూపించింది అసోమ్‌కు చెందిన జమున.

అసోమ్‌లోని బోడో గిరిజన తెగకు చెందిన జమున అంతర్జాతీయ బాక్సర్‌గా అవతరించింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ అమ్మాయి.. పవర్‌ఫుల్ పంచులతో ప్రత్యర్థులను చిత్తు చేస్తున్నది. అయితే ఆమె ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది. చిన్నప్పుడే తండ్రి చనిపోతే తల్లి నిర్మల ఎంతో కష్టపడి పిల్లలను పెంచింది. కూరగాయలు అమ్ముతూ ఇద్దరు కూతుళ్లను, కొడును చదివించింది. బాక్సింగ్ పట్ల జమునకు ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా వెనుకంజ వేయలేదు. ఊళ్లో బాక్సింగ్‌కు అవసరమైన శిక్షణాకేంద్రం కూడా ఉండేది కాదు. అయినా కష్టపడి ప్రాక్టీస్ చేసింది జమున. జాతీయ స్థాయిలో సత్తా చాటి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించింది. 2010లో తమిళనాడు వేదికగా జరిగిన సబ్‌జూనియర్ ఉమెన్స్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో, 2011లో కోయంబత్తూర్ వేదికగా జరిగిన రెండో చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు సాధించింది. ప్రత్యర్థులను ధీటుగా ఎదుర్కొనేందుకు అబ్బాయిల అకాడమీలోనే శిక్షణ తీసుకునేది జమున. అలా 2013లో సెర్బియాలో జరిగిన ఇంటర్నేషనల్ సబ్ జూనియర్ గర్ల్స్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకం సాధించి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. 2020 ఒలింపిక్స్‌కు అర్హత సాధించి, మరో బంగారు పతకాన్ని తన ఖాతాలో వేసుకోవడమే లక్ష్యమే ముందుకు సాగుతున్నది.

రాళ్లను రతనాలుగా మారుస్తూ..



రాళ్లు.. రతనాలు అనేసరికి ఇదేదో ఆస్ట్రాలజీ స్టోరీ అనుకునేరు. వాస్తవ జీవితంలో అంతకంటే ఎక్కువ శక్తివంతమైన ఓ సాధారణ యువతి కథ ఇది. కశ్మీర్‌లో బుర్హాన్‌వానీ ఎన్‌కౌంటర్ తెలిసిందే కదా? ఆ ఘటన తర్వాత కశ్మీర్ యువత తీవ్రవాదులతో చేతులు కలిపి భారత సైన్యంపై రాళ్ల దాడి చర్యకు ఒడిగట్టింది.

కేంద్ర ప్రభుత్వం, జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం కలిసి అల్లరిమూకల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కానీ 23 ఏండ్ల కశ్మీర్ యువతి సాహసం చేసింది. ఎలాగైనా మార్పు తీసుకురావాలనుకున్నది. సివిల్ ఇంజినీరింగ్ కావాలనే తన లక్ష్యాన్ని సైతం పక్కనబెట్టి అల్లరిమూకల్లో మార్పు తీసుకురావాలని కంకణం కట్టుకున్నది. ఆమె పేరు కుద్సియా అల్తాఫ్. దండించకుండా.. శిక్షించకుండా వాళ్లలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రణాళిక వేసుకున్నది. సైన్యంపై రాళ్లు రువ్వే యువతీ యువకులను గుర్తించి వాళ్లకు కౌన్సిలింగ్ ఇచ్చి.. ఫుట్‌బాల్ ఆటలో శిక్షణ ఇస్తున్నది కుద్సియా. మొదట్లో ఆమెకు తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది. కానీ పట్టుదలతో అనేకమందిని ఆటలవైపు మళ్లించడంలో విజయవంతమైంది. కుద్సియా పట్టుదలను గమనించిన జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం ఆమెను రాష్ట్ర అండర్-14, అండర్-17 బాయ్స్-గాళ్స్ ఫుట్‌బాల్ జట్లకు కోచ్‌గా నియమించింది. రాళ్లు రువ్వేవాళ్లను గుర్తించడానికి ప్రత్యేక అధికారులతో బృందాలను ఏర్పాటు చేసింది.

చిట్కాలు

- జ్వరం జలుబు నివారణకు ఒక చిటికెడు మిరియాల పొడి వేసుకుంటే ఫలితం ఉంటుంది.
- మిరియాల పొడిని ఉప్పుతో కలిపి బ్రెష్ చేసుకుంటే చిగుళ్ల నొప్పి, నోటి దుర్వాసన అరికట్టవచ్చు.
- అరగ్రాముల మిరియాల పొడి ఒక గ్రాము బెల్లం కలిపి రోజూ ఉదయం తీసుకుంటే తలభారం, తలనొప్పి తగ్గుతుంది.
- ఉప్పు, మిరియాలపొడి, ఉల్లిపాయలు మూడింటిని సమపాళ్లలో తీసుకుని పేస్ట్‌గా చేసుకుని జుట్టుకు రాసుకుంటే జుట్టు బాగా పెరుగుతుంది.



పత్తిలో గులాబీ పురుగు–నివారణ

వానకాలంలో రైతులు ఎక్కువ మొత్తంలో పత్తి సాగు చేస్తున్నారు. వాతావరణంలో వచ్చి మార్పుల వల్ల పత్తి పంటకు కొత్త రోగాలు వస్తున్నాయి. వీటి నివారణకు అధిక పెట్టుబడులు పెడుతున్నారు. ఈ సమయంలో పత్తికి గులాబీరంగు పురుగు ఆశించింది. వ్యవసాయశాఖాధికారులు పంటను పరిశీలించి వీటి నివారణకు రైతులకు సూచనలు ఇస్తున్నారు.

పత్తి నాటిన 45 రోజుల్లో పూతకు వస్తుంది. ఈ పూత దశను కాపాడేందుకు రైతులు రసాయన మం దులు పిచికారీ చేస్తారు. దీనివల్ల పత్తి ఆకులు బాగానే ఉన్నప్పటికీ పూత రాలిపోతుంది. రైతులు పత్తి మొక్కను పరిశీలిస్తే తప్పా గుర్తించడం కష్టమని వ్యవసాయ శాఖాధికారులు పేర్కొంటున్నారు. పత్తి ఆకుల్లో పురుగు ఉంటుంది. అది పైకి కనిపించేసరికి నష్టం జరుగుతుంది.

గులాబీ పురుగును గుర్తించడం

పువ్వులో ఎక్కువగా గులాబీ పురుగులుంటాయి. ఇవి ఆకుల కింది భాగాన లేత కొమ్మలు, కాయల పైన గుడ్లను పెడుతాయి. దాదాపు రెండు నుంచి మూడు వందల వరకు గుడ్లను పెడుతాయి. గుడ్ల నుంచి పొదిగిన పిల్ల పురుగులు మొగ్గలోకి తొలుచుకొనిపోతాయి. చిన్న కాయలకు కనిపించినంత చిన్న రంధ్రాలు చేసి లోపలికి ప్రవేశించి గింజలను తినివేస్తాయి. దీనివల్ల కాయల్లో దూది బరువు తగ్గిపోతుంది. రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది.


పత్తిలో గులాబీ పురుగు పెరుగడానికి కారణం పంటకు నీరుపెట్టి ఎరువులు వేసి పంట కాలాన్ని పొడిగిస్తారు. జనవరి తర్వాత పత్తి పంటను చేనులో ఉంచకూడదు. జనవరి తర్వాత చేను లోతుగా దుక్కులు దున్నుకుంటే పురుగు పెరిగే అవకాశం ఉండదు. ఎండకు భూమిలో ఉన్న తెగులు చనిపోతుంది.

పత్తికి గులాబీ పురుగు నివారణకు పత్తి పంటలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. గులాబీ రంగు పురుగు ఆశించిన గుడ్డిపూలు, రాలిన పూత పిందెలను ఎప్పటికప్పుడు ఏరివేసి సమూలంగా నాశనం చేయాలి. 5 మిల్లిలీటర్ల వేపనూనెను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ప్రొఫెనోపాస్, థయోకికార్బ్, క్లోర్ పైరిపాస్, క్వినాల్‌పాస్, స్పైనోసాడ్‌తో పాటు రకాల రసాయన మందులను 45 నుంచి 120 రోజుల వరకు మార్చి మార్చి వాడాలి. దీంతో పత్తి పంటలో ఉన్న పురుగులు తగ్గిపోతాయని జహీరాబాద్ ఏడీఏ వినోద్‌కుమార్ తెలిపారు.

–గౌని దౌలయ్య,
జహీరాబాద్, 9182777539

గో-సంజీవని

(ఖర్చులేని అద్భుత చికిత్సలు)



భారతదేశంలో వ్యవసాయం, పశుపోషణ అనాదిగా ఒకదానితో ఒకటి ముడి ఉన్నాయి. అందుకే మన వాళ్లు పాడి పంట అన్నారు. ఈ పుస్తకంలో గోవుల ఆరోగ్యం, అనారోగ్యం ఎలా తెలుస్తుంది? లేగదూడల సంరక్షణ సమస్యలు, పరిష్కారాలు, సాధారణ సమస్యల గురించి సవివరంగా ఉన్నది. గోవు గర్భకో శ రహస్యం అనే భాగంలో వివిధ వ్యాధులు, వాటి చికిత్సల గురించి వివరించ టం జరిగింది. పశు వైద్యంలో అల్లోపతి, ఆయుర్వేదం, హోమియోపతి చికిత్సా పద్ధతులను పొందుపరిచి అందరికీ సులువుగా అర్థమయ్యే పద్ధతిలో, సులభ భాషలో ఉన్న పుస్తకం 'గో సంజీవని'.

రచన: డాక్టర్ ములగేటి శవరామ్ **వెల:** రూ. 300

ప్రతులకు: 'రైతునేస్తం' పబ్లికేషన్స్, 6–2–959, దక్షిణ భారత హిందీ ప్రచార సభ కాంప్లెక్స్, ఖైరతాబాద్, హైదరాబాద్–04. ఫోన్: 9676797777

జీవన ఎరువులు–ఉపయోగాలు

రసాయన ఎరువుల మితిమీరిన వాడకంతో భూములు సారాన్ని కోల్పోతున్నాయి. ఎరువుల వాడకంతో సమతుల్యత దెబ్బతింటున్నది. ఫలితంగా ఉత్పత్తుల నాణ్యత క్షిణిస్తున్నది. ఈ నేపథ్యంలో రైతులు జీవన ఎరువులను ఉపయోగించి దుష్పరిణామాలను తగ్గించవచ్చు. వాణిజ్యంగా జీవన ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ నాణ్యత ఉండటం లేదు. వీటిని రైతులు తమ స్థాయిలో ఉత్పత్తి చేసుకొని తమ స్థాయిలో వాడుకోవచ్చు.

జీవన ఎరువులు అంటే మొక్కలకు పోషకపదార్థాలు, పెరుగుదలకు ఉపయోగపడే హార్మోన్లను సమకూర్చే సూక్ష్మజీవుల సముదాయం. ఇవి పంటకు కావాల్సిన పోషక పదార్థాలను ప్రకృతిలోని సహజసిద్ధమైన వనరుల నుంచి అందిస్తాయి. జీవన ఎరువులు సహజ సిద్ధమైనవి.

జీవన ఎరువుల వల్ల కలిగే లాభాలు

- వాతావరణ కాలుష్యాన్ని అరికడుతాయి.
- వాతావరణంలో, నేలలో మొక్కలు తమంతట తాము ఉపయోగించుకోలేని పోషకాలను అందుబాటులోకి తెస్తాయి.
- మొక్కల పెరుగుదలకు, ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతాయి.
- భూసారాన్ని అభివృద్ధి చేస్తాయి.
- పంట దిగుబడిలో 10 నుంచి 20 శాతం పెరుగుతుంది. అలాగే మిశ్రమ జీవన ఎరువుల వల్ల అధిక దిగుబడులు పొందవచ్చు.

నత్రజనిని స్థిరీకరించే జీవన ఎరువులు

1)రైజోబియం 2)అజటోబాక్టర్ 3)అజోస్పై రిల్లం 4)నీలి ఆకుపచ్చ నాచు 5) అజోల్లా 6)అసిటోబాక్టర్ మొదలగునవి.

రైజోబియం: లెగ్యూమ్ జాతి పంటలు అంటే పప్పు జాతి పంటలకు నత్రజని అందించడానికి జీవన ఎరువుగా వాడాలి. కంది, పెసర, మినుము, వేరుశనగ, సోయాచిక్కుడు వంటి నూనెగింజ పంటలకు రైజోబియం కల్చర్‌ను విత్తనాలకు పట్టించాలి.

ఉపయోగించే విధానం: 100 మి.లీ నీటిలో 10 గ్రాముల చెక్కర లేదా బెల్లం లేదా గంజి పౌడర్‌ను కలిపి పది నిమిషాలు మరుగబెట్టి చల్లార్చాలి. ఈ చల్లార్చిన ద్రావణం 10 కిలోల విత్తనాలను చల్లుకోవడానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్ పొడిని బాగా కలియబెట్టి విత్తనం చుట్టూ పొరలా ఏర్పడే విధఃగా చేయాలి. ఆ విత్తనాలను 10 నిమిషాలు నీడలో ఆరబెట్టి పొలంలో నాటుకోవాలి.

అజటోబాక్టర్: ఈ బ్యాక్టీరియా ముఖ్యంగా సేంద్రియకర్బనం ఎక్కువగా ఉన్న భూమిలో సమర్థవంతంగా పనిచేస్తుంది. ఇవి పప్పుజాతి పంటలు మినహా ఆకుకూరలు, పూల తోటలకు సిఫార్సు చేయవచ్చు.

పంటలకు రెండు కిలోల కల్చర్‌ను 200 కిలోల సేంద్రియ ఎరువులో కలిపి విత్తనం నాటే సమయంలో ఎకరం నేలపై వేసుకోవాలి. ఆ సమయంలో భూమిలో తగినంత తేమ ఉండేలా చూడాలి.

అజోస్పైరిల్లం: ఈ బ్యాక్టీరియా మొక్క వేర్ల చుట్టూ పెరుగుతూ వేర్లలోకి వెళ్తుంది. ఈ జీవన ఎరువులు నత్రజనిని స్థిరీకరించడం ద్వారా మొక్కకు ఎక్కువ మొత్తంలో ఎరువులను అందుబాటులోకి తెస్తాయి.

ఉపయోగించే విధానం: తక్కువ కాలం పంటలకు రెండు కిలోల అజోస్పైరిల్లం కల్చర్‌ను 100 కిలోల సేంద్రియ ఎరువులో కలిపి ఎకరం పొలంలో విత్తనం కింద పడే విధంగా వేసుకోవాలి. నారుమడులు వేసుకునే పంటలకు నారునారు పీకడానికి ముందుగా 70 నుంచి 80 మీటర్ల చిన్న మడిని తయారు చేసుకోవాలి. పీకిన నారు వేర్లను రెండు కేజీల అజోస్పైరిల్లం కలిపిన ద్రావణంలో 10 నిమిషాలు ముంచి ఆ తర్వాత నాటుకోవాలి.

నీలి ఆకుపచ్చ నాచు: ఇది వరి పంటకు నత్రజనిని అందించే జీవన ఎరువు.

ఉపయోగించే విధానం: ఎకరం పొలంలో వరి నాట్లు వేసిన ఏడు రోజుల వ్యవధిలో ఆరు కేజీల జీవన ఎరువును 50 కేజీల సేంద్రియ ఎరువులో కలిపి చల్లుకోవాలి. ఇది వేసిన ఇరువై రోజుల్లో ఈ నాచు మందంగా చాపలా అల్లుకుపోతుంది. ఆ తర్వాత నీరు తీసివేసి నేలకు అతికిన నాచును మట్టితో కలిసేటట్టు చేయాలి.

అజోల్లా: ఇది వరిలో మాత్రమే వేసుకోవాలి. వరి నాటిన వారం తర్వాత 200 కేజీల అజోల్లా జీవన ఎరువును ఎకరంలో వెదజల్లి 20 రోజుల వరకు నీటి పై బాగా పెరుగనివ్వాలి. తర్వాత నీటిని తొలగించి నాలుగు రోజులు కుళ్ల నివ్వాలి. ఈ ఎరువుతో నత్రజని, సేంద్రియ కర్బనం, పొటాషియం మొక్కలకు అందుతాయి.

అజోల్లా చిన్నతొట్లల్లో పెంచుకొని వాటిని ఎండబెట్టి పొడిలాగా చేసుకుని పశువులకు దాణాకు కూడా ఉపయోగించవచ్చు. దీనివల్ల పాల ఉత్పత్తి కూడా పెరుగుతుంది.

డ్రిప్ పద్ధతిలో జీవన ఎరువులు

సుమారు 500 మీ.లీ ఒక్కొక్క జీవన ఎరువును తీసుకొని డ్రిప్ ట్యాంక్‌లోకి కలుపాలి. నాటిన వారంలో వేసుకోవాలి. గరిష్ఠంగా సంవత్సరం పాటు నిల్వ ఉంటుంది. ఇతర బ్యాక్టీరియా కలుషితమవ్వదు. తేలికగా ఎక్కువ భూమి విస్తీర్ణానికి తక్కువ సమయంలో ఉపయోగించుకోవచ్చు.. ఈ బ్యాక్టీరియా చేరిక వల్ల అధిక ఉష్ణోగ్రతలు, ఇతర వాతావరణ ఒడిదొడుకులు తట్టుకొని పెరుగుతాయి. ఈ టెక్నాలజీ ద్వారా తేలికగా ఎక్కువ పొలానికి తక్కువ సమయంలో జీవన ఎరువులను నేరుగా మొక్క వేళ్లకు చేరేలా చేయవచ్చు. పంట పెరుగుదల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది.



–సుందరి సురేష్
మండలస్థాయి ఉద్యాన అధికారి, మిర్యాలగూడ
9441116724



భాస్వరం అందించే జీవన ఎరువులు

ఫాస్ఫోబ్యాక్టీరియా
మైకోరైజా

ఫాస్ఫోబ్యాక్టీరియా: ఈ బ్యాక్టీరియా జీవన ఎరువు ముఖ్యంగా బాసిల్లస్ మొగథేరియంలో గాని సూడోమోనస్‌ను ఉపయోగించి తయారు చేయవచ్చు. భూమిలో మొక్కలకు లభ్యం కాని రూపంలో ఉన్న భాస్వరాన్ని మొక్కలకు అందిస్తాయి. మొక్కలకు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి.

ఉపయోగించే విధానం: ఎకరాకి రెండు కిలోల పాస్ఫోబ్యాక్టీరియాను 200 కేజీల పశువుల ఎరువులో కలిపి దుక్కిలో గాని మొక్కలు నాటినప్పుడు గాని సాళ్లలో పడే విధంగా వేసుకోవాలి. మొక్కలు నాటిన ఏడు రోజుల వ్యవధిలో వేసుకోవడం మేలు..

మైకోరైజా: ఇది శిలీంధ్రపు జాతికి చెందిన జీవన ఎరువు. మొక్కలకు భాస్వరంతో పాటు సూక్ష్మపోషకాలైన జింకు, కాపర్, సల్ఫర్, మాంగనీస్, ఇనుము మొదలగునవి అందిస్తాయి. ఇది నులి పురుగుల బెడదను సైతం అరికడుతుంది.

ఉపయోగించే విధానం: ఐదు కేజీలను ఎకరంలో వేసుకోవాలి.

పొటాషియం అందించే బ్యాక్టీరియా: పొటాషియం మొబిలైజర్స్: ఇది ప్రటూరియా ఆర్షానియా అనే బ్యాక్టీరియా పొటాషియం మొబిలైజర్స్‌గా ఇవ్వబడుతుంది.

ఉపయోగించే విధానం: రెండు కేజీల జీవన ఎరువును 100 కేజీల పశువుల పేడతో కలిపి వెదజల్లుకోవాలి. నూనె జాతి పంటల్లో దీని ప్రభావం బాగా ఉంటుంది.

జీవన ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- జీవన ఎరువు సంచులను ఎండ, వేడి తగ లని నీడ ప్రదేశంలో నిల్వ ఉంచాలి.
- నిపుణులు సూచించిన జీవన ఎరువులనే రైతులు వాడాలి.
- జీవన ఎరువులు గడువు తేదీలోపే ఉపయోగించుకోవాలి. లేదంటే ఎక్కువగా నిల్వ ఉంటడం వల్ల దాంట్లో బ్యాక్టీరియా చనిపోతుంది.
- రసాయన ఎరువుల్లో జీవన ఎరువులు కలిపి వాడరాదు.
- సేంద్రియ ఎరువులతో అయితే జీవన ఎరువు కలిపిన వెంటనే వాడాలి.



లాభాల పందిరి సాగు

మారుతున్న కాలానికి అనుగుణంగా పంటలు పండిస్తూ రైతులు లాభాలు సాధిస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం 'మన తెలంగాణ–మన వ్యవసాయం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిద్వారా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాల ద్వారా సబ్సిడీని అందిస్తున్నది. ప్రభుత్వం పందిరి జాతి, పూల సాగు పంటలకు సబ్సిడీని ఇస్తూ రైతన్నలను ప్రోత్సహిస్తున్నది. అలాగే రైతులు కూడా ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. కొందరు ఉన్న కొద్దిపాటి పొలంలో ఒకరకం పంటలను వేయకుండా కూరగాయలను సాగుచేస్తున్నారు. మరికొందరు పందిరి జాతి పంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. పూలసాగు చేస్తూ కూడా రైతులు లాభాలు గడిస్తున్నారు.

ఉద్యానవనశాఖ అందిస్తున్న ప్రోత్సాహంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వరి, జొన్న, తదితర పంటలను కాకుండా ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. కూరగాయలను, పూలను సాగుచేసి మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. షాద్‌నగర్ మండలంలోని కమ్మదనం, మొగిలిగిద్ద, వెలిజర్ల తదితర గ్రామాల్లోని రైతన్నలు తక్కువ నీటితో తీగజాతి, పూల, కూరగాయల పంటలను వేసి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

తీగజాతి పంటలకు కొద్దిమొత్తంలో నీరుంటే చాలు. అలాగే కూలీల ఖర్చు కూడా ఉండదు. కూరగాయల సాగు కోసం పందిరి వేయడానికి ఎకరానికి సుమారు రెండు లక్షల యాభై వేల రూపాయల వరకు ఖర్చవుతుంది. ఇందులో ప్రభుత్వం లక్ష రూపాయల వరకు సబ్సిడీని అందిస్తున్నది. వరి, జొన్న పంటలు, మామిడి, బత్తాయి తదితర తోటల సాగు కోసం వెచ్చించే ఖర్చు కన్నా ఈ జాతిపంటల సాగు ఖర్చు చాలా తక్కువ. అంతేకాకుండా వాటికన్నా అధిక రెట్లు అధిక దిగుబడి పొందవచ్చు. అందుకే రైతులు ఈ పంటలపై ఆసక్తి చూపుతున్నారు.

పూల సాగు ఇలా..

ముందుగా పూలసాగుకు అనువుగా ఉండే విధంగా నేలను సారవంతంగా తయారుచేసుకోవాలి. సేంద్రియ ఎరువులు అనంతరం నేలను చదునుగా చేసి పాలీహౌజ్‌ను ఏర్పాటుచేసుకోవాలి. జర్బర మొక్కలు ఎక్కువగా బెంగళూరు, పూణెలో లభిస్తాయి. మొక్కలను కె.ఎఫ్ బయో ప్లాంట్స్ ఎక్కువగా సరఫరా చేస్తుంది. వారే మొక్కల పెంపకం ఎలా చేయాలో అవగాహన కల్పిస్తారు. ఒక్కొక్క మొక్క ప్రస్తుతం 34 రూపాయలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పూలకు మంచి డిమాండు ఉన్నది. అందుకే రైతులు ఈ సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు.

– ఎల్.కిరణ్ కుమార్‌రెడ్డి, షాద్‌నగర్ రూరల్
9949998995



లాభసాటిగా ఉన్నది

నాకున్న ఐదెకరాల్లో నాలుగు ఎకరాల్లో మామిడి తోట, మక్కజొన్న వేశాను. అర ఎకరంలో రెండు పాలీహజ్‌లను ఏర్పాటు చేశాను. సూమారు 30 లక్షల వరకు ఖర్చు వచ్చింది. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చింది. పూణేలోని కేఎస్ బయో ప్లాంట్ నుంచి మొక్కలు దిగుమతి చేసుకున్నాను. వారే సాగుపై అవగాహన కల్పించారు. వారానికి రెండు సార్లు జర్బర పూలను గుడిమల్కాపూర్‌లో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో జర్బర పూలకు భలే డిమాండు ఉన్నది. సీజన్ బట్టి ధర ఉంటుంది. ఒక్కొక్క పువ్వును 10 రూపాయల వరకు ఉంటుంది. ఈ సాగు ఎంతో లాభసాటిగా ఉన్నది.

– మోహన్‌రెడ్డి, రైతు, షాద్‌నగర్

ఖర్చు తక్కువ, దిగుబడి ఎక్కువ



వరి, జొన్న, మామిడి పంటల కంటే పందిరి జాతి పంటలతో అధిక లాభాలను పొందుతున్నా. కూరగాయల సాగుకు ఖర్చు చాలా తక్కువ, దిగుబడి ఎక్కువ. రెండున్నర ఎకరాల్లో ఆనిగపుకాయల సాగుకు సుమారు 60 వేలు ఖర్చుచేశాను. వీటిని గుడిమాల్కాపూర్ మార్కెట్‌కు తరలించాను. మూడు లక్షల రూపాయల ఆదాయం వచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీని ఉపయోగించుకొని ఉద్యాన శాఖాధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ సాగు చేస్తున్నాను. కాబట్టి రైతులు తీగజాతి పంటలపై ఆసక్తి కనబరిస్తే బాగుంటుంది.

– రాజవర్ధన్‌రెడ్డి, రైతు, కమ్మదనం

ఆసక్తి చూపాలి

రైతులు పందిరి జాతి పంటలపై ఆసక్తి చూపాలి. ప్రభుత్వం కూడా ఈ సాగును ప్రోత్సహించడానికి సబ్సిడీని ఇస్తున్నది. తక్కువ నీటితో కూరగాయలను సాగుచేసుకోవచ్చు. వీటిపై రైతులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం. వీటి సాగుతో కలిగే లాభాలను రైతులకు వివరిస్తున్నాం.

– ఉషారాణి, ఉద్యానవనశాఖ అధికారి



గ్లాడియోలస్ పూలసాగు పద్ధతులు

ఉప ఉష్ణ, చల్లని వాతావరణ పరిస్థితుల్లో బయట ప్రదేశాల్లో సాగుకు అనువైన పూల పంట గ్లాడియోలస్. 27–30 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య పంట ఏపుగా పెరుగుతుంది. గ్లాడియోలస్ పూలను కట్ ఫ్లవర్‌గా, పూల గుచ్ఛాల తయారీలో ఉపయోగిస్తారు. 12–14 గంటల సూర్యరశ్మి గల రోజులు ఇంకా మేలు.

నేలలు: సేంద్రియ కర్బనం అధికంగా ఉండే ఇసుక నేలలు, మురుగు నీరు పోయే సౌకర్యం ఉన్న నేలలు ఉండాలి. 6–7 ఉదజని సూచిక గల నేలలు గ్లాడియోలస్ సాగుకు అనుకూలం.

పంటకాలం: రాష్ట్రంలో జూన్ నుంచి అక్టోబర్ వరకు నాటుకోవచ్చు.

ప్రవర్ధనం: దుంపల ద్వారా ప్రవర్ధనం చేస్తారు. దుంపలలో నిద్రావస్థ ఉంటుంది. 3–7 డిగ్రీల వద్ద మూడు నెలల పాటు శీతల ప్రదేశంలో నిల్వ ఉంచినా లేదా 1000 పీపీయం జిబ్బరెలిక్ ఆమ్లం లేదా 500 పీపీయం థయోయూరియాతో విత్తన శుద్ధిచేసి దుంపల నిద్రావస్థను తొలిగించవచ్చు. నాలుగు సెం.మీ వ్యాసార్థం గల దుంపలు నాటితే పెద్ద పూల కాడలు వస్తాయి.

నాటడం: బోదెలు, కాలువలు తయారుచేసుకోవాలి. ఆరు మీటర్ల పొడువు రెండు మీటర్ల వెడల్పుతో బోదెలు చేసి, 40X25 సెం.మీ దూరంలో ఐదు సెం.మీ లోతులో దుంపలు నాటాలి. హెక్టార్‌కు 88,888 మొక్కలు ఉంటాయి. 25X25 సెం.మీ దూరం పాటిస్తే హెక్టారుకు 1,60,000 మొక్కలు వస్తాయి. నాటడానికి 15–30 నిమిషాల ముందు లీటర్ నీటిలో మూడు గ్రాముల డైథేన్ ఎం–45 కలిపిన ద్రావణంలో ముంచాలి. దీంతో తెగుళ్ల సమస్య తగ్గుతుంది. 15 రోజుల వ్యవధిలో కొంత మొత్తం చొప్పున నాటుకుంటే సంవత్సరమంతా పూల దిగుబడి ఉంటుంది. మేలైన మార్కెట్ ధర లభిస్తుంది.

ఎరువులు: ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 20 కిలోల నత్రజని, 35 కిలోల భాస్వరం, పొటాష్‌లనిచ్చే ఎరువులు వేయాలి. పైపాటుగా 3,6 ఆకుల దశలలో ఎకరాకు 20 కిలోల చొప్పున నత్రజనిని వేయాలి.

అంతరకృషి: మొక్కలు పడిపోకుండా 20 సెం.మీ మేర మట్టిని ఎగదోయాలి. పూత సమయంలో ఊతమివ్వాలి. 7–10 రోజుల వ్యవధిలో నీటి తడులివ్వాలి. పూలకాడలు ఏర్పడే దశలో నీటి తడులు తప్పనిసరి.

సస్యరక్షణ: దుంపలు నాటడానికి ముందు నిల్వచేసే సమయంలో నులి పురుగులు, శిలీంధ్రపు తెగుళ్ల నివారణకు దుంపలను 40–45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతకు వేడిచేసిన నీటిలో క్యాప్టాన్ లేదా థైరమ్ లీటరుకు రెండు గ్రాముల చొప్పున శుద్ధి చేయాలి. రసం పీల్చే పురుగుల నివారణకు లీటర్ నీటిలో రెండు మి.లీ డైమిథోయేట్ పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు కార్బండిజం లేదా మ్యాంకోజెబ్ లీటరు రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

ఫ్లోరైడ్ నష్టం: పంట సాగులో అధిక సూపర్ ఫాస్పేట్ వాడినప్పుడు గ్లాడియోలస్ ఆకులలో ఫ్లోరైడ్ పదార్థాలు నిక్షిప్తమై ఆకుల చివర్లు దెబ్బతింటాయి. కాబట్టి అవసరం మేరకే సూపర్ ఫాస్పేట్ వాడాలి.

పూల కాడల కోత: సాధారణంగా 110–120 రోజుల్లో పూల కాడలు వస్తాయి. ఆ సమయంలో మొదళ్ల దగ్గరి నుంచి నాలుగు ఆకులు వదిలి కాడను సేకరించాలి.


దిగుబడి: హెక్టార్‌కు రెండు నుంచి రెండున్నర లక్షల పూల కాడల వస్తాయి. పూలకాడలు, పూలు వడలిపోకుండా ఉండటానికి నీటిలో ఉంచాలి. మార్కెట్‌లో మేలైన ధరలు పొందడానికి అందుకు పూలను ఆకర్షణీయంగా ఉంచాలి. దీనికోసం రవాణా సమయంలో నిటారుగా పంపించాలి. దీనివల్ల పూలకాడలు వంగిపోకుండా ఉంటాయి.



సూరం సింధూజ
పూలశాస్త్ర విభాగం,
ఉద్యాన కళాశాల
రాజేంద్రనగర్

'రైతుబడి'కి ఆహ్వానం

'రైతుబడి' రైతుల కరదీపిక, వేదిక. రైతులంతా తమవైన అనుభవాలను విజయగాథలను 'రైతుబడి' ద్వారా సోదర రైతు మిత్రులతో పంచుకోవచ్చు. తద్వారా సోదర రైతులకు సాగులో శకువలను నేర్పినవారవుతారు. నూతన సాగు పద్ధతులు, సాగు పరికరాల గురించి రైతుబడిలో రాయండి. పది మందికి మార్గం చూపించండి.



రచనలు పంపవలసిన చిరునామా:
8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్ నం-10,
బంజారాహిల్స్ హైదరాబాద్-500034.
raithubadi@ntdaily.news,
Fax–040–23291118

సృష్టికి ప్రతిసృష్టే క్లోనింగ్


- క్లోనింగ్ ప్రక్రియలో అలైంగిక ప్రత్యుత్పత్తి విధానం ద్వారా జనక జీవి రూపం కలిగిన కొత్త జీవిని సృష్టిస్తారు.
- ప్రతి జీవి.. జీవకణాలతో రూపొందుతుంది. ఈ జీవ కణాలు ప్రధానంగా రెండు రకాలు.

1. జెర్మ్ జీవకణం – పునరుత్పత్తి కణం.
2. సోమాటిక్ జీవకణం– జెర్మ్ కణాలు మినహా మిగిలిన శరీరమంతా ఉండే కణాలు.

- క్లోనింగ్ పద్ధతిలో ఆడజీవి అండకణంలోని ఒంటరి క్రోమోజోముతో కూడిన కేంద్రకాన్ని తొలగించి, ఆ అండకణంలోనికి ఆడ లేదా మగ జీవిలో ఉండే సోమాటిక్ కణంలోని జంట క్రోమోజోములతో కూడిన కేంద్రకాన్ని ప్రవేశపెడతారు.
- క్లోనింగ్ ప్రక్రియ ద్వారా ఏర్పడిన శిశువు ఏ జీవి నుంచైతే సోమాటిక్ జీవకణాన్ని సేకరించామో ఆ జీవిని పోలి ఉంటుంది.
- ప్రపంచంలో మొదటిసారిగా క్లోనింగ్ ప్రక్రియ ద్వారా జీవిని సృష్టించిన దేశం స్కాట్లాండ్.
- 1996లో స్కాట్లాండ్‌లోని రోజ్‌లిన్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇయాన్ విల్మట్, కీత్ క్యాంప్‌బెల్ అనే శాస్త్రవేత్తలు గొర్రె పొదుగు కణాల ద్వారా 'డాలీ' అనే గొర్రె పిల్లను సృష్టించారు. కానీ, ఆ గొర్రెపిల్ల 2003లో మరణించింది.
- అయితే, డాలీ 1998లో 'బోనీ' అనే గొర్రె పిల్లకు జన్మనిచ్చింది.

ఫాదర్ ఆఫ్ క్లోనింగ్ - ఇయాన్ విల్మట్

- జాతీయ పాడి పరిశోధనా సంస్థ (NDRI)
- దేశంలో క్లోనింగ్ ద్వారా జీవిని సృష్టించిన మొదటి సంస్థ – NDRI
- ఈ సంస్థ హర్యానాలోని కర్నాల్ ప్రాంతంలో ఉంది.
- 2009లో NDRI సంస్థ సంరూప అనే దూడను సృష్టించింది.
- ప్రపంచంలో క్లోనింగ్ ప్రక్రియ ద్వారా సృష్టించిన మొదటి దూడ సంరూప. ఈ దూడ ఐదు రోజులు మాత్రమే బతికింది.
- ప్రపంచంలో క్లోనింగ్ ప్రక్రియ ద్వారా సృష్టించిన రెండో దూడ –గరిమా–1
- క్లోనింగ్ గేదె నుంచి సృష్టించిన మరో క్లోనింగ్ దూడ– మహిమ (గరిమా–2 నుంచి సృష్టించారు)
- ప్రపంచంలో సృష్టించిన మొదటి పష్మీనా మేక– నూరి
- పష్మీనా మేక – శ్రేష్టమైన కశ్మీరీ ఉన్ని కలిగిన మేక.
- ప్రపంచంలో మొదటిసారి గేదె మూత్రంలోని సోమాటిక్ కణాలను ఉపయోగించి క్లోనింగ్ చేసిన దూడ – అపూర్వ.
- పిండమూల కణాలను ఉపయోగించి 2010లో గరిమా–2 అనే దూడను సృష్టించారు.
- 2010లో ఎద్దు చెవుల సోమాటిక్ కణాల నుంచి శ్రేష్ట్ అనే దున్నపోతును సృష్టించారు.
- 2012లో న్యూక్లియర్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో నూరి



(పష్మీనా మేక)ని సృష్టించారు.

- 2014 మే 2న హ్యాండ్ గైడెడ్ టెక్నాలజీని ఉపయోగించి లాలిమా అనే దూడను సృష్టించారు.
- 2014 జూలై 3న హ్యాండ్ గైడెడ్ టెక్నాలజీని ఉపయోగించి రజత్ అనే దున్నపోతును సృష్టించారు.
- 2015 ఫిబ్రవరి 5న హ్యాండ్ గైడెడ్ టెక్నాలజీని ఉపయోగించి అపూర్వ అనే ముర్రా జాతి దూడను సృష్టించారు.
- కేంద్ర గేదెల పరిశోధనా సంస్థ (CIRB)
- దేశంలో క్లోనింగ్ ప్రక్రియ ద్వారా దూడను సృష్టించిన రెండో సంస్థ – CIRB
- ఈ సంస్థ హర్యానాలోని హిస్సార్‌లో ఉంది.
- CIRB సృష్టించిన క్లోనింగ్ దూడ – హిస్సార్ గౌరవ్.

కృత్రిమ గర్భధారణ


- శుక్రకణాలను, అండాలను పరీక్ష నాళికలో ఫలదీకరణం చెందించి పిండం ఏర్పడిన తర్వాత ఆ పిండాన్ని ఆడజీవి గర్భాశయంలో ప్రవేశపెట్టి పిల్ల జీవులను ఏర్పరిచే ప్రక్రియను కృత్రిమ గర్భధారణ అంటారు.
- ఈ విధంగా సృష్టించిన శిశువును టెస్ట్ ట్యూబ్ బేబి అంటారు.
- ప్రపంచంలో మొదటి టెస్ట్ ట్యూబ్ బేబి – లూయిస్ బ్రౌన్ (1978 జూలై)
- దేశంలో మొదటి టెస్ట్ ట్యూబ్ బేబి – హర్ష చావ్దా (1986)
- మన దేశంలో అధికంగా టెస్ట్ ట్యూబ్ బేబీలను సృష్టించింది– ఫిరోజ్ ఫారిక్.
- హైదరాబాద్‌లోని CCMB (Centre for Cellular Molecular Biology) కృత్రిమ గర్భధారణ పద్ధతి ద్వారా రెండు జింకలను ఉత్పత్తి చేసింది.

గ్రూప్-1 ప్రత్యేకం

41 ప్రకరణలను మార్చిన రాజ్యాంగ సవరణ?

గురువారం తరువాయి

- **26వ సవరణ (1971):** ప్రకరణ 366ను సవరించి ప్రకరణ 366Aను చేర్చారు. ప్రకరణలు 291, 362లను తొలగించారు. రాజాభరణాల రద్దు.
- **27వ సవరణ (197:1)** ప్రకరణలు 239A, 240లను సవరించారు. ప్రకరణలు 239B, 371Cలను కలిపారు. మిజోరాన్ని ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించారు. 1971 ఈశాన్య ప్రాంతాల(పునర్వ్యవస్థీకరణ) చట్టం ప్రకారం మేఘాలయ కొత్త రాష్ట్రంగాను, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్‌లను కేంద్రపాలిత ప్రాంతాలుగాను ఏర్పాటు చేశారు. ఈశాన్య ప్రాంతంలో ఉన్న రాష్ట్రాలన్నింటికి కలిపి ఒక హైకోర్టు, ఒక బార్ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి పార్లమెంట్‌కు, రాష్ట్ర శాసనసభలకు ప్రాతినిధ్యం కల్పించారు.
- **28వ సవరణ (1972):** 312A ప్రకరణను చేర్చారు. 314ను తొలగించారు.
- **29వ సవరణ (1972):** IXవ షెడ్యూలును సవరించారు. కేరళ భూసంస్కరణ చట్టాలను (1969, 1971) న్యాయసమీక్ష పరిధి నుంచి తొలగించే నిమిత్తం వాటిని IXవ షెడ్యూల్‌లో చేర్చారు.
- **30వ సవరణ (1972):** ప్రకరణ 131(1)ను సవరించారు. సుప్రీంకోర్టు అప్పీళ్లకు వెళ్లడానికి గల రూ. 20,000ల విలువను రద్దు చేశారు.
- **31వ సవరణ (1973):** 81, 330, 332 ప్రకరణలను సవరించారు. లోక్‌సభలో రాష్ట్రాల ప్రాతినిధ్య సభ్యుల సంఖ్యను 500 నుంచి 525కు పెంచారు. కేంద్రపాలిత ప్రాంతాల ప్రాతినిధ్య సంఖ్య 25 నుంచి 20కు తగ్గించారు.
- **32వ సవరణ (1973):** ప్రకరణ 371(1)ను సవరించారు. 371D, 371E లను చేర్చారు. VIIవ షెడ్యూల్‌ను సవరించారు. జాబితా '1'లో 63వ అంశాన్ని సవరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ ప్రాంతానికి కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించారు.
- **33వ సవరణ (1974):** 101, 190 ప్రకరణలను సవరించారు. పార్లమెంట్ సభ్యుడి రాజీనామాపత్రాన్ని సభాధ్యక్షుడు తప్పనిసరిగా ఆమోదించాలి అనే నిబంధనను తొలగించారు. సభ్యుడు ఇష్టపూర్వకంగా, స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నాడని సంతృప్తి చెందినప్పుడు మాత్రమే స్పీకర్ లేదా చైర్మన్ రాజీనామాను ఆమోదించవచ్చు.
- **34వ సవరణ (1974):** IXవ షెడ్యూల్‌ను సవరించారు. IXవ షెడ్యూల్‌కు 67 నుంచి 86 వరకు మొత్తం 20 చట్టాలను అదనంగా చేర్చారు. అనేక



రాష్ట్రాలు చేసిన 20 భూసంస్కరణల చట్టాలను న్యాయసమీక్షా పరిధి నుంచి కాపాడి రాజ్యాంగ రక్షణ కల్పించడానికి IXవ షెడ్యూల్‌లో చేర్చారు.

- **35వ సవరణ (1974):** ప్రకరణ 2Aను చేర్చారు. Xవ షెడ్యూల్‌ను అదనంగా చేర్చారు. 80, 81 ప్రకరణలను సవరించారు. సిక్కింకు సహరాష్ట్ర హోదా కల్పించింది. Xవ షెడ్యూల్‌లో సిక్కిం రాష్ట్ర విలీనానికి సంబంధించిన షరతులు, విధి విధానాలను పొందుపరిచారు.
- **36వ సవరణ (1975):** ప్రకరణ 80, 81లను సవరించారు. I నుంచి IV షెడ్యూళ్లను సవరించారు. ప్రకరణ 371Fను చేర్చారు. ప్రకరణ 2Aను తొలగించారు. Xవ షెడ్యూల్‌లోని అంశాలను తొలగించారు. IXవ షెడ్యూల్‌లో 2వ అంశాన్ని చేర్చారు. Iవ షెడ్యూల్‌ను సవరించి సిక్కింకు సంపూర్ణ రాష్ట్ర హోదా కల్పించారు. IVవ షెడ్యూల్‌ను సవరించి సిక్కిం నుంచి రాజ్యసభకు ఒక సభ్యుణ్ని పంపడానికి ఏర్పాటు చేశారు. ప్రకరణ 371Fలో సిక్కిం రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేక నిబంధనలను చేర్చారు.
- **37వ సవరణ (1975):** 239A, 240 ప్రకరణలను చేర్చారు. Xవ షెడ్యూల్‌ను పునరుక్తీకరించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో శాసనసభ, మంత్రి మండలిని ఏర్పాటు చేశారు.
- **38వ సవరణ (1975):** 123, 213, 239B, 352, 356, 359, 360 ప్రకరణలను సవరించారు. రాష్ట్రపతి, గవర్నర్, లెఫ్టినెంట్ గవర్నర్లు జారీ చేసిన ఆర్డినెన్స్‌లు, కోర్టు అధికార పరిధిలోకి రాకుండా సవరించారు.
- **39వ సవరణ (1975):** ప్రకరణలు 71, 329లను సవరించారు. ప్రకరణ 329Aను చేర్చారు. IXవ షెడ్యూల్‌ను సవరించారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, సభాపతుల ఎన్నికలకు సంబంధించిన వివాదాలను న్యాయసమీక్ష పరిధి నుంచి మినహాయించారు. వీరి ఎన్నికలకు సంబంధించిన వివాదాలను పార్లమెంట్‌తో నియమించిన అధికారి ద్వారా గాని, లేదా ఒక ఫోరమ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా గాని పరిష్కరించవచ్చు. ఈ సవరణ IXవ షెడ్యూల్‌కు కొన్ని కేంద్ర, రాష్ట్ర చట్టాలను చేర్చింది.
- **40వ సరవణ (1975):** ప్రకరణ 297ను సవరించారు. IX వ షెడ్యూల్‌కు 175 నుంచి 188 వరకు ఉన్న అంశాలను చేర్చారు. 297 ప్రకరణను సవరించి భారత్ ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్‌లోని కాంటినెంటల్ షెల్ఫ్‌లో లభ్యమయ్యే భూవనరులు, నీరు, ఖనిజ వనరులు, ఇతర విలువైన వనరులపై హక్కులు కేంద్ర ప్రభుత్వ పరం చేశారు. ఈ సవరణ ద్వారా IXవ షెడ్యూల్‌కు 64 చట్టాలను చేర్చారు. వీటితో మొత్తం చట్టాల సంఖ్య 188కు పెరిగింది.
- **41వ సవరణ (1976):** ప్రకరణ 316ను సవరించారు. రాష్ట్ర, జాయింట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సభ్యుల పదవీవిరమణ వయస్సు 60 నుంచి 62 ఏండ్లకు పెంచారు.
- **42వ సవరణ (1976):** VIIవ షెడ్యూల్‌ను సవరించారు. 31, 31D, 32A, 39A, 43A, 48A, 51A, 131A, 139A, 144A, 226A, 228A, 257A, 323A, 323B లను చేర్చారు. IVAవ భాగాన్ని, 14 భాగాలను కూడా చేర్చారు. ప్రవేశికను సవరించారు. ఈ సవరణ ద్వారా 41 ప్రకరణలను, VIIవ షెడ్యూల్‌ను సవరించడమే గాక 15 ప్రకరణలను, 2 భాగాలను చేర్చారు. కాబట్టి దీనిని మినీ రాజ్యాంగం అంటారు. మొదటిసారిగా అవతారికను సవరించారు. సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం అనే పదాలకు బదులు సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మార్చారు. దేశ ఐకమత్యం అనే పదాలకు బదులుగా దేశ ఐకమత్యం– అఖండతగా మార్చారు. ఆదేశిక సూత్రాలను అమలు చేసేటప్పుడు ప్రాథమిక హక్కులకు మధ్య వివాదం తలెత్తితే ఆదేశసూత్రాలే చెల్లుబాటవుతాయి. IVA అనే కొత్త భాగాన్ని చేర్చి అందులో ప్రాథమిక విధులను పొందుపర్చారు. లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల సంఖ్యలో 2001 వరకు మార్పు లేకుండా చేయడం. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల పదవీకాలాన్ని ఐదేండ్ల నుంచి ఆరేండ్లకు పెంచారు. రాష్ట్రపతి క్యాబినెట్ సలహాను తప్పక పాటించాలి 74(1)ను సవరించారు. ప్రకరణ 368 కింద చేసే రాజ్యాంగ సవరణను కోర్టులో సవాల్ చేయరాదు. అంటే పార్లమెంటే సర్వాధికారి. VIIవ షెడ్యూల్‌ను సవరించి కొన్ని అంశాలను రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాకు బదిలీ చేసింది. ప్రకరణ 312ను సవరించి అఖిల భారత న్యాయ సర్వీసు కమిషన్ నియామకానికి వీలు కల్పించింది. కొత్తగా 323A, 323B ప్రకరణలను చేర్చింది. ప్రకరణ 323A ద్వారా పరిపాలన ట్రిబ్యునళ్లను, ప్రకరణ 323B ద్వారా పన్నులు, భూసంస్కరణలు, పట్టణ భూపరిమితి, పౌరసరఫరాలకు సంబంధించిన ట్రిబ్యునళ్లకు వీలు కల్పించారు. ప్రకరణ 352ను సవరించి భారత భూభాగంలో ఏ ప్రాంతానికైనా అత్యవసర పరిస్థితిని విధించేలా మార్పు చేసింది. (ఈ సవరణ కంటే ముందు కొన్ని ప్రాంతాలకు మాత్రమే అత్యవసర పరిస్థితిని విధించే వీలుండేది.)
- **43వ సవరణ (1977):** 145, 226, 228, 366 ప్రకరణలను సవరించారు. 31D, 32A, 131A, 144A, 226A, 228A ప్రకరణలను రద్దు చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయసమీక్ష అధికారాల పరిధిని పునర్ నిర్మించింది.

44వ రాజ్యాంగ సవరణ (1978)

- ఈ చట్టాన్ని 1978లో చేశారు. ఇందులో కొన్ని అంశాలను 1978, జూన్ 20న, మరికొన్ని అంశాలు ఆగస్టు 1న, సెప్టెంబర్ 6న అమల్లోకి వచ్చాయి.
- ఈ చట్టం ద్వారా రాజ్యాంగంలోని 19, 22, 30, 31ఏ, 31సీ, 38, 74, 77, 83, 105, 123, 132, 133, 134, 139ఏ, 150, 166, 172, 194, 213, 217, 225, 226, 227, 239బీ, 329, 352, 356, 358, 359, 360, 371ఎఫ్, 71(సబ్), 103 (సబ్), 192 (సబ్) ప్రకరణలను, వీటితోపాటు 9వ షెడ్యూల్‌ను సవరించారు.
- 134ఏ, 300ఏ, 361ఏ ప్రకరణలను కొత్తగా చేర్చడంతోపాటు 12వ భాగంలో 4వ చాప్టర్‌ను పొందుపర్చారు.
- 31, 257ఏ, 329ఏ ఆర్టికల్స్‌ను, రాజ్యాంగంలోని 30వ ప్రకరణ తర్వాత ఆస్తిహక్కు అనే సబ్‌హెడ్డింగ్‌ను తొలగించారు.
- ప్రకరణ 22ను సవరించడం ద్వారా నివారక నిర్బంధానికి సంబంధించి కొన్ని రక్షణలు కల్పించారు. అవి..సలహా సంఘం అనుమతి లేకుండా నివారక నిర్బంధంలో ఉన్న వ్యక్తి అత్యధిక నిర్బంధ కాలం మూడు నుంచి రెండు నెలలకు తగ్గించారు.
- సలహా సంఘంలో అధ్యక్షుడు, ఇద్దరు సభ్యులు ఉండాలి. అధ్యక్షుడిగా హైకోర్టు జడ్జి, సభ్యులుగా పదవీ విరమణ చేసిన, పదవిలో ఉన్న జడ్జిలు ఉంటారు.
- రెండు నెలలు దాటిన నివారక నిర్బంధానికి తప్పకుండా సలహా సంఘం అనుమతి తీసుకోవాలి.
- రాజ్యాంగ యంత్రాంగం విఫలమైతే రాష్ట్రపతి పాలన ఆరునెలల కంటే ఎక్కువ కాలం అమలు చేయకూడదు. అయితే 365కు ఒక కొత్త క్లాజును చేర్చారు. దీంతో జాతీయ అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు ఏడాదిపైన ప్రతిసారి పొడిగించవచ్చు, ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణకు వీలుకాదని ధ్రువీకరించినప్పుడు రాష్ట్రపతి పాలన పొడిగించడానికి అవకాశం కల్పించారు.
- ఆరేండ్లకు పెంచిన పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల కాలపరిమితిని 42వ సవరణ ద్వారా ఐదేండ్లకు తగ్గించారు. రాష్ట్ర శాసనసభల్లో కోరమ్ పునరుద్ధరించారు. ప్రకరణలు 105, 194లను సవరించి హౌస్ ఆఫ్ కామన్స్ అనే పదాన్ని తీసివేశారు.
- 74వ ప్రకరణలోని నిబంధనలను అలాగే ఉంచి దానికి మరికొన్ని కొత్త అంశాలను చేర్చారు. దీని ప్రకారం మంత్రిమండలి పంపిన సిఫారసులను రాష్ట్రపతికి కేవలం పునఃపరిశీలనకు పంపే హక్కును మాత్రమే కల్పించారు.
- ప్రకరణలు 132, 134లను సవరించి 134ఏ అనే కొత్త ప్రకరణను చేర్చారు. సత్వర న్యాయమందేలా జడ్జిమెంట్ లేదా తుది తీర్పు తర్వాత సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవడానికి హైకోర్టు అనుమతివ్వాలి.
- 42వ సవరణ ద్వారా హైకోర్టులకు కల్పించిన రెవెన్యూ అధికారాలను తొలగించారు. దీంతో ట్రిబ్యునళ్లపై హైకోర్టులకు ఉండే పర్యవేక్షణాధికారం మళ్లీ లభించింది.
- ఈ సవరణ ద్వారా ఆస్తిహక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించి 19(1–ఎఫ్), 31వ ప్రకరణలను రద్దుచేశారు. ఆస్తిహక్కును 12వ భాగంలో ప్రకరణ 300–ఏలో కేవలం చట్టబద్ధమైన హక్కుగా చేర్చారు.
- ఈ సవరణ ద్వారా 352ను సవరించారు. దీని ద్వారా అంతర్గత అశాంతి (Internal disturbances) అనే పదాన్ని తొలగించి సాయుధ తిరుగుబాటు (Armed Rebellion) అనే పదాన్ని చేర్చారు.
- అత్యవసర పరిస్థితి ప్రకటన, క్యాబినెట్ రాతపూర్వక సిఫారసు ద్వారా మాత్రమే విధించాలని ఈ సవరణ సూచిస్తుంది. అంటే ప్రధానమంత్రి సిఫారసుపై కాకుండా మంత్రివర్గ (క్యాబినెట్ అనే పదం అంతకుముందు రాజ్యాంగంలో లేదు. ఈ సవవరణ ద్వారానే ఆ పదాన్ని మొదటిసారిగా చేర్చారు) సిఫారసుపై మాత్రమే రాష్ట్రపతి అత్యవసర పరిస్థితిని ప్రకటించాలి.
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన మొదటి ఆరు నెళ్ల తర్వాత ప్రతి ఆరు నెలల పొడిగింపునకు పార్లమెంటు అనుమతి తప్పక ఉండాలి. అయితే ఎమర్జెన్సీ విధించిన నెలలోపు పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీతో ఆమోదం పొందాలి. గతంలో (44వ సవరణకు ముందు) ఇది సాధారణ మెజారిటీతో ఆమోదించాల్సి ఉండేది.

జాతీయ పార్కులు- బయోస్పియర్ రిజర్వులు

- ప్రకృతి సంపద, సుందర ప్రదేశాలు, దృశ్యాలు, వన్యజీవులను సంరక్షించేందుకు జాతీయ పార్కులను ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాంతాల నుంచి వంట చెరుకును సేకరించడం, పశువులను మేపడం, అటవీ ఉత్పత్తుల సేకరణ నిషిద్ధం. ఈ ప్రాంతాలపై వ్యక్తిగత హక్కులు ఉండవు. జాతీయ పార్కుల హద్దులను శాసనం ద్వారా నిర్ణయిస్తారు. ప్రస్తుతం దేశంలో 4.2 మిలియన్ హెక్టార్లలో (దేశ భూభాగంలో 1.3 శాతం) 102 జాతీయ పార్కులు ఉన్నాయి.



జాతీయ పార్కు/ వన్యమృగ సంరక్షణ కేంద్రం - రాష్ట్రం

- దచ్చిగాం జాతీయ పార్కు – జమ్ముకశ్మీర్ – హంగూల్ (కశ్మీరి దుప్పి), కస్తూరి మృగం
- సలీం అలీ పక్షి సంరక్షణ కేంద్రం – జమ్ముకశ్మీర్ – హిమాలయన్ మంచుకోడి
- కిస్త్‌వార్ జాతీయ పార్కు –జమ్ముకశ్మీర్–
- హెమీస్ హై అల్టిట్యూడ్ జాతీయ పార్కు – జమ్ముకశ్మీర్
- జిమ్ కార్బెట్ జాతీయ పార్కు– ఉత్తరాఖండ్ – పెద్ద పులలకు ప్రసిద్ధి. దేశంలోనే తొలి జాతీయ పార్కు
- వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ జాతీయ పార్కు –ఉత్తరాఖండ్ –విభిన్నరకాల పుష్పజాతుల పరిరక్షణ
- రాజాజీ జాతీయ పార్కు– ఉత్తరాఖండ్
- దుద్వా జాతీయ పార్కు – ఉత్తరప్రదేశ్
- చంద్రప్రభ జాతీయ పార్కు – ఉత్తరప్రదేశ్
- ఖజీరంగా జాతీయ పార్కు – అసోం – ఒంటి కొమ్ము ఖడ్గమృగం
- డిబ్రూసైకోవా –అసోం
- మానస్ వన్యమృగ సంరక్షణ కేంద్రం– అసోం
- సమేరి వన్యమృగ సంరక్షణ కేంద్రం– అసోం
- గరమ్‌పానీ వన్యమృగ సంరక్షణ కేంద్రం– అసోం
- కన్హా జాతీయ పార్కు –మధ్యప్రదేశ్– బెట్వా నది ఒడ్డున ఉంది
- పన్నా, శివపురి, కాంగెర్‌వ్యాలీ, పెంచ్ వనవిహార్, ఫాజిల్, బంధవ్‌ఘర్, సాత్పూర, బోరి, పచ్‌మర్హి, గాంధీసాగర్ జాతీయ పార్కులు– మధ్యప్రదేశ్
- కన్నెర్‌ఘాట్ జాతీయ పార్కు – చత్తీస్‌గఢ్ – పులులు
- ఇంద్రావతి, అచనాక్మర్, గురు ఘాసీదాస్, ఉదంది, సితానంది – చత్తీస్‌గఢ్
- శాల్వడోర్ కంచర గాడిదల సంరక్షణ కేంద్రం– గుజరాత్(రాణా ఆఫ్ కచ్ ప్రాంతంలోని చిత్తడి నేలలు) –కంచర గాడిదలు
- గిర్ వన్యమృగ సంరక్షణ కేంద్రం – గుజరాత్ – ఆసియా సింహాలు
- నల్‌సరోవర్ – గుజరాత్
- బోరివిల్లా జాతీయ పార్కు– మహారాష్ట్ర –అరిచే జింకలు
- తడోబా వన్యమృగ సంరక్షణ కేంద్రం –మహారాష్ట్ర
- మేల్‌ఘాట్, గుగ్మల్ – మహారాష్ట్ర
- జల్‌ధావరా, బక్సా, సుందర్‌బన్స్ నియోర వ్యాలీ–పశ్చిమబెంగాల్
- బన్నెర్‌ఘాట్ జాతీయ పార్కు – బెంగళూరు–ప్రపంచంలోనే అతిపెద్ద సీతాకోక చిలుకల సంరక్షణ కేంద్రం
- దండేలి, అనాసీ –కర్ణాటక, తమిళనాడు సరిహద్దు
- బందీపూర్ వన్యమృగ సంరక్షణ కేంద్రం– తమిళనాడు, కర్ణాటక – ఏనుగులు
- రంగన్‌టిట్టూ పక్షి సంరక్షణా కేంద్రం – కర్ణాటక
- దండేవి జాతీయ పార్కు – కర్ణాటక
- సైలెంట్ వ్యాలీ జాతీయ పార్కు – కేరళ – మకాక్ కోతులు (సింహపు తోక ఉన్న కోతులు)
- పెరియార్ వన్యమృగ సంరక్షణ కేంద్రం – కేరళ – ఏనుగులు, పులులు
- బిత్తర్‌కనిక – ఒడిశా – మాంగ్రూవ్స్ సురక్షిత ప్రాంతం
- సిమ్లిపాల్ – ఒడిశా– తెల్లపులులకు ప్రసిద్ధి
- గిండి జాతీయ పార్కు – తమిళనాడు – పాములకు ప్రసిద్ధి
- వేదాంతగల్ పక్షి సంరక్షణా కేంద్రం తమిళనాడు – కొంగలు
- మదువలై వన్యమృగ సంరక్షణ కేంద్రం – తమిళనాడు – ఏనుగులకు ప్రసిద్ధి
- (దీనినే టాప్‌స్లిప్ అని పిలుస్తారు)
- గౌతమ్‌బుద్ధ, వాల్మీకి, దాట్‌మా
- జాతీయ పార్కులు – బీహార్
- కాంచన్‌జంగ, ఖంగ్ చాంద్జెందా జాతీయ పార్కులు– సిక్కిం
- మౌలింగ్ – అరుణాచల్‌ప్రదేశ్
- నాంధపా – అరుణాచల్‌ప్రదేశ్ – పులులు
- కైబుల్‌లంజావ్ –మణిపూర్ – లోక్‌తక్ సరస్సు ఒడ్డున ఉంది
- ముర్లేంగ్, దంపా నోక్రిక్, బలపాక్రం జాతీయ పార్కులు –మేఘాలయ

బయోస్పియర్ రిజర్వులు

- ఏదైనా భౌగోళిక ప్రాంతంలో వృక్ష, జంతుజాతులు, వాటి జన్యువుల పరిరక్షణ, గిరిజనుల జీవనశైలి, మొక్కలు, జంతువుల జన్యు ఆధారాలను సంరక్షించేందుకు ఏర్పాటైన ప్రయోజనకర రక్షిత ప్రాంతాలే బయోస్పియర్ రిజర్వులు. యునెస్కో ఆధ్వర్యంలో ఏర్పాటైన మ్యాన్ అండ్ బయోస్పియర్ ప్రోగ్రామ్ (1971) ప్రస్తుతం దేశంలో 19 బయోస్పియర్ ప్రాంతాలను ప్రకటించింది.



బయోస్పియర్ రిజర్వ్	రాష్ట్రం
నీలగిరి (దేశంలోనే మొదటి బయోస్పియర్, 1986లో ప్రకటించారు)	తమిళనాడు
అగస్త్యమలై	– కేరళ
గల్ఫ్ ఆఫ్ మన్నార్	– తమిళనాడు
గ్రేట్‌నికోబార్	–అండమాన్ నికోబార్
సిమ్లిపాల్	– ఒడిశా
అమర్‌కంట్	– మధ్యప్రదేశ్
అదానకర్	– చత్తీస్‌గఢ్
పచ్‌మర్హి	– మధ్యప్రదేశ్
సుందర్‌బన్	– పశ్చిమబెంగాల్
దిబ్రూసికాయ్	– అసోం
మానస	– అసోం
నోక్రిక్	– మేఘాలయ
దిబంగ్–దేహాంగ్ ఋ	– అరుణాచల్‌ప్రదేశ్
కాంచనజంగ	– సిక్కిం
నందాదేవి	– ఉత్తరాఖండ్
రాణా ఆఫ్ కచ్	– గుజరాత్
కోల్డ్ డెసర్ట్	– హిమాచల్‌ప్రదేశ్
శేషాచలం	– ఆంధ్రప్రదేశ్
పన్నా	– మధ్యప్రదేశ్

ప్రతిభకు పరీక్ష

1. **పార్లమెంట్ సభ్యుడి రాజీనామాను స్పీకర్/చైర్మన్ ఆమోదించే అధికారం ఏ రాజ్యాంగ సవరణ ద్వారా సంక్రమించింది?**
   1) 42వ 2) 33వ 3) 32వ 4) 45వ
2) **పార్లమెంట్ సభ్యులు ఎవరైనా అనుమతి లేకుండా వరుసగా ఎన్ని రోజులు గైర్హాజరు అయితే ఆ స్థానం ఖాళీ అయినట్లు సభ ప్రకటించవచ్చు?**
   1) 100 రోజులు 2) 60 రోజులు
   3) 50 రోజులు 4) 30 రోజులు
3. **'భూమి పై స్వర్గమనేది ఎక్కడైనా ఉంటే అది ఇదే అది ఇదే' అని కింది ఏ భవన గోడలపై రాసి ఉంది?**
   1) దివాన్ ఇ అమ్ 2) దివాన్ ఇ ఖాస్
   3) జామా మసీద్ 4) తాజ్‌మహల్
4. **బీబీఖా మఖ్బర అనే నిర్మాణం తాజ్‌మహల్‌ను అనుకరిస్తూ నిర్మించారు. దీన్ని ఔరంగజేబు నిర్మించారు. దీనికి మరొకపేరు?**
   1) దక్కన్ తాజ్‌మహల్
   2) ఉత్తర తాజ్‌మహల్
   3) నయా తాజ్‌మహల్
   4) ఏదీకాదు
5. **ప్రజలు సమావేశమయ్యేందుకు అక్బర్ నిర్మించిన కట్టడం పేరు?**
   1) దివాన్ – ఇ – ఆమ్
   2) దివాన్ – ఇ – ఖాస్
   3) ఇబాదత్ ఖానా
   4) మరియమ్ ప్యాలెస్
6. **వాస్తుకళాప్రభువు అని ఏ మొఘల్ రాజుకు పేరు?**
   1) అక్బర్ 2) జహంగీర్
   3) షాజహాన్ 4) హుమయున్

సమాధానాలు మంగళవారం నిపుణలో...

1-1, 2-2, 3-1, 4-1, 5-2, 6-2




ప్రగ్యాజైస్వాల్, రకుల్‌ప్రీత్‌సింగ్, బోయపాటి శ్రీను, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి

స్వచ్ఛమైన ప్రేమకు ప్రతీక

''భద్ర' తర్వాత నేను చేసిన అందమైన ప్రేమకథా చిత్రమిది. ప్రేమ, యాక్షన్, భావోద్వేగాలతో ముడిపడిన ఫీల్ గుడ్ సినిమాగా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది' అని అన్నారు బోయపాటి శ్రీను. ఆయన దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'జయ జానకి నాయక'. బెల్లంకొండ శ్రీనివాస్, రకుల్‌ప్రీత్‌సింగ్, ప్రగ్యా జైస్వాల్ ప్రధాన పాత్రల్లో నటించారు. ద్వారక క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించారు. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మిర్యాల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రేమకథతో పాటు కుటుంబ బంధాలకు పెద్దపీట వేసి సినిమాను రూపొందించాం. స్వచ్ఛమైన ప్రేమకు ఈ చిత్రం ప్రతీకగా ఉంటుంది' అన్నారు. తన కెరీర్‌లో గర్వంగా చెప్పుకునే చిత్రమిదని, ఇలాంటి గొప్ప సినిమాను తనకు ఇచ్చినందుకు బోయపాటి శ్రీనుకు జీవితాంతం రుణపడి ఉంటానని, జానకి పాత్రకు రకుల్ తప్ప మరెవరూ న్యాయం చేయలేరని బెల్లంకొండ శ్రీనివాస్ తెలిపారు. జానకి లాంటి పాత్ర తనకు లభించడం అదృష్టంగా భావిస్తున్నానని, తనపై నమ్మకంతో దర్శకుడు బోయపాటి శ్రీను ఈ అవకాశాన్ని ఇచ్చారని రకుల్‌ప్రీత్ సింగ్ తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రగ్యాజైస్వాల్, నందు పాల్గొన్నారు.

శుభలేఖ ఇదేనా...?



నాగచైతన్య, సమంత

ప్రేమజంట అక్కినేని నాగచైతన్య, సమంత త్వరలో వివాహ బంధంతో ఒక్కటవబోతున్న విషయం తెలిసిందే. వీరి పెళ్లి వేడుక అక్టోబర్ 6న గోవాలో జరగనుంది. ఇదిలావుండగా వీరిద్దరి వివాహానికి సంబంధించినదిగా చెబుతున్న శుభలేఖ ఒకటి సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. ఈ వెడ్డింగ్ కార్డ్ ఎంతవరకు ప్రామాణికమైనదో తెలియనప్పటికీ సోషల్‌మీడియాలో మాత్రం అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నది. గోవా వగేటర్ బీచ్‌లోని ది డబ్ల్యూ హోటల్‌లో వివాహం జరుగుతుందని ఆ పెళ్లిపత్రికలో తెలిపారు. నాగార్జున-అమల, లక్ష్మీ-శరత్‌లను ఆహ్వానితులుగా పేర్కొన్నారు. ఎవరైనా ఆసక్తికొద్దీ ఈ శుభలేఖను తయారు చేశారా? లేకా ఇదే నిజమైన పెళ్లి పత్రికా? అనే విషయంలో స్పష్టత రావాల్సివుంది.

తాజ్‌మహల్.. సమాధా? ఆలయమా?

స్పష్టం చేయాలని ప్రభుత్వానికి కేంద్ర సమాచార కమిషన్ ఆదేశం



న్యూఢిల్లీ: ప్రపంచ వింతల్లో ఒకటిగా పేరొందిన ప్రఖ్యాత కట్టడం తాజ్‌మహల్ సమాధా? లేక ఆలయమా? అనేది తేల్చాలని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖను ఆదేశించింది. తాజ్‌మహల్ షాజహాన్ కట్టిన సమాధియా లేక మొఘల్ చక్రవర్తికి ఓ రాజపుత్ర రాజు బహూకరించిన శివాలయమా తెలుపాలని కోరుతూ సమాచారహక్కు చట్టం కింద దాఖలైన దరఖాస్తుకు జవాబు ఇవ్వాలని సీఐసీ ఆదేశించింది. ఇప్పటికే ఈ వివాదంపై పలు కోర్టు కేసులుండగా, తాజాగా ఆర్టీఐ దరఖాస్తు రూపంలో ఈ అంశం సీఐసీని చేరింది. ఆ పాలరాతి కట్టడం చరిత్రపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని, వివాదానికి తెరదించాలని సమాచార కమిషనర్ శ్రీధర్ ఆచార్యులు ఇటీవల జారీ చేసిన ఆదేశాలలో పేర్కొన్నారు. తాజ్‌మహల్ మూలాలకు సంబంధించి సాంస్కృతిక మంత్రిత్వ శాఖ తన వైఖరిని వెల్లడించాలని ఆయన సూచించారు. దీనికి సంబంధించి సుప్రీం కోర్టు సహా పలు కోర్టుల్లో ఉన్న కేసులు కొన్ని డిస్మిస్ అయ్యాయని, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ కేసుల్లో భారత పురావస్తు శాఖ తన వంతుగా కొన్ని అఫిడవిట్లు దాఖలు చేసిందని శ్రీధర్ ఆచార్యులు గుర్తు చేశారు. ఆర్టీఐ దరఖాస్తుదారుని వద్ద రుసుం వసూలుచేసి ఆ అఫిడవిట్ కాపీలను ఈ నెల 30లోగా అందజేయాలని ఆయన ఆదేశించారు.

పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికేట్ ఉంటేనే వాహన బీమా

ఇన్సూరెన్స్ కంపెనీలకు సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: వాయు కాలుష్యాన్ని నియంత్రించే దిశగా సుప్రీంకోర్టు గురువారం పలు ఆదేశాలు జారీ చేసింది. కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ ఉన్న వాహనాలకే బీమా సదుపాయాన్ని పునరుద్ధరించాలని లేని వాహనాలకు పునరుద్ధరించరాదని బీమా సంస్థలను ఆదేశించింది. వాయు కాలుష్యానికి కారణమయ్యే వాహనాలు రోడ్లపై నుంచి వైదొలిగేలా చర్యలు తీసుకోవాలని జస్టిస్ మదన్ బి లోకుర్ నేతృత్వంలోని ధర్మాసనం ఇన్సూరెన్స్ కంపెనీలకు సూచించింది. కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ల జారీలో అవకతవకలను అరికట్టేందుకు ఆన్‌లైన్ వ్యవస్థను పొల్యూషన్ కంట్రోల్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఢిల్లీ జాతీయ ప్రాదేశిక ప్రాంతం (ఎన్సీఆర్)లో అన్ని పెట్రోలు బంకుల్లో కాలుష్య నియంత్రణ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోర్టు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖను ధర్మాసనం ఆదేశించింది. ఇందుకోసం నాలుగు వారాల గడువునిచ్చింది. దీనిపై పర్యావరణ కాలుష్య నియంత్రణ సంస్థ (ఈపీసీఏ) చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిపింది.



సంకేత భాషలో జాతీయగీతం ఆవిష్కరణ

న్యూఢిల్లీ: దివ్యాంగుల కోసం సంకేత భాషలో జాతీయగీతాన్ని కేంద్రప్రభుత్వం రూపొందించింది. ఎర్రకోట వద్ద బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్, దివ్యాంగులతో దర్శకుడు గోవింద్ నిహలానీ 3.30 నిమిషాల నిడివిగల వీడియోను తీశారు. దీనిని కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ సహాయ మంత్రి మహేంద్రనాథ్ పాండే ఢిల్లీలో గురువారం ఆవిష్కరించారు. శారీరక లోపం ఉన్న వారు వికలాంగులు కాదని.. దివ్యాంగులని, మిగతావారితో వారికెలాంటి వ్యత్యాసం లేదని ఆయన చెప్పారు. దివ్యాంగుల కోసం సంకేత భాషలో జాతీయగీతం వీడియో రూపొందించడం గర్వంగా ఉంద న్నారు. ప్రాచీనకాలంలోనే భారతదేశంలో సంకేతభాషను ఉపయోగించారని ఆయన చెప్పారు. ఢిల్లీతోపాటు గోవా, భోపాల్, చండీగఢ్, కొల్హాపూర్‌లో సంకేతభాషలో ఈ వీడియోను ఆవిష్కరించారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఐక్యరాజ్యసమితి భారత్, భూటాన్ సమాచార కేంద్రం డైరెక్టర్ డెరెక్ సెగార్, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుదేశ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

టైప్‌రైటింగ్ శకానికి స్వస్తి

ముంబైలో ముగిసిన చివరి మాన్యువల్ పరీక్షలు

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైలో స్టెనోగ్రాఫర్ కాలేజీలు గత శుక్రవారం చిట్టచివరిసారిగా టైప్‌రైటింగ్ మాన్యువల్ పరీక్షలు నిర్వహించాయి. ఒక్క మహారాష్ట్రలోనే దాదాపు 3500 సంస్థలు పురాతన పద్ధతుల ద్వారా టైప్‌రైటింగ్ శిక్షణ అందిస్తున్నాయి. సాంకేతిక ఆవిష్కరణల కోసం టైప్‌రైటర్ల శకానికి ముగింపు పలుకాల్సిందేనని ముంబైలో షార్ట్‌హ్యాండ్, టైప్‌రైటింగ్ సంస్థ నిర్వాహకులు అశోక్ అభ్యాంకర్ తెలిపారు. కంప్యూటర్లు వచ్చినా ఇప్పటికీ దేశంలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయసంస్థల్లో టైప్‌రైటర్లను ఉపయోగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా దాదాపు 7 లక్షల మంది విద్యార్థులు.. అధికారిక ధ్రువీకరణ పత్రాలు టైపింగ్ చేస్తున్నారని అభ్యాంకర్ చెప్పారు.కంప్యూటర్ ధరలు తగ్గడం, టైప్‌రైటర్ల వినియోగం నిలిచిపోవడంతో టైప్‌రైటర్ల శకం ముగుస్తున్నదని అభ్యాంకర్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే ఆఖరుదాకా 2013 వరకు భారత్ 163 ఏండ్లపాటు టెలిగ్రామ్ సేవలను కొనసాగించింది.



వీడ్కోలు కార్యక్రమంలో హమీద్ అన్సారీ, వెంకయ్య మాటామంతి

రాజకీయ దురుద్దేశంతోనే ఆ వ్యాఖ్యలు

- 'మైనార్టీల అభద్రత'పై వెంకయ్యనాయుడు
- హమీద్ అన్సారీపై పరోక్ష విమర్శలు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: దేశంలోని ముస్లింలలో అభద్రతాభావం నెలకొన్నదని, సామరస్యభావనకు ముప్పు ఏర్పడిందని ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ చేసిన వ్యాఖ్యలను ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు గురువారం తప్పుబట్టారు. మైనార్టీల అభద్రతపై చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న అసత్యప్రచారమని మండిపడ్డారు. ఎవరి పేరునూ ప్రస్తావించకపోయినా, పరోక్షంగా బుధవారంనాటి అన్సారీ వ్యాఖ్యలపై వెంకయ్యనాయుడు ఇలా ప్రతిస్పందించారు. 'మైనార్టీలు అభద్రతలో ఉన్నారని కొందరు చెప్తున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నవే. ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే భారత్‌లోనే ముస్లింలు ఎక్కువ సురక్షితంగా ఉన్నారు. వారికి దక్కాల్సినంత గౌరవం దక్కుతున్నది' అని వెంకయ్యనాయుడు పీటీఐ వార్తాసంస్థకు తెలిపారు. దేశంలో అసహనం పెరుగుతున్నదన్న మాటలనూ ఆయన ఖండించారు. మైనార్టీలపై వివక్ష లేదని, అత్యున్నత రాజ్యాంగ హోదాల్లోనూ వారున్నారంటే ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తున్నట్లేనని వెంకయ్య అభిప్రాయపడ్డారు. మరోవైపు, బీజేపీ కూడా అన్సారీ వ్యాఖ్యలను తప్పుపట్టింది. రాజకీయ ఆశ్రయం కోరేందుకే ఆయన ఇలా మాట్లాడినట్లుందని బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయ్ వర్గీయ విమర్శించారు. పదవీ విరమణకు ఒకరోజు ముందు హమీద్ అన్సారీ బుధవారం ఓ ఇంటర్వ్యూలో దేశంలోని ముస్లింలలో అభద్రతాభావం నెలకొన్నదని వ్యాఖ్యానించటం వివాదాస్పదమైంది.

విమర్శే లేకపోతే

ప్రజాస్వామ్యం నిరంకుశమవుతుంది

చివరి రోజు ప్రసంగంలో ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ

చైర్మన్‌కు రాజ్యసభ ఘనంగా వీడ్కోలు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: ప్రభుత్వ విధానాలపై సద్విమర్శ అనేదే లేకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశ పాలనగా మారుతుందని ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ అభిప్రాయపడ్డారు. పదేండ్లపాటు ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గా పనిచేసిన అన్సారీకి.. పదవీకాలపు చివరిరోజైన మంగళవారం పెద్దలసభ వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అన్సారీ పలు అంశాలపై స్పందించారు. రాజ్యసభను రాజ్యాంగం సృష్టించిందని, జ్ఞానసంపన్నులైన మహామహులు కాంక్షించిన భారతీయ భిన్నత్వానికి అది ప్రతీక అని చెప్పారు. మాజీ ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ మాటలను ప్రస్తావిస్తూ.. 'ప్రభుత్వ విధానాలపై నిర్మొహమాటంగా విపక్షాలు, ఇతర పక్షాలు సద్విమర్శ చేసే అవకాశం లేనప్పుడు ప్రజాస్వామ్యం క్రమంగా నిరంకుశపాలనగా మారుతుంది' అన్నారు. విమర్శించే హక్కు సభ్యులందరికీ ఉన్నదని, అయితే తమ బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలని ఎంపీలకు సూచించారు. విమర్శ ఉద్దేశపూర్వక ప్రతిబంధకంగా మారరాదని, పార్లమెంటు వ్యవహారాలను అడ్డుకోరాదని అన్నారు. చర్చ అనే పరమోన్నత సభానిబంధనను పట్టించుకోకపోతే.. అది పరిణతితో కూడిన ప్రజాస్వామ్యం అనిపించుకోదని అన్నారు. చర్చించడమనేదే లేకపోతే విధాన నిర్ణయాల్లో జాగరూకత కొరవడి, అది వ్యవస్థలోని డొల్లతనాన్ని బయటపెడుతుందని తెలిపారు. మైనారిటీలకు రక్షణతో ప్రజాస్వామ్యం గౌరవం మరింత ఇనుమడిస్తుందని చెప్పారు. అదేసమయంలో మైనారిటీలకు హక్కులు, రక్షణలే కాదు, బాధ్యతలూ ఉంటాయని గుర్తుచేశారు. చట్టసభల్లో అరుపుల మధ్య బిల్లులు ఆమోదం పొందకూడదని, తొందరపాటు చట్టాలు అనర్థదాయకమని అన్నారు. చర్చించడం అంటే ఆటంకపర్చడం కాదని, చర్చించడమనే ప్రజాస్వామ్యపు గొప్ప సంప్రదాయానికి రాజ్యసభ మరింత వన్నెతెస్తున్నదని అన్నారు. 'సభాపతి స్థానం క్రికెట్‌లో అంపైర్, హాకీలో రెఫరీ లాంటిది. ఆటను, ఆటగాళ్లను చూడవచ్చుకానీ నేరుగా ఆడలేము. ఇక్కడ మాకు ఉపకరించే ఏకైక వనరు.. నిబంధనావళి మాత్రమే' అని హమీద్ అన్సారీ అభిప్రాయపడ్డారు. సభా కార్యకలాపాలను ప్రజలు సునిశిత దృష్టితో చూస్తున్నారన్న విషయాన్ని సభ్యులు మరువరాదని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గా పదేండ్లు వ్యవహరించానని, వ్యక్తిగా అది చాలా ఎక్కువ సమయమేనని అన్సారీ అన్నారు. అంతకుముందు సభ్యులు అన్సారీ సేవలను కొనియాడారు.



ఢిల్లీలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ అభివాదం.. చిత్రంలో ప్రధాని మోదీ, ఎన్నికైన ఉపరాష్ట్రపతి వెంకయ్య, స్పీకర్ సుమిత్రా మహాజన్, కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, అనంత్‌కుమార్, ఎంపీ గులాంనబీ ఆజాద్ తదితరులున్నారు.

నిబద్ధత కలిగిన నాయకుడు అన్సారీ : మోదీ

పదేండ్లపాటు ఉపరాష్ట్రపతిగా సేవలందించిన హమీద్ అన్సారీకి రాజ్యసభ ఘనంగా వీడ్కోలు పలికింది. ప్రభుత్వానికి అన్సారీ అన్నివిధాలా సహకరించారని, రాజ్యాంగ విలువలను ఆయన పరిరక్షించారని ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. అన్సారీని నిబద్ధత కలిగిన నాయకుడిగా ఆయన అభివర్ణించారు. దౌత్యవేత్తగా పనిచేసిన అన్సారీ రాజనీతిజ్ఞత పలు సందర్భాల్లో తనకు ఉపయోగపడిందని చెప్పారు. ఆయన కుటుంబం వందేండ్లుగా ప్రజాజీవితంలో ఉన్నదని ప్రధాని పేర్కొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ.. అనేక సవాళ్లు ఎదురవుతున్నా, దేశం ప్రగతిశీలంగా పురోగమించడానికి అన్సారీ వంటి నేతలే కారణమని చెప్పారు. సభలో అంతరాయాలే కాకుండా, పలుమార్లు గొప్ప చర్చలు అన్సారీ సమక్షంలో జరిగాయని రాజ్యసభలో అధికారపక్ష నేత అరుణ్ జైట్లీ చెప్పారు. విపక్ష నేత గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ అన్సారీ సభను నడిపించిన విధానం గొప్పదని అన్నారు. సీపీఎం నేత సీతారాం ఏచూరి మాట్లాడుతూ ప్రశ్నోత్తరాలను మధ్యాహ్నానికి మార్చడం, రాజ్యసభ చానల్ ప్రారంభం వంటివి అన్సారీ చొరవతోనే సాధ్యమయ్యాయని తెలిపారు. సభాసమయాన్ని అన్సారీ సాయంత్రం ఆరు గంటల వరకు పొడిగించారని తృణమూల్ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ చెప్పారు.

వేడి రాజుకుంటున్న డోక్లాం

- సమీప గ్రామ ప్రజల తరలింపు
- భారీగా తరలివెళుతున్న సైన్యం
- విన్యాసాలకోసమేనంటున్న సైన్యాధికారులు
- డోక్లామ్ మాదే: చైనాకు స్పష్టంచేసిన భూటాన్



న్యూఢిల్లీ, ఆగస్టు 10: భారత్-భూటాన్-చైనా సరిహద్దుల్లోని డోక్లాంలో వేడి రాజుకుంటున్నట్టు తెలుస్తున్నది. గత 50 రోజులకు పైగా భారత్, చైనా బలగాలు డోక్లాంలో మోహరించడంతో నెలకొన్న ప్రతిష్టంభన ఘర్షణ దిశగా సాగుతున్నట్టు జరుగుతున్న పరిణామాలు తెలుపుతున్నాయి. 33వ కార్ప్‌కు చెందిన వేలాదిమంది భారత సైనికులు సుక్నా నుంచి డోక్లాం వైపు కదులుతుండగా, సరిహద్దుకు సమీపంలోని గ్రామాలను వెంటనే ఖాళీ చేయాలని సైన్యం ప్రజలను కోరింది. డోక్లాంకు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న నతాంగ్ గ్రామ వాసులను సైన్యం వేరే ప్రాంతాలకు తరలిస్తున్నది. డోక్లాం వైపు వస్తున్న 33వ కార్ప్‌కు చెందిన సైనికులకు నతాంగ్‌లో ఆశ్రయం కల్పించేందుకు గ్రామస్తులను తరలిస్తున్నారా లేక ఏదైనా ఘర్షణ జరిగితే పౌరులకు హాని కలుగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారా అన్నది తెలియాల్సి ఉంది. నతాంగ్ జనాభా వందల సంఖ్యలోనే ఉంది. సైనిక బలగాల తరలింపుపై అధికారికంగా ఎటువంటి ప్రకటన వెలువడలేదు. అయితే ప్రతి సెప్టెంబర్‌లో ఇక్కడ సైనిక విన్యాసాలు నిర్వహిస్తామని, ఈ ఏడాది ఒక నెల ముందుగా చేపట్టనున్నామని కొంతమంది సీనియర్ సైన్యాధికారులు చెప్పారు. భారత సైన్యం 'యుద్ధం లేదు, శాంతి లేదు' అన్న స్థితిలో ఉన్నదని ఆర్మీ వర్గాలను ఉటంకిస్తూ కొన్ని వార్తలు వెలువడ్డాయి. అనగా మిలిటరీ పరిభాషలో, సైన్యం శత్రువుతో ఘర్షణ పడేందుకు సిద్ధంగా ఉందని అర్థం.

చైనా వ్యాఖ్యలను తిరస్కరించిన భూటాన్

భారత్-చైనాల మధ్య ప్రతిష్టంభనకు కారణమైన డోక్లాం తమది కాదని తామెన్నడూ చెప్పలేదని భూటాన్ స్పష్టం చేసింది. ఈ విషయంలో చైనా వాదన అబద్ధమని తెలిపింది. డోక్లాం తమ దేశ పరిధిలో లేదని భూటాన్ వారి దౌత్యవర్గాల ద్వారా సమాచారం అందించిందని చైనా దౌత్యాధికారి వాంగ్ వెన్‌లీ ఇటీవల బీజింగ్‌లో పర్యటించిన భారతీయ మీడియాకు చెప్పారు. ఆమె వ్యాఖ్యలను భూటాన్ గురువారం తోసిపుచ్చింది. డోక్లాం తమ భూభాగమని, అందులో రోడ్డును నిర్మించడం ఒప్పందాలను ఉల్లంఘించడమేనని తమ విదేశాంగ శాఖ జూన్ 29న ఒక ప్రకటన జారీ చేసిందని, ఆ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని స్పష్టం చేసింది.

దూకుడు తగ్గని చైనా మీడియా

చైనా అధికారిక మీడియా గత కొన్ని వారాలుగా ఎడతెరిపి లేకుండా యుద్ధభేరి మోగిస్తున్నది. చైనా డైలీ తాజా సంపాదకీయంలో, 'రెండు సైన్యాల మధ్య ఘర్షణకు కౌంట్‌డౌన్ మొదలైందని భారత్ హెచ్చరించింది' అని ప్రచురించింది. డోక్లాంలో వివాదం ఏడో వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో ప్రతిష్టంభనకు శాంతియుత పరిష్కారానికి ద్వారాలు మూసుకుపోతున్నాయని వ్యాఖ్యానించింది. ఇక షిన్‌హువా, గ్లోబల్ టైమ్స్ పత్రికల్లోనైతే భారత్‌పై నిందలువేస్తూ అనేక వ్యాసాలు ప్రచురితమయ్యాయి.

చైనావి రెచ్చగొట్టే చర్యలు : అమెరికా చట్టసభ సభ్యుడు

భారత్, చైనా మధ్య నెలకొన్న ప్రతిష్టంభన పట్ల అమెరికా చట్టసభ సభ్యుడు రాజా కృష్ణమూర్తి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చైనా రెచ్చగొట్టుడు చర్యల కారణంగానే ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయని ఇల్లినాయిస్ నుంచి అమెరికా కాంగ్రెస్‌కు ఎన్నికైన కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆ సమస్యను శాంతియుతంగా దౌత్యమార్గంలో పరిష్కరించుకోవాలని చెప్పారు.

నేడే వెంకయ్య ప్రమాణం

రాష్ట్రపతి భవన్‌లో ఉదయం పది గంటలకు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఎం వెంకయ్యనాయుడు శుక్రవారం ఉదయం పది గంటలకు రాష్ట్రపతిభవన్ లోని దర్బార్‌హాల్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడి చేత ప్రమాణం చేయిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రధానితో సహా కేంద్రమంత్రులు, అన్ని పార్టీల రాజ్యసభ, లోక్‌సభాపక్ష నేతలు, ఆహ్వానితులు హాజరుకానున్నారు. కార్యక్రమానికి ముందు వెంకయ్యనాయుడు రాజ్‌ఘాట్ వెళ్లి జాతిపిత మహాత్మాగాంధీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించనున్నారు. ఆ తర్వాత దీనదయాళ్ ఉపాధ్యాయ పార్కులో దీన్‌దయాళ్ విగ్రహానికి, పటేల్ చౌక్‌లో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. రాష్ట్రపతి భవన్ దర్బార్ హాల్‌లో పది గంటలకు ప్రమాణ స్వీకారం చేసి ఆహ్వానితులతో కలిసి తేనీటి విందులో పాల్గొంటారు. అక్కడి నుంచి పార్లమెంటుకు వచ్చి రాజ్యసభ చైర్మన్‌గా చాంబర్‌లో బాధ్యతలు స్వీకరిస్తారు. పదకొండు గంటలకు ప్రారంభమయ్యే రాజ్యసభ సమావేశాలను చైర్మన్ హోదాలో నిర్వహిస్తారు. గంటపాటు జీరో అవర్, తర్వాత జరిగే ప్రశ్నోత్తరాల సమయం వరకు రాజ్యసభలోనే ఉంటారు. ఈ సమయంలో రాజ్యసభ సభ్యులంతా ఆయనకు స్వాగతం పలుకుతూ ఉపన్యసించే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వెంకయ్య ఉపరాష్ట్రపతి అధికారిక నివాసమైన 'ఉపరాష్ట్రపతి హౌస్'కు చేరుకుని అధికారులు, సిబ్బందిని పరిచయం చేసుకుంటారు. భోజన విరామం అనంతరం సందర్శకులతో సంభాషించి సాయంత్రం ఐదు గంటలకు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి రామ్‌నాథ్ కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుంటారు. వెంకయ్యనాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి టీఆర్ఎస్ తరపున ఎంపీలు జితేందర్‌రెడ్డి, కవిత తదితరులు హాజరు కానున్నారు

నిబంధనలు అమలు చేస్తా!: సభా వ్యవహారాలపై వెంకయ్య

పార్లమెంట్ సభా కార్యకలాపాలకు తరచూ అంతరాయం కలుగడం పట్ల ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు అసంతృప్తి వ్యక్తంచేశారు. చైర్మన్‌గా రాజ్యసభను నడిపించేందుకు తాను నిబంధనలను అమలు చేస్తానని, సభ్యుల సహకారాన్ని కోరుతానని చెప్పారు. ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టనున్న వెంకయ్య గురువారం పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడారు. ప్రభుత్వం తన ఎజెండాను అమలు చేసేందుకు అవసరమైన చట్టాల రూపకల్పనకు పార్లమెంట్ సహకారం అవసరమని అన్నారు. ఉభయ సభల్లోని సభ్యులకు వాటిపై చర్చించే బాధ్యత ఉంటుందని చెప్పారు. సభ పనిచేయకుండా అడ్డుకుంటే చట్టాలు ఎలా రూపొందుతాయని ప్రశ్నించారు. పార్లమెంట్ సమావేశాలను అర్థవంతంగా నిర్వహించేందుకు పరిపక్వత అవసరమని వెంకయ్య అభిప్రాయపడ్డారు. చైర్మన్ సభాధ్యక్షుడేగాక, సభ సంరక్షకుడు కూడా అని తెలిపారు.

రైలులో బాంబు

ప్రయాణికుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

అమేథీ: కోల్‌కతా – అమృత్‌సర్ మధ్య ప్రయాణించే 'అకల్ తఖ్త్' సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ నాటు బాంబుతోపాటు హిందీలో రాసిన లేఖను ఉత్తరప్రదేశ్ పోలీసులు కనుగొన్నారు. ఇటీవల కశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తాయిబా కమాండర్ అబూ దుజానా మృతికి ప్రతీకారంగా ఈ బాంబును పెట్టినట్లు ఉగ్రవాద సంస్థ 'ఇండియన్ ముజాహిదీన్ ఆ లేఖలో హెచ్చరించింది. ఏసీ బోగీలోని బాత్‌రూం వద్ద బాంబును గమనించిన ప్రయాణికులు సమాచారం ఇవ్వడంతో అక్బర్‌గంజ్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులను ఖాళీ చేయించి, బాంబును స్వాధీనం చేసుకున్నామని రైల్వేశాఖ అదనపు డీజీ బీకే మౌర్య తెలిపారు.

షా వచ్చేశాడు.. ఇక మీ సరదాలకు చెల్లు

బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ హెచ్చరిక

న్యూఢిల్లీ: రాజ్యసభలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా అడుగు పెట్టనున్న నేపథ్యంలో పార్టీ ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ హెచ్చరికలు జారీచేశారు. గురువారం ఆయన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ 'ఇక అమిత్‌షా ఇక్కడే ఉంటారు. మీ అందరి సరదా రోజులకు కాలం చెల్లింది' అని చెప్పారు. పార్లమెంట్ సమావేశాలకు గైర్హాజరవుతున్న వారిని కఠినంగా హెచ్చరించిన మోదీ.. ఇక సభ్యులందరూ హాజరయ్యేలా అమిత్‌షా చర్యలు తీసుకుంటారన్నారు.

ఏకం కానున్న అన్నాడీఎంకే గ్రూపులు

- ముమ్మరంగా ఇరువర్గాల సంప్రదింపులు.. త్వరలో నిర్ణయం
- దినకరన్ నియామకం చెల్లదని, శశికళకు పదవి తాత్కాలికమేనని పళనివర్గం తీర్మానం
- తీర్మానంపై మండిపడ్డ దినకరన్



చెన్నై, ఆగస్టు 10: తమిళనాడులోని అధికారపార్టీ అన్నాడీఎంకేలోని రెండు వైరివర్గాలు త్వరలోనే ఒక్కటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండువర్గాల ప్రతినిధులు కొద్ది రోజుల క్రితం చెన్నైలో సమావేశమై విలీనంపై చర్చలు ప్రారంభించారు. ప్రస్తుతం చర్చలు తుదిదశలో ఉన్నాయని వారు తెలిపారు. పళని, పన్నీర్ వర్గాల ప్రతినిధుల మధ్య కొంతకాలంగా సంప్రదింపులు జరుగుతున్నాయి. విలీనానికి శశికళ, దినకరన్‌లను పార్టీ నుంచి బహిష్కరించాలన్న పన్నీర్ గ్రూప్ డిమాండ్‌కు అనుగుణంగా సీఎం పళని గ్రూపు చర్యలు తీసుకొంటున్నది. గురువారం పళనిస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశం అన్నాడీఎంకే పార్టీ ఉపప్రధాన కార్యదర్శిగా దినకరన్ నియామకం చట్టవిరుద్ధమని ప్రకటించింది. కొన్నిపార్టీ పోస్టుల్లో ఈ నెల 4న ఆయన చేసిన నియామకాలు కూడా చెల్లవని పేర్కొంది. అంతేకాక శశికళకు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి తాత్కాలికమేనని తీర్మానించింది. జయలలిత మృతి దరిమిలా శశికళను ఆ పదవిలో నియమించవలసి వచ్చిందని, 'అసాధారణ పరిస్థితుల దృష్ట్యా' ఆమె ఇప్పుడు ఆ పదవీ బాధ్యతలు నిర్వహించలేని స్థితిలో ఉన్నారంటూ ఆమె జైల్లో ఉన్న విషయాన్ని పరోక్షంగా గుర్తు చేస్తూ తీర్మానం చేసింది. ఈ ప్రకటనను పన్నీర్‌రవర్గం స్వాగతిస్తూ ఈ నిర్ణయం 'మేలుకొలుపు' అని వ్యాఖ్యానించింది. అయితే శశికళ, దినకరన్‌లను పార్టీ నుంచి బహిష్కరించి, జయలలిత మృతిపై సమగ్ర విచారణ జరిపించాలన్న తమ ప్రధాన డిమాండ్‌కు అంగీకరిస్తేనే పళనివర్గంతో కలుస్తామని అంటున్నది. ఈ వారాంతంలో పళనిస్వామి, పన్నీర్ సెల్వం భేటీ అయి విలీనంపై తుది నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

శుక్రవారం ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఇద్దరు నేతలు ఢిల్లీకి బయలుదేరారు.

దినకరన్ ఆగ్రహం..

తన నియామకం, తాను చేసిన నియామకాలు చెల్లవని పళని వర్గం ప్రకటించడంపై దినకరన్ మండిపడ్డారు. తనతోపాటు, శశికళ నియామకాలు చెల్లవన్న ప్రకటనను తోసిపుచ్చారు. ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన అఫిడవిట్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శిగా శశికళ నియామకానికి ఆమోదం తెలిపిన పళనిస్వామి ఇప్పుడు దాన్ని ఎలా వ్యతిరేకిస్తారని దినకరన్ ప్రశ్నించారు.

కమల్‌హాసన్ వేదికపై.. రజనీ ప్రేక్షకుల మధ్య..

ఏఐడీఎంకే ప్రభుత్వంపై వరుసగా విమర్శలు గుప్పిస్తున్న నటుడు కమల్‌హాసన్ డీఎంకే అధికార పత్రిక మురసోలి 75వ వార్షికోత్సవ కార్యక్రమంలో పార్టీ నేత స్టాలిన్‌తో కలిసి వేదికను పంచుకున్నారు. ఇక రాజకీయ రంగప్రవేశం చేయనున్నారని భావిస్తున్న నటుడు రజనీకాంత్ మాత్రం ప్రేక్షకుల మధ్యే ఉండిపోయారు. తమిళనాట తాజా రాజకీయపరిణామాల నేపథ్యంలో డీఎంకే కార్యక్రమంలో వీరు పాల్గొనడం ఆసక్తికర చర్చకు తెరతీసింది.

11 మంది మాజీ ఎంపీలపై విచారణ

ప్రశ్నకు నోటు కేసులో 28న ప్రాథమిక చార్జిషీట్ నమోదు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై ప్రశ్నలు అడిగేందుకు డబ్బులు డిమాండ్ చేసిన కేసులో 11 మంది మాజీ ఎంపీలు న్యాయ విచారణను ఎదుర్కోనున్నారు. వీరిపై ప్రాథమిక అభియోగాలు నమోదు చేయనున్నందున ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని ఢిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం జడ్జి పూనం చౌదరి గురువారం వారిని ఆదేశించారు. 2005లో ప్రైవేట్ టీవీ చానెల్ నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో 11 మంది మాజీ ఎంపీలు ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నలు సంధించేందుకు డబ్బులు స్వీకరించినట్లు తేలింది. దీంతో వారిపై ఐపీసీలోని నేరపూరిత కుట్ర సెక్షన్, అవినీతి నిరోధక చట్టం కింద ప్రాథమిక సాక్ష్యాధారాలు లభించాయని జడ్జి పూనం చౌదరి తెలిపారు. విచారణను ఎదుర్కొంటున్న మాజీ ఎంపీల్లో బీజేపీకి చెందిన ఛత్రపాల్ సింగ్ లోధా, అన్నా సాహెబ్ ఎంకే పాటిల్, చంద్రప్రతాప్ సింగ్, ప్రదీప్ గాంధీ, సురేశ్ చాందెల్, వై జీ మహాజన్, బీఎస్పీ నుంచి నరేందర్ కుమార్ కుశ్వాహ, లాల్ చంద్రకోల్, రాజా రాంపాల్, కాంగ్రెస్‌కు చెందిన రాంసేవక్ సింగ్, ఆర్జేడీ సభ్యుడు మనోజ్ కుమార్ ఉన్నారు.

11 కోట్లమంది నమ్మకాన్ని వమ్ముచేశారు

- నితీశ్‌పై శరద్‌యాదవ్ నిప్పులు
- మూడురోజుల బీహార్ పర్యటన ప్రారంభం

పాట్నా, ఆగస్టు 10: బీహార్‌లో సీఎం నితీశ్‌కుమార్ మహాకూటమిని వీడి రాష్ట్రంలోని 11 కోట్ల మంది ప్రజల నమ్మకాన్ని వమ్ముచేశారని, దీంతో తానూ కలత చెందానని జనతాదళ్ (యూ) సీనియర్ నేత, ఎంపీ శరద్‌యాదవ్ అన్నారు. ఈ చర్యతో నమ్మకద్రోహానికి పాల్పడ్డారంటూ నితీశ్‌కుమార్‌పై పరోక్షంగా విమర్శలు చేశారు. జేడీ(యూ), ఆర్జేడీ, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం విచ్ఛిన్నమై.. కొత్తగా జేడీ(యూ), బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో ప్రజలతో నేరుగా మాట్లాడేందుకు మూడురోజుల రాష్ట్ర పర్యటనను ఆయన గురువారం ప్రారంభించారు. ఘట్‌బంధన్ చెదిరిపోవడం బాధ కలిగించిందని శరద్‌యాదవ్ ఈ సందర్భంగా మీడియాతో అన్నారు. తాను మహాకూటమితోనే కొనసాగుతానని, అయితే తన పర్యటన పార్టీకి వ్యతిరేకం కాదని శరద్‌యాదవ్ పేర్కొన్నారు. మరోవైపు.. హద్దుమీరి మాట్లాడవద్దని శరద్ యాదవ్‌ను జేడీ(యూ) అధికార ప్రతినిధి కేసీ త్యాగి హెచ్చరించారు.

పారిశ్రామిక సదస్సు మాకు గర్వకారణం

- ప్రధాని మోదీకి సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు
- ఇవాంకా బృందానికి గొప్ప ఆతిథ్యమిస్తాం: కేటీఆర్
- దేశ పారిశ్రామికవేత్తలకు సువర్ణావకాశం: ప్రధాని మోదీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచ పారిశ్రామిక వ్యవస్థాపకుల మూడు రోజుల సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూతురు ఇవాంకా అంగీకరించడంపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. భారత్, అమెరికా సంయుక్తాధ్వర్యంలో నవంబర్ 28 నుంచి జరిగే ఈ సదస్సునకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమన్నారు. చారిత్రక నగరమైన హైదరాబాద్ మరో చారిత్రక సదస్సునకు వేదిక కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రపంచ ప్రముఖ పారిశ్రామిక వ్యవస్థాపకులంతా తరలిరావడం ఇక్కడి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకరంగా ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ సదస్సు సమాచారాన్ని ట్విట్టర్ ద్వారా తెలియచేసిన ప్రధానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సులో అమెరికా బృందానికి ఇవాంకా నాయకత్వం వహిస్తుండగా, ప్రధాని నరేంద్రమోదీ విశిష్టఅతిథిగా హాజరవుతున్నారు.

ప్రధానికి మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు

హైదరాబాద్ సదస్సునకు హాజరయ్యే ఇవాంకా ట్రంప్ తదితర ప్రముఖులకు ఘనస్వాగతం పలికి, గొప్ప ఆతిథ్యం ఇస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ప్రధాని మోదీ ట్వీట్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ కేటీఆర్ రీట్వీట్ చేశారు. ఈ సదస్సును రాష్ట్రానికి లభించిన గొప్ప గౌరవంగా అభివర్ణిస్తూ నూతన ఆవిష్కర్తలకు ఇది నాంది పలుకుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.


ప్రధాని మోదీ సీఎం కేసీఆర్ మంత్రి కేటీఆర్

ఇది సువర్ణావకాశం..

ప్రధాని మోదీ తన ట్విట్టర్ సందేశంలో ప్రపంచ పారిశ్రామిక రంగ నిపుణులంతా హైదరాబాద్ సదస్సుకు రావడం హర్షణీయమని, దేశంలోని ప్రముఖ, వర్ధమాన పారిశ్రామికవేత్తలకు ఇది ఒక సువర్ణావకాశమని వ్యాఖ్యానించారు. అమెరికా బృందానికి నాయకత్వం వహిస్తున్న ఇవాంకా ట్రంప్‌నకు హైదరాబాద్ సదస్సు గొప్ప స్వాగతం చెప్పగలదని పేర్కొన్నారు.


Min IT, Telangana @MinIT_Telangana
This is a great honor Sir. Telangana is happy to host thi[s] prestigious summit. Thanks fo[r] giving us this opportunity.
Narendra Modi @narendramodi
India and US will co-host the Global Entrepreneurship Summit at Hyderabad fro[m] 28-30 November 2017.
@realDonaldTrump @IvankaTrump
10:41 p.m. · 10 Aug 17

ప్రధాని మోదీ ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ చేసిన రీ ట్వీట్

టాస్క్‌ఫోర్స్ కార్యాలయం పేలుడు కేసు
పది మంది నిర్దోషులే

- నిలబడని ప్రత్యక్ష సాక్షులు.. కొరవడిన సాక్ష్యాధారాలు
- 11 ఏండ్లకు ముగిసిన కేసు.. అప్పీలుకు వెళతాం: డీసీపీ అవినాశ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజధానిలో సంచలనం సృష్టించిన బేగంపేట టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై బాంబు దాడి కేసులో గురువారం తీర్పు వెలువడింది. ఈ కేసులో పదిమంది నిందితులను నాంపల్లి క్రిమినల్ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. సరైన ఆధారాలు ప్రవేశపెట్టకపోవడం, సాక్షులు చివరివరకు నిలువకపోవడం, నిందితుల మధ్య సంబంధాలను వివరించకపోవడం రుజువు చేయకపోవడంతో కేసు వీగిపోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. బేగంపేట గ్రీన్‌లాండ్స్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై ఉగ్రవాదులు 2005, అక్టోబర్ 12న దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో మానవ బాంబుగా ఉన్న బంగ్లాదేశ్ యువకుడు డాలిన్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో పనిచేస్తున్న సత్యనారాయణ అనే హోంగార్డు మరణించారు. దాడికి తమదే బాధ్యతని బంగ్లాదేశ్ ఉగ్రవాద సంస్థ హర్కతుల్ జిహాద్ ఇస్లామియా (హుజి)అప్పట్లోనే ప్రకటించింది. కేసు దర్యాప్తుచేసిన సీసీఎస్ సిట్ అధికారులు.. 20 మందిని నిందితులుగా గుర్తించారు. ప్రధాన నిందితునిగా మానవ బాంబు డాలిన్‌ను పేర్కొన్నారు. మిగతా 19 మందిలో పది మందిని అరెస్టుచేశారు. వారిలో అబ్దుల్ కలీం (ఏ4), మహ్మద్ అబ్దుల్ జాహెద్ (ఏ5), నఫీఖుల్ బిస్వాస్ (ఏ6), షేక్ అబ్దుల్‌ఖాజా (ఏ9), మహమ్మద్ హిలాలుద్దీన్ (ఏ12), షకీల్ (ఏ15), సయ్యద్‌హాజీ (ఏ16), అబ్దుల్‌అలీఖాన్ (ఏ17), సయ్యద్ అజామత్‌అలీ (ఏ18), మహమ్మద్ బరూద్వాలా (ఏ19) ఉన్నారు. ఇద్దరు నిందితులు మరణించారు. ఏడుగురు పరారీలో ఉన్నారు. బరూద్వాలా బెయిల్‌పై ఉన్నారు. తొమ్మిది మంది ఖైదీలుగా జైల్లోనే ఉన్నారు.


కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన వ్యక్తులు

సాక్షులు నిలబడలేదు!

కీలకంగా భావించిన 14 మంది సాక్షులు మొదట బాగానే చెప్పారని, ఆ తర్వాత నిలబడలేకపోయారు. బీదర్‌లో నిందితులను అరెస్టు చేసినపుడు పేలుడు పదార్థాలు లభించాయి. వాటిని, టాస్క్‌ఫోర్స్ కార్యాలయం పేల్చివేతకు వాడిన పేలుడు పదార్థాలను సరైన సమయంలో ల్యాబ్‌కు పంపడంలో, కోర్టుకు నివేదిక సమర్పించడంలో జాప్యం జరిగిందని సమాచారం. విచారణ సమయంలో ఆరుగురు పీపీలు మారడంతోపాటు అనేక కారణాలతో కేసు వీగిపోయిందని చెప్తున్నారు. కాగా న్యాయనిపుణలు సలహాతో అప్పీల్‌కు వెళుతామని సీసీఎస్ డీసీపీ అవినాశ్ మహంతి తెలిపారు. తమకు న్యాయం జరుగలేదని నాటి ఘటనలో మరణించిన హోంగార్డు సత్యనారాయణ కుమారుడు, హోంగార్డు సందీప్‌కుమార్ అన్నారు.


వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ ఎస్పీసింగ్

జిల్లా కార్యాలయాల స్థలాలను ఎంపిక చేయండి

వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించిన సీఎస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నూతన జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాల నిర్మాణం కోసం వెంటనే స్థలాలను ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. డీజీపీ అనురాగ్‌శర్మ, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా, ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, రోడ్లు భవనాలశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ, ఈఎన్సీ గణపతిరెడ్డి తదితర అధికారులతో కలిసి గురువారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. 26 జిల్లాల్లో కలెక్టరేట్లకు స్థలాలను ఎంపిక చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 15 జిల్లాల్లో మాత్రమే ఎంపిక చేశారని సీఎస్ తెలిపారు. నిర్మల్, మంచిర్యాల, వరంగల్ రూరల్, ఖమ్మం, జయశంకర్‌భూపాల్‌పల్లి జిల్లాలకు ప్రత్యామ్నాయ స్థలాలను చూడాలని ఆదేశించారు. మరో నాలుగు జిల్లాలకు చెందిన స్థలాల ఎంపికపై సీఎం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని చెప్పారు. ఎస్పీ కార్యాలయాల కోసం 13 జిల్లాల్లో స్థలాలను ఎంపిక చేయాల్సి ఉన్నదని, వీటి ఎంపికలో జాప్యం చేయొద్దని ఆదేశించారు.

బియ్యం సేకరణ లక్ష్యాన్ని చేరుకోవాలి

- ఇప్పటికే పూర్తయిన 54 శాతం సేకరణ
- రెండునెలల్లో ఈ-పాస్ ప్రక్రియ పూర్తి
- వందశాతం తూకంతో డీలర్లకు బియ్యం అందించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్


వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీవీ ఆనంద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిర్దేశించిన గడువు ప్రకారం ఈ నెల 31లోగా మిల్లర్ల నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను సేకరించాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 9వ తేదీ నాటికి 54 శాతం బియ్యాన్ని మిల్లర్లు అప్పగించారని, మిగిలిన 46 శాతం బియ్యాన్ని గడువులోగా అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బియ్యం సేకరణ, ఈ-పాస్ విధానం, దీపం తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్లు, డీసీఎస్వోలు, జిల్లా మేనేజర్లు, ఎఫ్‌సీఐ, మిల్లర్లు, ఎన్‌ఐసీ అధికారులతో గురువారం పౌరసరఫరాలశాఖ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత ఖరీఫ్‌లో జగిత్యాలకు చెందిన మిల్లర్లు 99.94 శాతం బియ్యాన్ని ప్రభుత్వానికి గడువులోగా అప్పగించారని, ఈ రబీలో కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. బియ్యం అప్పగింతకు నిల్వ స్థలాన్ని సాకుగా చూపించే అవకాశం ఇప్పుడు మిల్లర్లకు లేదని, మిల్లర్ల ఫిర్యాదు మేరకు ఎఫ్‌సీఐ అధికారులతో మాట్లాడి, బియ్యం నిల్వలకు అవసరమైన స్థలాన్ని అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు. గోదాముల్లో నిల్వకు సరిపడినంత బియ్యాన్ని మిల్లర్లు ఇంకా అప్పగించలేదని, మిగిలిన బియ్యాన్ని నిర్ణీత గడువులోగా అప్పగించాలని సూచించారు. ఎఫ్‌సీఐ గోదాములు సెలవురోజుల్లో కూడా తెరిచి ఉంటాయని తెలిపారు. 33 లక్షల టన్నుల ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్‌ను ఈ నెల 31వ తేదీలోగా అప్పగిస్తామని, అదనంగా కేటాయించిన నాలుగు లక్షల టన్నుల బియ్యాన్ని అప్పగించేందుకు అదనంగా నెల గడువు కావాలని రైస్ మిల్లర్లు సీవీ ఆనంద్‌ను కోరగా.. వారం పొడిగించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. రేషన్ డీలర్లకు సరైన తూకంలో బియ్యం సరఫరా చేయాలని, లేనిపక్షంలో గోదాముల బాధ్యులు, జిల్లా మేనేజర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 1,545 షాపులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 5,775 రేషన్ షాపుల్లో ఈ-పాస్ యంత్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 19 నాటికి మరో 4,159 రేషన్ షాపుల్లో ఈ యంత్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. దీంతో 17,200 మొత్తం షాపులకు గాను 10వేల షాపుల్లో ఈ-పాస్ ప్రక్రియ పూర్తయినట్లు అవుతుందని తెలిపారు. సరుకుల సమాచారాన్ని లబ్ధిదారులకు ఎస్ఎంఎస్ రూపంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఏపీఎన్జీవో, బీటీఎన్జీవోల మధ్య వివాదం

సుల్తాన్‌బజార్: హైకోర్టు ఆదేశాలను ఏపీఎన్జీవోలు ఉల్లంఘిస్తున్నారని భాగ్యనగర్ టీఎన్జీవో అధ్యక్షుడు ఎం సత్యనారాయణగౌడ్, కార్యదర్శి బలరాం ఆరోపించారు. బీటీఎన్జీవో, ఏపీఎన్జీవోలకు ఉమ్మడిగా ఉన్న అసోషియేషన్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించి, వారంరోజుల్లో సభ్యత్వాలు తీసుకోవాలని గత నెల 30వ తేదీన హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. ఈ మేరకు తాము ఫ్లెక్సీలను తొలగించి, సభ్యత్వాల కోసం డీడీ కూడా గడువు కంటే ముందే తీశామని గురువారం గన్‌ఫౌండ్రీ యూనియన్ కార్యాలయం వద్ద వారు మీడియాకు చెప్పారు. ఏపీఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు ఉద్దేశపూర్వకంగా ఏపీఎన్జీవో కార్యాలయానికి తాళం వేశారని, తాము డీడీని మెయిల్ చేసినా స్పందించలేదని విమర్శించారు. గురువారం కడపకు చెందిన పలువురితో వచ్చి తమతో గొడవకు దిగారని చెప్పారు. కాగా ఏపీలో పనిచేస్తున్నవారికే తమ అసోషియేషన్‌లో సభ్యత్వం ఉంటుందని ఏపీఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు సభ్యత్వాలు చెల్లించినవారు కేవలంసభ్యులుగా మాత్రమే ఉంటారని చెప్పారు.

జాతీయ రహదారుల అభివృద్ధికి తెలంగాణకు 5560 కోట్లు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చిన విజ్ఞప్తులన్నింటిపై వెంటనే స్పందించామని కేంద్ర రోడ్డు రవాణాశాఖ సహాయమంత్రి పోన్ రాధాకృష్ణన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో రూ. 3655 కోట్లను మంజూరు చేశామని, 99 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణానికి అదనంగా రూ.1905 కోట్లను మంజూరు చేశామని తెలిపారు. తెలంగాణ విజ్ఞప్తి మేరకు పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించి గడిచిన ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ.2731.95 కోట్లను మంజూరు చేశామని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. గత మూడేండ్లలో తెలంగాణలో 879 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులను జాతీయ రహదారిగా గుర్తించి నిధులను విడుదల చేశామన్నారు. మూడేండ్లలో జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు రూ. 1386.79 కోట్లను మంజూరు చేయగా ఇందులో రూ. 1226.32 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేసిందని, ఇంకా రూ. 160.45 కోట్ల మేరకు పనులు జరుగాల్సి ఉన్నదన్నారు.

ఢిల్లీ తెలంగాణ భవన్‌లో ఆర్‌సీ ఆకస్మిక తనిఖీలు


క్వార్టర్ల నాణ్యతను తనిఖీ చేస్తున్న అరవింద్‌కుమార్

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అరవింద్ కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రాంగణం, క్వార్టర్లలో చోటుచేసుకుంటున్న గొలుసు, ఇతర దొంగతనాలను అదుపు చేసేందుకు పోలీసులతో భద్రత కల్పించాలని ఆయన నిర్ణయించారు. భవన్ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఇంజినీర్ పూర్ణచంద్రరావును ఆదేశించారు. ప్రాంగణంలో మరిన్ని అదనపు పోలీసు పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. సిబ్బంది నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయా ఇండ్లలోకి వెళ్లి లోపాలను తనిఖీ చేసి.. వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు వసతి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, వారి క్వార్టర్లకు మరమ్మతులు చేయడం, ప్రాంగణంలో వీధిదీపాల ఏర్పాటుపైనా దృష్టి పెట్టామని అరవింద్‌కుమార్ వివరించారు.

సెన్సెక్స్	నిఫ్టీ
31,531	9,825
↓ 266	↓ 88

బంగారం ధరలు

ముంబై

24 క్యారెట్లు	29,070
22 క్యారెట్లు	28,920
వెండి (కిలో)	38,995

ముడి చమురు (బ్రెంట్)

↓ 52.55

సుబ్రతకు సుప్రీంలో చుక్కెదురు



న్యూఢిల్లీ, ఆగస్టు 10: సహారా గ్రూపు అధినేత సుబ్రతా రాయ్‌కి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. పుణెకు సమీపంలో ఉన్న రూ.34 వేల కోట్ల విలువైన ఆంబీ వ్యాలీ వేలాన్ని నిలిపివేయాల్సిందిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన రాయ్‌కి తీవ్ర భంగపాటు ఎదురైంది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఏకే సిక్రీ నేతృత్వంలోని ప్రత్యేక బెంచ్..రాయ్ అభ్యర్థనను తిరస్కరించింది. రాయ్ తరపున వాదిస్తున్న కపిల్ సిబల్.. మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి రూ.1,500 కోట్లను ఒకేసారి చెల్లించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో ఆంబీ వ్యాలీ వేలాన్ని నిలిపివేయాలని అత్యున్నత న్యాయస్థాన్ని కోరారు. వచ్చే నెల ఏడులోగా సెబీ వద్ద రూ.1,500 కోట్లు డిపాజిట్ చేయాలని, లేకపోతే ఆంబీ వ్యాలీని విక్రయిస్తామని బాంబే హైకోర్టు గతంలో సహారాను హెచ్చరించిన విషయం తెలిసిందే. సెబీకి కట్టాల్సిన మిగతా రూ.9 వేల కోట్లు చెల్లించేందుకు 18 నెలల సమయం ఇవ్వాల్సిందిగా ఆయన కోర్టును కోరారు. సహారా గ్రూపునకు చెందిన సహారా ఇండియా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్, సహారా హౌజింగ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లు పెట్టుబడిదారుల నుంచి రూ.24 వేల కోట్ల నిధులను సేకరించి తిరిగి చెల్లింపుల్లో విఫలమయ్యాయి. ఈ కేసులో అరెస్టైన రాయ్‌తోపాటు రవి శంకర్ దూబే, అశోక్ రాయ్ చౌదరీలు రెండేండ్లపాటు జైలు శిక్ష కూడా అనుభవించారు. ప్రస్తుతం రాయ్ పెరోల్‌పై బయట ఉన్నారు.

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.21	67.49
ఆస్ట్రేలియా డాలర్	45.81	53.00
బహ్రెయిన్ దినార్	157.72	180.65
యూరో	68.34	79.25
జపాన్ యెన్/100	52.91	61.36
కువైట్ దినార్	175.15	218.10
ఒమన్ రియాల్	154.33	176.61
సౌదీ రియాల్	15.48	18.35
సింగపూర్ డాలర్	42.66	50.55
స్టెర్లింగ్ పౌండ్	75.62	87.74
యూఏఈ దిర్హామ్	15.84	18.52

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌ఏ
హైదరాబాద్	335-00	335-00
రంగారెడ్డి	335-00	335-00
మెదక్	335-00	335-00
కరీంనగర్	337-00	---
వరంగల్	337-00	---
రిటైల్ ప్రైస్	3-95	3-95

చికెన్ ధరలు

ఫారం ధర	77.00
రిటైల్ లైవ్	91.00
డ్రెస్డ్	127.00
స్కిన్‌లెస్	150.00

మై జియో యాప్.. 10 కోట్ల డౌన్‌లోడ్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: గూగుల్ ప్లే స్టోర్‌లో రిలయన్స్ జియోకు చెందిన మొబైల్ అప్లికేషన్ 'మై జియో' డౌన్‌లోడ్లు 10 కోట్లకు చేరుకున్నాయి. దాంతో మైజియో యాప్.. ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫాంపై అత్యధిక మంది డౌన్‌లోడ్ చేసుకున్న ఇండియన్ మొబైల్ అప్లికేషన్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుందని సంస్థ తెలిపింది. హాట్‌స్టార్ మొదటి స్థానంలో ఉంది. కేవలం ఏడాది కాలంలోనే మై జియో ఈ ఘనతను దక్కించుకుంది. ఇతర టెలికం సంస్థలు ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా సెల్యులార్‌కు చెందిన సెల్ఫ్‌కేర్ యాప్‌ల డౌన్‌లోడ్‌లు మాత్రం ఇప్పటివరకైతే కోటి మైలురాయిని దాటగలిగాయి. రిలయన్స్ జియోకు చెందిన లైవ్ టీవీ యాప్ 'జియో టీవీ' డౌన్‌లోడ్లు 5 కోట్ల స్థాయికి చేరుకున్నాయి. ఎయిర్‌టెల్ టీవీ యాప్ డౌన్‌లోడ్లు 50 లక్షలు దాటగా.. వొడాఫోన్, ఐడియాలకు చెందిన టీవీ యాప్‌ల డౌన్‌లోడ్లు పది లక్షల మార్క్‌ను దాటాయి.

బయోఇంధనానికి సరికొత్త పాలసీ

పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, ఆగస్టు 10: రవాణాకు బయో ఇంధన వాడకాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త పాలసీని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. తద్వారా ఈ రంగంలోకి వచ్చే రెండేండ్లలో రూ. లక్ష కోట్ల మేర పెట్టుబడులు రాగలవని పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాదిలో దేశంలోని 12 ప్రాంతాల్లో ఇథనాల్ ప్లాంట్లను ఏర్పాటుచేయాలని ప్రభుత్వ రంగ ఇంధన సంస్థలను కోరినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం దేశీయ ఇంధన అవసరాల్లో 80 శాతం విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. 2022 కల్లా దిగుమతి భారాన్ని 10% తగ్గించుకోవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. బయో ఇంధన వాడకం ఈ లక్ష్య సాధనలో తోడ్పడనుందని గురువారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మంత్రి అన్నారు. ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్).. బయోఫ్యూయల్‌పై పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కోసం 200 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నాయని ప్రధాన్ తెలిపారు.

భెల్ వాటాదారులకు బోనస్ షేరు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: ప్రభుత్వరంగ సంస్థ భెల్ ఆశాజనక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికిగాను రూ.80.82 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో లాభం రూ.77.77 కోట్లుగా ఉంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.6,070.21 కోట్ల స్థాయి నుంచి రూ.6,194.21 కోట్లకు ఎగబాకింది. జూన్ 30 నాటికి కంపెనీ వద్ద రూ.1,01,380 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు బంపర్ ఆఫర్ బోనస్‌ను ప్రకటించింది. రూ.2 ముఖ విలువ కలిగిన షేరుకు అంతే విలువైన షేరును వాటాదారులకు కేటాయించనున్నది. ఈ బోనస్ షేరుకు వాటాదారులు అనుమతి తీసుకోవాల్సి ఉందని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఆర్థిక ఫలితాలు అంచనావేసిన స్థాయిలోనే నమోదయ్యాయని, నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడానికి చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలను ఇచ్చాయని భెల్ సీఎండీ అతుల్ సోబ్టి తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ అధ్యక్షులు కొండూరు రవీందర్ రావును చెన్నైలో సన్మానిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి కే పళనిస్వామి.



ప్రభుత్వరంగ సంస్థ సిండికేట్ బ్యాంక్ హైదరాబాద్‌లో బిల్డర్ల కోసం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి బ్యాంక్ ఏజీఎం కేవీఎస్ మణి, రీజినల్ మేనేజర్ పళనిసామి తదితరులు హాజరయ్యారు.

వచ్చే రెండేండ్లలో 26లక్షల కోట్లకు!

ప్రభుత్వ వార్షిక వ్యయంపై పార్లమెంట్‌కు ఆర్థిక శాఖ నివేదిక

న్యూఢిల్లీ, ఆగస్టు 10:


వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వ వార్షిక వ్యయం భారీగా పెరుగనుందని పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో ఆర్థిక శాఖ వెల్లడించింది. 2019-20లో ప్రభుత్వ వ్యయం దాదాపు రూ.26 లక్షల కోట్ల స్థాయికి చేరుకోనుందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2017-18) అంచనా వ్యయం రూ.21.46 లక్షల కోట్లు. పార్లమెంట్‌కు సమర్పించిన మధ్యకాలిక వ్యయ ముసాయిదా ప్రకటన ప్రకారం.. 2019-20లో ప్రభుత్వ మూలధన వ్యయం 25 శాతం పెరిగి రూ.3.9 లక్షల కోట్లకు చేరుకోనుంది. అందులో రక్షణ శాఖకు కేటాయింపులే 22 శాతం మేర పెరుగనున్నాయి. రెవెన్యూ వ్యయంతో కలుపుకొని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొత్తం వ్యయం రూ.21.46 లక్షల కోట్లుగా కాగా.. వచ్చేసారి (2018-19) రూ.23.4 లక్షల కోట్లకు, ఆపై ఆర్థిక సంవత్సరంలో (2019-20) రూ.25.95 లక్షల కోట్లకు పెరుగనుంది. నివేదికలోని ముఖ్యాంశాలు..

1. ప్రభుత్వ మూలధన కేటాయింపుల్లో 30 శాతం వాటా కలిగిన రక్షణ రంగ వ్యయాన్ని ఈసారి రూ.91,580 కోట్లుగా అంచనా వేశారు. వచ్చేసారి రూ.1,01,137 లక్షల కోట్లకు, 2019-20లో రూ.1,11,706 కోట్లకు చేరుకోనుంది.
2. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.70 వేల కోట్లుగా ఉన్న ఎరువుల సబ్సిడీ వ్యయం.. 2019-20 వరకు ఇదే స్థాయిలో కొనసాగనుంది.
3. ఈసారి రూ.1.45 లక్షల కోట్లుగా ఉన్న ఆహార సబ్సిడీ వ్యయం 2018-19లో రూ.1.75 లక్షల కోట్లకు, 2019-20లో రూ.2 లక్షల కోట్లకు పెరుగనుంది.
4. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.25 వేల కోట్లుగా ఉన్న ఇంధన సబ్సిడీ వ్యయం వచ్చేసారి రూ.18 వేల కోట్లకు, 2019-20లో రూ.10 వేల కోట్లకు తగ్గనుంది. పెట్రోల్, డీజిల్‌పై ప్రభుత్వం నియంత్రణ ఎత్తివేసింది. ప్రస్తుతం వంట గ్యాస్ (ఎల్పీజీ), కిరోసిన్‌పైన మాత్రమే సబ్సిడీ లభిస్తున్నది. మార్చి 2018కల్లా వంటగ్యాస్‌పైనా సబ్సిడీ ఎత్తివేయనున్నట్లు, కిరోసిన్ సబ్సిడీ వ్యయాన్ని తగ్గించుకోవడంపై దృష్టిసారించనున్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది.
5. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలుతో పన్నుల పరిధి పెరుగనుందని నివేదికలో ఆర్థిక శాఖ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 11.3 శాతంగా అంచనా వేస్తున్న పన్నులు- స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) నిష్పత్తి 2018-19లో 11.6 శాతానికి, 2019-20లో 11.9 శాతానికి చేరుకోవచ్చు.
6. ఈసారి ఆదాయ లోటును జీడీపీలో 2 శాతానికి తగ్గించుకోవాలన్న లక్ష్యాన్ని సాధిస్తామని ఆర్థిక శాఖ ధీమా వ్యక్తం చేసింది. వచ్చేసారి లోటు 1.9 శాతానికి తగ్గవచ్చని నివేదిక అంచనా వేసింది.

మధ్యకాలిక వ్యయ అంచనాలు

మూలధన వ్యయం (రూ.కోట్లలో)

ఇండస్ట్రీ	2016-17 సవరించిన అంచనాలు	2017-18 బడ్జెట్ అంచనాలు	2018-19 అంచనాలు	2019-20 అంచనాలు
రక్షణ	84460	91580	101137	111706
గృహ మంత్రిత్వ	9699	11479	11691	12877
ఆర్థిక	32283	22126	23969	30034
ఆరోగ్య	1678	3512	3758	6004
వాణిజ్యం, పరిశ్రమలు	2945	1981	387	945
పట్టణాభివృద్ధి	17182	19332	22000	15000
ప్రణాళిక, గణాంకాలు	29	29	30	35
శాస్త్రీయ పరిజ్ఞానం	3696	4293	4757	12161
ఇంధనం	9259	12670	12753	14481
రవాణా	90299	111482	127307	147368
ఐటీ, టెలికం	3657	3735	3993	4277
రాష్ట్రాలకు రుణాలు	17800	18500	19500	24000
కేంద్ర పాలిత ప్రాంతాలు	1767	1763	1938	2531
ఇతర ఖర్చులు	5095	7320	7781	8581



సగానికి తగ్గిన ఆర్బీఐ డివిడెండ్

జూన్ 2017తో ముగిసిన ఏడాదికి గాను ప్రభుత్వానికి రూ.30,659 కోట్ల చెల్లింపులు

కొత్త నోట్ల ముద్రణ ఖర్చులే కారణమా?



ముంబై, ఆగస్టు 10: కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చెల్లించే డివిడెండ్ సగానికి తగ్గింది. జూన్ 2017తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వానికి ఆర్బీఐ రూ.30,659 కోట్ల డివిడెండ్ చెల్లించింది. జూన్ 2016తో ముగిసిన ఏడాదికాలంలో డివిడెండ్ చెల్లింపులు రూ.65,876 కోట్లుగా నమోదయ్యాయి. పెద్ద నోట్ల రద్దు తర్వాత కొత్త నోట్లను ముద్రించేందుకు అయిన ఖర్చులే ఈసారి డివిడెండ్ తగ్గడానికి ప్రధాన కారణమై ఉంటుందని విశ్లేషకులంటున్నారు. 'జూన్ 30, 2017తో ముగిసిన ఏడాదిలో రూ.30,659 కోట్ల అదనపు నిల్వలను కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు గురువారం నాడు జరిగిన సమావేశంలో ఆర్బీఐ సెంట్రల్ బోర్డ్ ఆమోదం తెలిపింది' అని రిజర్వ్‌బ్యాంక్ స్టేట్‌మెంట్ వెల్లడించింది. ఈసారి డివిడెండ్ తగ్గడానికి గల కారణాలను మాత్రం పేర్కొనలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో(2017-18) ఆర్బీఐ నుంచి రూ.58 వేల కోట్ల డివిడెండ్ రావచ్చని కేంద్రం అంచనా వేసింది. ఆర్బీఐతోపాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇతర ఆర్థిక సేవల సంస్థలన్నింటి నుంచి డివిడెండ్ల రూపంలో మొత్తం రూ.74,901.25 కోట్లు సమకూరవచ్చని బడ్జెట్‌లో అంచనా వేసింది. ఆర్బీఐ డివిడెండ్ భారీగా తగ్గడంతో ప్రభుత్వ ఖజానాపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును జీడీపీలో 3.2 శాతానికి కట్టడి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. లోటు నియంత్రణ లక్ష్యాలను సాధించాలంటే ఇతర మార్గాల్లో ఆదాయ వనరులు పెంచుకోవాల్సి ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో రుణాత్మకంలోకి జారుకున్న వడ్డీరేట్ల కారణంగా గడిచిన కొన్నేండ్లుగా రిటర్నులు తగ్గుముఖం పట్టాయని ఆర్బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ ఆర్ గాంధీ తెలిపారు. వ్యవస్థలో ద్రవ్యలభ్యత పెరిగిన కారణంగా రివర్స్ రెపో విధానంలో ఆర్బీఐ రుణాలు తీసుకొని వడ్డీలు చెల్లిస్తున్నదని, తద్వారా సెంట్రల్ బ్యాంక్ ఆదాయంపై ప్రభావం పడుతున్నదన్నారు. కానీ, పెద్ద నోట్లను రద్దు చేయడంతో కొత్త రూ.500 నోట్లతోపాటు రూ.2000 నోట్లను ముద్రించేందుకు భారీగా ఖర్చు అయ్యుంటుందని విశ్లేషకులు అంటున్నారు. రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తున్నట్లు గతేడాది నవంబర్ 8న ప్రభుత్వం ప్రకటించింది. అప్పటికి చలామణిలో ఉన్న రూ.17.7 లక్షల నగదులో ఈ రెండు కరెన్సీల వాటానే రూ.15.44 లక్షల కోట్లు. అంటే, దాదాపు 86 శాతానికి సమానం. కొత్త రూ.500 నోటును ముద్రించేందుకు సగటు ఖర్చు రూ.2.87-3.09 స్థాయిలో ఉందని, ఒక్కో రూ.2,000 నోటు ముద్రణ సరాసరి ఖర్చు రూ.3.54-3.77గా ఉందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. అయితే, ఈ రెండు రకాల కొత్త నోట్లను ముద్రించేందుకు ఆర్బీఐకి మొత్తం ఎంత ఖర్చు వచ్చిందనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు.

జేకుమార్, ప్రకాశ్ ఇండస్ట్రీస్‌లకు ఊరట

సెబీ ఆదేశాలపై స్టే విధించిన శాట్

ముంబై, ఆగస్టు 10: ట్రేడింగ్ నిలిపివేతకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సెక్యూరిటీస్ అపిల్లెట్ ట్రిబ్యునల్‌ను(శాట్) ఆశ్రయించిన జేకుమార్, ప్రకాశ్ ఇండస్ట్రీస్‌లకు ఊరట లభించింది. సెబీ ఆదేశాలపై శాట్ స్టే విధించింది. ఎలాంటి ప్రాథమిక విచారణ జరుపకుండానే సెబీ ఈ నిర్ణయం తీసుకున్నదని శాట్ పేర్కొంది. దేశవ్యాప్తంగా 331 ఉత్తుత్తి కంపెనీలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ సూచనలమేరకు సెబీ వీటిపై నిషేధం విధించింది. ఈ సంస్థలు పన్ను ఎగవేత, ఇతర అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ఆ సంస్థల షేర్ల ట్రేడింగ్ లావాదేవీలను నెలపాటు నిలిపివేయాలని స్టాక్ ఎక్స్చేంజ్‌లను సెబీ ఆదేశించింది. అవసరమైతే ఫోరెన్సిక్ ఆడిటింగ్ జరుపాలని సెబీ ఎక్స్చేంజ్‌లను సూచించింది. సెబీ, స్టాక్ ఎక్స్చేంజ్‌ల ఆంక్షలతోపాటు ఐటీ శాఖ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ ఇంకా ఇతర ఏజెన్సీలు జరిపే దర్యాప్తులో వెలుగులోకి వచ్చే నిజాల ఆధారంగా ఈ కంపెనీలపై భవిష్యత్‌లో మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. శాట్ తీసుకున్న తాజా నిర్ణయంతో శుక్రవారం ఈ రెండు సంస్థల షేర్లు యధావిధిగా ట్రేడింగ్ జరుగనున్నదని బీఎస్ఈ ప్రకటించింది. పార్శ్వనాథ్, కవిత్ ఇండస్ట్రీస్‌లు దాఖలు చేసిన పిటిషన్‌పై శాట్ శుక్రవారం విచారణ జరుపనున్నది.

రెడ్డీస్‌కు జర్మనీ నియంత్రణ మండలి షాక్

హైదరాబాద్, ఆగస్టు 10: ప్రముఖ ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్‌కు హైదరాబాద్‌లోని బాచుపల్లి వద్ద ఉన్న యూనిట్-2లో జర్మనీ నియంత్రణ మండలి ఇటీవల తనిఖీ చేసింది. ఈ యూనిట్‌లో తయారైన ఔషధాలకు గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీస్ (జీఎంపీ) సర్టిఫికెట్‌ను పునరుద్ధరించేందుకు నియంత్రణ మండలి నిరాకరించిందని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. సంస్థకు చెందిన జర్మనీ అనుబంధ విభాగమైన బీటాఫార్మా అర్జ్నైమిట్టెల్ జీఎంబీహెచ్‌కు నియంత్రణ మండలి ఈ విషయాన్ని తెలియజేసిందని రెడ్డీస్ పేర్కొంది. మరోసారి ఈ ప్లాంట్‌ను తనిఖీ చేసేవరకు యూరప్ దేశాలకు ఔషధాలు ఎగుమతి చేయవద్దని లేఖలో సూచించినట్లు రెడ్డీస్ వెల్లడించింది.

ఫ్లిప్‌కార్ట్‌కు భారీ ఫండింగ్

సాఫ్ట్‌బ్యాంక్ నుంచి 16వేల కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ, ఆగస్టు 10: జపాన్ కేంద్రస్థానంగా టెక్నాలజీ సేవలు అందిస్తున్న సాఫ్ట్‌బ్యాంక్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ నుంచి ఫ్లిప్‌కార్ట్ 250 కోట్ల డాలర్ల నిధులు సేకరించింది. దేశీయ కరెన్సీలో ఈ విలువ రూ.16 వేల కోట్లు. తాజా పెట్టుబడుల ద్వారా సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్.. ఫ్లిప్‌కార్ట్‌లో అతిపెద్ద వాటాదారుగా ఎదిగింది. 'ఇప్పటివరకు ఏదేని భారతీయ టెక్నాలజీ కంపెనీలోకి వచ్చిన అతిపెద్ద పెట్టుబడి ఇదే' అని గురువారం విడుదల చేసిన స్టేట్‌మెంట్‌లో ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది. వెయ్యి కోట్ల డాలర్ల విలువైన సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్.. ఫ్లిప్‌కార్ట్‌లో పెట్టనున్న మొత్తం పెట్టుబడుల్లో 150 కోట్ల డాలర్లను నేరుగా సంస్థలోకి చొప్పించనుందని, మరో 100 కోట్ల డాలర్లతో ఫ్లిప్‌కార్ట్‌లో టైగర్ గ్లోబల్ మేనేజ్‌మెంట్‌కు చెందిన వాటాను కొనుగోలు చేయనున్నట్లు తెలుస్తున్నది. దాంతో ఫ్లిప్‌కార్ట్‌లో సాఫ్ట్‌బ్యాంక్ వాటా దాదాపు 20 శాతానికి చేరుకోనున్నదని సమాచారం. 10 వేల కోట్ల డాలర్లతో ఏర్పాటైన సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్.. ప్రపంచంలోనే అతిపెద్ద టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్. సాఫ్ట్‌బ్యాంక్ మెజారిటీ పెట్టుబడులు కలిగిన మరో దేశీయ ఈ-కామర్స్ సంస్థ స్నాప్‌డీల్‌తో విలీన చర్చలు విఫలమైన రెండు వారాల్లోనే ఫ్లిప్‌కార్ట్‌లోకి సాఫ్ట్‌బ్యాంక్ భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టడం గమనార్హం.

నెల కనిష్ఠానికి సెన్సెక్స్

నాలుగు రోజులుగా నష్టాల బాటలో సూచీలు



ముంబై, ఆగస్టు 10: అమెరికా-ఉత్తర కొరియా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లతోపాటు భారత స్టాక్ సూచీలను సైతం నష్టాల బాటలో నడిపించాయి. సెన్సెక్స్ నెల రోజుల కనిష్ఠానికి జారుకుంది. ఇరు దేశాలు యుద్ధానికి కాలు దువ్వుతుండటంతో మదుపర్లలో ఆందోళన పెరిగింది. దాంతో గురువారం స్టాక్ ఎక్స్చేంజ్‌లలో ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ మరో 266.51 పాయింట్లు (0.84 శాతం) కోల్పోయి 31,531.33 వద్దకు జారుకుంది. జూలై 7 తర్వాత సూచీకిదే కనిష్ఠ స్థాయి. అంతేకాదు, సెన్సెక్స్ నష్టాల్లో ముగియడం ఇది వరుసగా నాలుగోరోజు. అనుమానిత షెల్ కంపెనీలపై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెబీ' ట్రేడింగ్ ఆంక్షలు విధించిన ఫలితంగా గత మూడు సెషన్లలో సూచీ 527.57 పాయింట్లు పతనమైంది. తాజా సెషన్‌లో నిఫ్టీ 87.80 పాయింట్లు (0.89 శాతం) క్షీణించి 9,820.25 వద్ద స్థిరపడింది. ప్రధాన స్టాకులతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి కంపెనీల్లో అమ్మకాల ఒత్తిడి అధికంగా కన్పించింది. ఫలితంగా బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 2.64 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 3.60 శాతం క్షీణించాయి. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి నిరాశాజనక ఫలితాలు ప్రకటించిన నేపథ్యంలో టాటా మోటార్స్ షేర్లు 8.60 శాతం పతనమయ్యాయి. దాంతో ఒక్కరోజులో సంస్థ మార్కెట్ విలువ రూ.10,351 కోట్లు తగ్గింది. డాక్టర్ రెడ్డీస్ 4.77 శాతం క్షీణించింది. సన్‌ఫార్మా 3.08 శాతం, అదానీ పోర్ట్స్ 2.66 శాతం, సిప్లా 2.31 శాతం, ఎస్‌బీఐ 1.87 శాతం నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలహీనపడిన నేపథ్యంలో ఇన్ఫోసిస్ 1.35 శాతం బలపడి సెన్సెక్స్ టాప్‌గైనర్‌గా నిలిచింది. టీసీఎస్, విప్రోలు కూడా స్వల్పంగా లాభపడ్డాయి. దాంతో బీఎస్ఈలో ఐటీ సూచీ 0.63 శాతం పెరిగింది. రియల్టీ సూచీ మాత్రం అత్యధికంగా 5.12 శాతం పడిపోయింది. హెల్త్‌కేర్, ఆటో, విద్యుత్ సూచీలు కూడా నష్టాలబాటలోనే నడిచాయి.

షేర్ల కొనుగోలుకూ ఆధార్ తప్పనిసరి!

త్వరలో కేంద్ర ప్రభుత్వం షేర్లు, మ్యూచువల్ ఫండ్ పథకాలు కొనుగోలు చేసేందుకు ఆధార్ నంబర్‌ను తప్పనిసరి చేసే అవకాశం ఉంది. స్టాక్ మార్కెట్ ద్వారా నల్లధనాన్ని అధికారిక సొమ్ముగా మార్చుకునే కార్యకలాపాలకు చెక్‌పెట్టే ఉద్దేశంతో కేంద్రం ఈ నిబంధనను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉందని ఎకనామిక్ టైమ్స్ కథనం పేర్కొంది. పన్ను ఎగవేతలను అడ్డుకోవాలంటే స్టాక్ మార్కెట్ లావాదేవీలకు పాన్ నంబర్ ఒక్కటే సరిపోదని, ఆధార్ సమర్పించడం కూడా తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం, క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెబీ' ఆలోచిస్తున్నట్లుగా ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఆధార్‌ను తప్పనిసరి చేస్తే కొంతమంది ట్రేడర్లు స్టాక్ మార్కెట్ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకోవచ్చని, పబ్లిక్ ఆఫరింగ్‌లకూ (ఐపీవో) ఆదరణ తగ్గవచ్చని ఓ బ్రోకరేజీ సంస్థ సీఈవో అభిప్రాయపడ్డారు. ఆధార్ తప్పనిసరి చేస్తే ప్రస్తుత క్లయింట్లలో చాలామందిని కోల్పోవాల్సి రావచ్చని బ్రోకరేజీ సంస్థల్లో ఇప్పటికే ఆందోళన మొదలైందని ఈటీ కథనం పేర్కొంది.



వర్షాల కోసం..

వర్షాలు కురువాలని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ దేవాలయంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ సంగీత కళాశాలకు చెందిన సంగీత విద్వాంసులు గురువారం నక్షత్ర వీణా వాయిద్య కచేరీ నిర్వహించారు. ప్రభుత్వ సంగీత కళాశాల ప్రొఫెసర్ విజయలక్ష్మి 27 మంది సంగీత కళాకారులతో కచేరీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందరరాజన్, కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, పూజారి రంగరాజన్, సంగీత విద్వాంసులు మురళీధర్ రెడ్డి, వెంకటాచలపతి పాల్గొన్నారు.
- మొయినాబాద్

మూడు సెకండ్లలో తత్కాల్ టికెట్

■ ఈ-పేలెటర్ యాప్‌తో సౌలభ్యం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తత్కాల్‌లో టికెట్లు బుక్‌చేసుకుంటే మూడు సెకండ్లలో టికెట్ కేటాయించే సౌలభ్యాన్ని ముంబైకి చెందిన ఈ-పేలెటర్ సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ భాగస్వామ్యంతో ఈ సదుపాయాన్ని కల్పించేందుకు సమాయత్తమైంది. బుక్‌నౌ పేలెటర్ యాప్‌తో టికెట్ బుక్‌చేసిన 14 రోజుల తర్వాత కూడా చెల్లింపులు జరిపే అవకాశాన్ని కల్పిస్తున్నది. క్రెడిట్ కార్డు, నెట్‌బ్యాంకింగ్‌తో పోలిస్తే ఇది అత్యధిక వేగంతో పనిచేస్తుందని సంస్థ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న అర్థశాస్త్ర ఫిన్‌టెక్ కంపెనీకి చెందిన సంస్థ ద్వారా వినియోగదారులు కేవలం ఒక క్లిక్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. యాప్‌ను ఉపయోగించి సూచనల ప్రకారం వివరాలు అందచేసి వచ్చిన ఓటీపీని యాప్‌లో అడిగిన ప్రదేశంలో పొందుపర్చితే క్షణాల్లో తత్కాల్ రైల్వే టికెట్ బుకైపోతుంది. బుకింగ్‌లో భాగంగా వన్‌టైం పాస్‌వర్డ్ కోసం పాన్‌కార్డు/ఆధార్‌కార్డుల్లో ఏదో ఒకదాన్ని ప్రాథమికంగా ఎంటర్ చేయాల్సి ఉంటుంది. వినియోగదారుడి ఖర్చు పరిమితిని కూడా ఈ యాప్‌లోనే నిర్ధారిస్తారు. బుధవారం పార్లమెంట్‌లో కూడా రైల్వేశాఖ సహాయ మంత్రి రాజేశ్‌గోహైన్ ఈ ప్రస్తావన తెచ్చారు.

వివాదాస్పద స్థలాలపై రూ.2 కోట్ల రుణం

■ బ్యాంకును మోసం చేసిన నిర్మాత అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వివాదాస్పద స్థలాన్ని షూరిటీగా పెట్టి బ్యాంకు నుంచి రూ.2 కోట్లు రుణం తీసుకున్న సినీ నిర్మాతను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. జీఎం జ్యువెలర్స్‌కు చెందిన విమల్ గోయల్ తన సంస్థ పేరు మీద హిమాయత్‌నగర్ బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి క్యాష్ క్రెడిట్ రుణం కింద 2014లో రూ.2 కోట్లు తీసుకున్నాడు. దీనికి సినీ నిర్మాత షేక్ బషీద్ పూచీగాఉంటూ బంజారాహిల్స్ రోడ్డు నంబర్-7లోని స్థలాన్ని షూరిటీ కింద పెట్టాడు. బ్యాంక్ అధికారుల విచారణలో ఇదే స్థలాన్ని షేక్ బషీద్ పంజాబ్ నేషనల్ బ్యాంకులో కుదువ పెట్టి తన 'బజ్జు ఎర్త్‌మూవర్స్' సంస్థ పేరు మీద రుణం తీసుకున్నట్టు తేలింది. ఈ స్థలానికి సంబంధించి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు 2008 సంవత్సరంలో హైమావతికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ విషయాలను దాచిపెట్టి షేక్ బషీద్, విమల్ గోయల్‌తో



షేక్ బషీద్

కలిసి బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి మోసపూరితంగా రుణం పొందాడని తేలింది. గతంలో షేక్ బషీద్ ఇదే విధంగా వివాదాస్పద స్థలాలను బ్యాంకుల్లో షూరిటీ పెట్టి జూబ్లీహిల్స్ సిండికేట్ బ్యాంకు నుంచి రూ.65 లక్షలు, హెచ్‌ఎస్‌బీసీ బ్యాంక్ నుంచి రూ.70 లక్షలు, పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రూ.70 లక్షలు, సికింద్రాబాద్ ఇండస్‌ఇండ్ బ్యాంకు నుంచి రూ.35 లక్షలు రుణం తీసుకున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి టూటౌన్, అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్లలో కూడా షేక్ బషీద్‌పై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. షేక్ బషీద్ అల్లరే అల్లరి, మెంటల్ పోలీస్, నోటుకు పోటు, ఫైర్ సినిమాలకు నిర్మించాడని పోలీసులు వివరించారు.

హంపి మహాసంస్థానానికి లక్ష్మీగణపతి ఆలయ బాధ్యతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ విజయనగర్‌కాలనీలోని లక్ష్మీగణపతి దేవాలయాన్ని హంపి శ్రీవిరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానానికి అప్పగిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ నిర్ణయం తీసుకున్నది. గురువారం దేవాదాయశాఖ కార్యదర్శి శివశంకర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ దేవాలయంలో ఇప్పటి వరకు ధూపదీప నైవేద్య పథకాన్ని (డీడీఎన్) వర్తింపజేస్తున్నారు. ఇకనుంచి డీడీఎన్ పథకం ఇక్కడ వర్తించదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దేవాదాయశాఖ చట్టం ప్రకారం ఈ ఆదేశాలను జారీ చేశారు.

గంజాయి ఓచోట.. నిందితులు మరోచోట

■ మూడేండ్లలో రైళ్లలో 3 వేల కిలోల పట్టివేత.. పట్టుబడింది 30 మందే

■ అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు దక్షిణ మధ్య రైల్వే, స్టేట్ రైల్వే పోలీసుల సంయుక్త కార్యాచరణ



ధూల్‌పేటలో గంజాయితో చిక్కిన వదినామరిది, ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులకు చిక్కిన గంజాయి నిందితుడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైళ్లలో గంజాయి రవాణాకు చెక్ పెట్టేందుకు దక్షిణమధ్య రైల్వే, స్టేట్ రైల్వే పోలీసులు సంయుక్త కార్యాచరణను రూపొందిస్తున్నారు. స్టేషన్లలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రత్యేకంగా ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్(టీటీఈ)లతో లగేజీపై నిఘా పెట్టి.. గంజాయి రవాణాను అడ్డుకుని, నిందితులను పట్టుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. రైళ్లలో నిందితులు ఓ చోట కూర్చొని, గంజాయిని వేరే సీటు వద్ద పెట్టి గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. దీంతో మూడేండ్లలో మూడు వేల కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నా.. కేవలం 30 మంది నిందితులనే పట్టుకున్నారు. అప్పుడప్పుడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తున్నా.. గంజాయి రవాణాదారులు ఏసీ కోచ్‌లలో ప్రయాణిస్తూ తప్పించుకుంటున్నారు. దాడుల్లో గంజాయి పట్టుకుంటుండగా.. ఆ లగేజీ పక్కనున్న అమాయకులు బుక్ అవుతున్నారు. ఇటీవల సీసీ ఫుటేజీలను పరిశీలించి గంజాయి రవాణా చేస్తున్న 30 మంది నిందితులను పట్టుకున్నారు. వరంగల్‌లో 8 మంది, మంచిర్యాలలో ఇద్దరు, నిజామాబాద్‌లో ఇద్దరిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన 12మందిని విచారించగా, 158మంది పేర్లు చెప్పినట్టు సమాచారం. స్టేషన్లలోని ప్లాట్ ఫారాల వద్దే రైళ్లను నిలిపేలా చూస్తూ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల రాకపోకలపై నిఘా పెట్టాలని భావిస్తున్నారు. మరోవైపు హైదరాబాద్, సికింద్రాబాద్, విజయవాడ, కాచిగూడ, కాజీపేట రైల్వేస్టేషన్లలో ఏర్పాటుచేసిన లగేజీ స్కానింగ్ మిషన్లు అలంకారప్రాయంగా మారాయి.

పలుచోట్ల తనిఖీలు.. పలువురి అరెస్ట్

మారేడ్‌పల్లి: పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గురువారం పలుచోట్ల దాడి చేశారు. సికింద్రాబాద్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైల్లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీ చేసి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో 2.5 కిలోల గంజాయిని తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన మీర్జాకలీం అక్తర్‌ను వరంగల్ బస్టాండ్‌లో పట్టుకున్నారు. కుషాయిగూడ శివసాయినగర్‌కు చెందిన రాజపోతు కిరణ్ బైక్‌పై గంజాయి తరలిస్తుండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, అతని వద్ద నుంచి 34 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య తెలిపారు.

ధూల్‌పేటలో వదిన, మరిది అరెస్ట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ధూల్‌పేటలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం గంజాయి విక్రయిస్తున్న వదిన, మరిది అనితాబాయి, సురేందర్‌సింగ్‌ను రిమాండ్‌కు తరలించారు. 16.36కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితురాలు మంజుబాయి పరారీలో ఉన్నది.

గుట్కా తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: భారీగా గుట్కా ప్యాకెట్లను తరలిస్తున్న ముగ్గురిని గురువారం ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకుని ఎల్బీనగర్ పోలీసులకు అప్పగించారు. మారుతీ వ్యాన్‌లో 87,360 గుట్కా ప్యాకెట్లను అబ్దుల్ కలాద్, ఎండీ గౌస్, ఎండీ హుస్సేన్ హైదరాబాద్‌లోని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు ఎల్బీనగర్ మైత్రీనగర్ రోడ్ నంబర్-3లో వీరిని అదుపులోకి తీసుకున్నారు.

జూనియర్ కాలేజీలు కళకళ

ఫీజుల మాఫీ.. ఉచిత పుస్తకాలతో భారీగా ప్రవేశాలు

ఈ ఏడాది 10 వేల పైచిలుకు విద్యార్థుల చేరిక.. నిన్నటితో ముగిసిన అడ్మిషన్ల గడువు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఒకప్పుడు నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా మారిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ప్రస్తుతం కొత్త శోభను సంతరించుకున్నాయి. ఒకప్పుడు విద్యార్థులు చేరాలంటే నాలుగుసార్లు ఆలోచించే రోజుల నుంచి గట్టెక్కి.. భారీగా ప్రవేశాలు పొందిన విద్యార్థులతో నిండుగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గతేడాదితో పోల్చితే ఈ సారి 1,703 మంది విద్యార్థులు అదనంగా చేరారు. జిల్లాలో మొత్తం 22 ప్రభుత్వ జూనియర్ కాలేజీలుండగా, వీటిల్లో గతేడాది 7,836 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. ఈ ఏడాది 9,539 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. 2015 – 16 విద్యాసంవత్సరంలో కేవలం 6,504 మంది మాత్రమే చేరారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియను మూడు దశల్లో చేపట్టగా, ఆగస్టు 10వ తేదీని మూడోదశ అడ్మిషన్లకు తుది గడువుగా నిర్ధారించి ముగించారు.

సత్ఫలితాలనిస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహం

ఇంటర్ విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేయడంతోపాటు



ఫీజు రహితంగా విద్యనందిస్తుండటంతో ప్రభుత్వ కాలేజీలకు విద్యార్థులు క్యూకడుతున్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందే సైన్స్ విద్యార్థులకు రూ.893, ఆర్ట్స్ విద్యార్థులు రూ.530, ఒకేషనల్ విద్యార్థులు రూ.993 ఫీజు మాఫీ కాగా.. పాఠ్యపుస్తకాల కోసం రూ.800 వరకు వెచ్చించాల్సిన అవసరం లేకుండా చేశారు. ఇది పేద విద్యార్థులకు పెద్ద ఉపశమనంగా చెప్పవచ్చు. ప్రభుత్వ చొరవతో నిర్వీర్యమవడానికి సిద్ధంగా ఉన్న కాలేజీలు తాజాగా విద్యార్థుల చేరికతో కళకళలాడుతున్నాయి.

అడ్మిషన్లు పెంచేందుకు శ్రమించాం



ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది పెద్ద ఎత్తున శ్రమించి అడ్మిషన్లు పెంచేందుకు కృషిచేశాం. జిల్లాలో అన్ని కాలేజీల్లో ప్రవేశాలను దాదాపు 10 వేల మార్కు దాటించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కృషికి తగినట్టుగానే అడ్మిషన్ల సంఖ్యను కొంత మేర పెంచగలిగాం. బస్తీలు, కాలనీల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ప్రభుత్వ కాలేజీల్లో చేరితే వచ్చే ప్రయోజనాలను వివరించగలిగాం. కాలేజీల్లో 1980-90 నాటి రోజుల్లో ఉన్న పరిస్థితులు వస్తాయన్న నమ్మకం ఉన్నది. తల్లిదండ్రులు ప్రైవేట్‌కు పరుగులు పెట్టడం మానుకుని సర్కారీ కాలేజీల్లో అందిస్తున్న వసతులు, సౌకర్యాలను ఉపయోగించుకోవాలి.

-చంద్రకళ డీఐఈవో

ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థుల అడ్మిషన్లు

కాలేజీ	2016-17	2017-18	అదనంగాచేరికలు
నాంపల్లి (బాలుర)	224	518	294
సిటీ కళాశాల (వొకేషనల్)	443	709	266
మలక్‌పేట (ఓల్డ్)	295	467	172
అలియా జూనియర్ కళాశాల	252	420	168
గన్‌ఫౌండ్రీ మహబూబియా	235	370	135
వైఎంసీఏ (న్యూ)	424	528	104
ఫలక్‌నుమా(వొకేషనల్)	541	616	75
నాంపల్లి ఎంఏఎం బాలికలు (వొకేషనల్)	759	803	44
విద్యానగర్	65	85	20
మలక్‌పేట (న్యూ)	308	374	66
సికింద్రాబాద్ ఎస్పీరోడ్	374	424	50
చంచల్‌గూడ (వొకేషనల్)	490	518	28
గోల్కొండ బీజేఆర్	380	438	58
కాచిగూడ	387	474	87
మారేడ్‌పల్లి (వొకేషనల్)	691	733	42
హుస్సేనిఆలం	813	853	40
ఫలక్‌నుమా	553	605	52
మైసారం	197	198	01
నాంపల్లి (వొకేషనల్)	405	406	01
మొత్తం	7,836	9,539	1,703

వెస్ట్‌జోన్‌లో పోలీసుల తనిఖీ

■ విదేశీయుల పాస్‌పోర్టు, వీసాల పరిశీలన

■ ముగిసిన 50మంది వీసా గడువు

■ వారి దేశానికి పంపేందుకు చర్యలు



విదేశీయుల పాస్‌పోర్టులను తనిఖీచేస్తున్న అధికారులు

మెహిదీపట్నం: హైదరాబాద్‌లో ఉంటున్న విదేశీయుల నేరాలు పెరిగిపోవడంతో పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. విద్య, ఉపాధి కోసం నైజీరియా, సోమాలియా, సుడాన్ తదితర దేశాల నుంచి వచ్చిన యువత పెడదారి పట్టి నగరంలో డ్రగ్స్ మాఫియాకు కేంద్ర బిందువుగా మారుతున్నది. ఇటీవల బయటపడ్డ డ్రగ్స్ కేసులో వీరు ముఖ్యపాత్ర పోషించారు. నగరంలో మాదకద్రవ్యాలను కూకటివేళ్లతో పెకిలించడానికి కఠినంగా వ్యవహరించాలని పోలీసులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నగర పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి ఆదేశాలతో గురువారం పశ్చిమ మండలం ప్రాంతంలో విదేశీయుల వివరాలను పోలీసులు సేకరించారు. నగరంలో ఎంతమంది విదేశీయులు ఉన్నారు? వారు ఎక్కడెక్కడ నివసిస్తున్నారు? ఏ పనిమీద నగరానికి వచ్చారు? ఇక్కడ ఉండటానికి వారికి వీసా అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎంత గడువు ఉన్నది? తదితర అంశాలపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. నగరంలో ఏ నేరాలు వెలుగులోకి వచ్చినా ముందుగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హుమాయున్‌నగర్, ఆసిఫ్‌నగర్, లంగర్‌హౌస్, గోల్కొండ పోలీస్‌స్టేషన్ల ప్రాంతాలకు లింకు ఉంటుంది. ఈ లింకులతో ఆయా ప్రాంతాలలో విదేశీయులకు సంబంధం ఉన్నదని పోలీసులు చెప్తున్నారు. పశ్చిమ మండలం పరిధిలో 19 దేశాలకు చెందిన 4,063 మంది నివసిస్తున్నారు. వీరిలో చాలామంది మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నం, విజయనగర్‌కాలనీ, హుమాయున్‌నగర్, ఆసిఫ్‌నగర్, పోచమ్మబస్తీ, ఎండీలైన్స్, టోలిచౌకి, షేక్‌పేట్, పారామౌంట్ హిల్స్, హకీంపేటలో నివసిస్తున్నారు. ఇక్కడి చిరునామాలు ఇచ్చి వేరే ప్రాంతాలలో నివసిస్తున్నట్టు కూడా పోలీసుల తనిఖీల్లో వెల్లడైంది. పశ్చిమ మండలం డీసీపీ వెంకటేశ్వరరావు, టాస్క్‌ఫోర్స్ డీసీపీ లింబారెడ్డి ఆధ్వర్యంలో ఎఫ్‌ఆర్‌ఆర్‌వో, ఇమిగ్రేషన్, ఇంటెలిజెన్స్ విభాగాల అధికారులు విదేశీయుల పాస్‌పోర్టులు, వీసాలను తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 50 మంది వరకు వివిధ దేశాలకు చెందినవారి వీసాల గడువు ముగిసినా అక్రమంగా నివసిస్తున్నట్టు బయటపడింది. దీంతో వారిని అదుపులోకి తీసుకొని సొంత దేశాలకు పంపడానికి చర్యలు ప్రారంభించారు.

గ్యాబ్రియల్ జాబితాలో బడాబాబులు?

■ డ్రగ్స్ లింక్‌లు గుర్తించేందుకు పోలీసుల యత్నం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: డ్రగ్స్ ముఠా ప్రధాన సూత్రధారుడు గ్యాబ్రియల్ కాల్ లిస్టులో బడా వ్యాపారులు, సంపన్నుల కుమారుల చిట్టా ఉన్నట్టు తెలుస్తున్నది. గ్యాబ్రియల్ అరెస్టయినట్టు లీకవడంతో అతని అనుచరులు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. దీంతో రాచకొండ పోలీసుల దర్యాప్తుకు బ్రేక్ పడింది. గ్యాబ్రియల్ దొరికినా కీలక సమాచారం రాబట్టడం ఇబ్బందిగా మారింది. గత నెల 23 నుంచి పరారీలో ఉన్న గ్యాబ్రియల్ రెండ్రోజుల కిందట యాప్రాల్‌లోని గ్రీన్‌వుడ్స్ కాలనీలో దొరికాడని విశ్వసనీయ సమాచారం. విచారణలో సహకరించడం లేదని తెలుస్తున్నది. జూన్ 23న అరెస్టయిన సంగీత, కాస్మోస్, జాన్‌పాల్, హెన్రీ, సిరిల్, ఓకోరి తమ విచారణలో ప్రధాన సూత్రధారి గ్యాబ్రియల్ అని చెప్పినట్టు తెలిసింది. అతని ద్వారానే ఈ ముఠా ముంబై, గోవా, చెన్నై నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి నగరంలో దందా చేస్తున్నట్టు నిందితులు వాంగ్మూలం ద్వారా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి పోలీసులు టెక్నాలజీపరంగా ఆధారాలు కూడా సేకరించి వీరి దందా గుట్టు ను నిర్ధారించారు. గ్యాబ్రియల్, అతని ముఠా సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను విశ్లేషించినప్పుడు వందల కాల్ డిటేయిల్స్‌ను పోలీసులు జల్లెడపట్టారు. వారి వాట్సప్ గ్రూపులను పోలీసు అధికారులు శోధించారు. అందులోని కొన్ని నంబర్ల ఆధారంగా డ్రగ్స్ వాడుతున్న పలువురిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. పోలీసులు గ్యాబ్రియల్ అనుచరుల కోసం గాలిస్తున్నారు. గ్యాబ్రియల్ హైదరాబాద్‌లో ఐదేండ్ల నుంచి ఉంటున్నట్టు తెలిసింది. గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అధికారులు డ్రగ్స్ దందాలో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. గ్యాబ్రియల్ అరెస్టును రాచకొండ పోలీసులు అధికారికంగా ధృవీకరించడం లేదు.

ఆఫ్రికన్లపై నజర్

■ నగరశివారులో 19 దేశాల యువకుల నివాసం

■ పోలీసుల సమగ్రసర్వేలో బహిర్గతం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఆఫ్రికా దేశాల నుంచి వచ్చినవారు నగరంలో ఎందరు ఉన్నారనేదానిపై రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్(ఎఫ్‌ఆర్‌ఆర్‌వో) అధికారులతో కలిసి పోలీసులు గురువారం సమగ్ర సర్వే చేపట్టారు. ఎఫ్‌ఆర్‌ఆర్‌వోలో రిజిస్టర్ అయిన వారు ఎంతమంది ఆఫ్రికా దేశాలనుంచి వస్తున్నారని తెలుసుకోవడంపై పోలీసులు దృష్టిసారించారు. డ్రగ్స్ దందాతోపాటు ఆన్‌లైన్ మోసాలు పెరుగుతుండటం, వీసా గడువు ముగిసినా అక్రమంగా ఉంటున్నారనేది వెలుగులోకి రావడంతో సర్వేకు ఉపక్రమించారు. 19 ఆఫ్రికా దేశాల నుంచి వచ్చి నగరంతోపాటు శివారులో నివాసం ఉంటున్నట్టు సర్వేలో వెల్లడైంది. పోలీసులు విదేశీయుల నివాసాలకు చేరుకుని వారి పత్రాలను పరిశీలించారు. పత్రాలు సరిగాలేనివారిని ఎఫ్‌ఆర్‌ఆర్‌వో అధికారులకు అప్పగించారు. ఇందులో ఇద్దరిని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. మరో 150 మంది ఆచూకీ ఉన్నా, సర్వే సమయంలో అందుబాటులో లేకపోవడంతో వారిపై నిఘా పెంచారు. సైబరాబాద్ పరిధిలో 200మంది ఆఫ్రికన్లు ఉంటున్నారు. రాజేంద్రనగర్-70, నార్సింగి-40, కూకట్‌పల్లి-30, గచ్చిబౌలి-10, మియాపూర్-10, చందానగర్-10, అల్వాల్, శామీర్‌పేట-3, పేట్ బషీరాబాద్-3 ఉంటున్నారు. రాచకొండ పరిధిలో 560 మంది ఉంటున్నారు. ఎల్బీనగర్ జోన్‌లో 300, మల్కాజిగిరి జోన్‌లో 200 మంది ఉంటున్నారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ దందాలో కొందరు నైజీరియన్ల పాత్రతో అప్రమత్తమైన అధికారులు విదేశీయుల సమగ్రసర్వేకు శ్రీకారం చుట్టారు. దీంతో వారి వద్ద డాటాబేస్ నిక్షిప్తమైంది. ఆఫ్రికా దేశాలకు చెందిన వారి వివరాల చిట్టా పోలీసుల రికార్డులోకి నమోదైంది.

కేబీఆర్ ఫ్లైఓవర్లకు తొలిగిన అడ్డంకులు

■ రాష్ట్రస్థాయిలోనే నిర్ణయాధికారం

■ తేల్చిన జాతీయ వన్యప్రాణి మండలి

■ తదుపరి చర్యలకు జీహెచ్‌ఎంసీ సమాయత్తం

■ ప్రస్తుతానికి నాలుగు సింగిల్ లెవల్ ఫ్లైఓవర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి ప్రణాళిక(ఎస్ఆర్‌డీపీ)లో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రతిపాదిత నాలుగు ఫ్లైఓవర్ల నిర్మాణానికి అడ్డంకులు తొలిగిపోయాయి. దీనిపై రాష్ట్రస్థాయిలోనే నిర్ణయం తీసుకొని ముందుకుసాగవచ్చని జాతీయ వన్యప్రాణి మండలి తేల్చింది. దీంతో తదుపరి చర్యలు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ సమాయత్తమవుతున్నది. ఎస్ఆర్‌డీపీలో భాగంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కేబీఆర్ పార్క్‌చుట్టూ ఆరు జంక్షన్లపై మల్టీలెవల్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదించి టెండర్లు కూడా ఖరారుచేశారు. ఇందులో పార్క్ ఎంట్రన్స్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, మహారాజా అగ్రసేన్, జూబ్లీహిల్స్ రోడ్ నం-45, ఫిల్మ్‌నగర్, క్యాన్సర్ దవాఖాన తదితర ఆరు జంక్షన్లున్నాయి. అనంతరం కొన్ని కారణాలతో ఫిల్మ్‌నగర్, క్యాన్సర్ దవాఖాన జంక్షన్ల ప్రతిపాదనలను తాత్కాలికంగా పక్కనపెట్టి మిగిలిన నాలుగు జంక్షన్ల వద్ద పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధంచేశారు. ఇందులో భాగంగా ఆయా జంక్షన్ల నుంచి వివిధ మార్గాలకు సాఫీగా వాహనాలు వెళ్లేలా మల్టీలెవల్(మొదటి లెవల్, రెండో లెవల్) ఫ్లైవర్లను డిజైన్‌చేశారు. ఈ పనులు చేపట్టాలంటే అడ్డుగా ఉన్న సుమారు 1,400 చెట్లను తొలిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పనులు చేపట్టే క్రమంలోనే వాటికి వ్యతిరేకంగా గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు దాఖలైంది. కోర్టు స్టే కారణంగా పనులకు బ్రేక్ పడగా, కేంద్రం ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఖరారుచేసిన అనంతరం పనులు చేపట్టేలా ఇటీవల గ్రీన్ ట్రిబ్యూనల్ తుదితీర్పు వెలువరించింది. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు ఎకో సెన్సిటివ్ జోన్‌తో సంబంధం లేకుండా, పార్క్‌ఉనికికి ఎటువంటి భంగం వాటిల్లకుండా రోడ్డుకు సమాంతరంగా నిర్మించే నాలుగు సింగిల్ లెవల్ ఫ్లైఓవర్లను మాత్రమే చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రణాళికలు కూడా సిద్ధంచేశారు. వీటికి కూడా కొన్ని చెట్లు అడ్డుగా ఉండడంతో వాటిని ట్రాన్స్‌లొకేట్ చేయాల్సి ఉన్నది.

రాష్ట్రస్థాయిలోనే నిర్ణయం

రాష్ట్ర వన్యప్రాణి మండలి గత నెలలో కేబీఆర్ పార్క్‌చుట్టూ జంక్షన్ల వద్ద ప్రతిపాదిత ఫ్లైఓవర్ల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ తీర్మానించింది. ఈ తీర్మానాన్ని కేంద్ర వన్యప్రాణి మండలి ఆమోదం కోసం పంపించింది. గత నెల 29న కేంద్ర వన్యప్రాణి మండలి స్థాయిసంఘం సమావేశం జరుగగా, అందులోని నిర్ణయాలను బుధవారం రాష్ట్ర అటవీశాఖకు పంపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర వన్యప్రాణి మండలి పంపిన తీర్మానానికి తమ అనుమతి అవసరంలేదని, ఇందులో తమ పాత్ర ఎంతమాత్రం ఉండదని స్పష్టంచేస్తూ రాష్ట్రస్థాయిలోనే నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది. కాలుష్యం పెరుగకుండా పార్క్‌లో సాధ్యమైనంతమేరకు చెట్లను పెంచాల్సిన బాధ్యత సంబంధిత ఏజెన్సీ(జీహెచ్‌ఎంసీ)దేనని స్పష్టంచేసింది. ప్రస్తుత పార్క్‌లోని జాగింగ్ ట్రాక్‌కు ఇరువైపులా పచ్చదనంతోకూడిన అందాలను యథావిధిగా కొనసాగించాలని, పార్క్‌లో గాలి నాణ్యతను సూచించే ఎల్ఈడీ సైన్‌బోర్డులను ఏర్పాటుచేయాలని సూచించింది.

త్వరలోనే ఫ్లైఓవర్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభం

కేబీఆర్ పార్క్‌చుట్టూ ఫ్లైఓవర్ల నిర్మాణానికి అడ్డంకులు తొలిగిపోవడంతో త్వరలోనే పనులు చేపడుతామని జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్(ప్రాజెక్టులు) శ్రీధర్ స్పష్టంచేశారు. అనుమతుల అధికారం రాష్ట్ర వన్యప్రాణి మండలికే ఉన్నదని కేంద్ర వన్యప్రాణి మండలి స్థాయిసంఘం స్పష్టంచేసిందని, రాష్ట్ర వన్యప్రాణి మండలి ఇదివరకే ఫ్లైఓవర్ల నిర్మాణానికి అనుమతిస్తూ తీర్మానం చేసినందున ఇక పనులు చేపట్టడమే తరువాయి అని చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర అటవీశాఖ తమకు లిఖితపూర్వకంగా అనుమతి ఇస్తే పనులు చేపడుతామని, టెండర్లు ఇదివరకే ఖరారైనందున ఎటువంటి జాప్యం జరుగదన్నారు. రాష్ట్ర అటవీశాఖనుంచి అనుమతులు రాగానే చెట్లను ట్రాన్స్‌లొకేషన్ చేసి ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు చేపడుతామని వివరించారు.

ఎకో సెన్సిటివ్ జోన్ ఖరారయ్యాకే మిగిలినవి

పార్క్‌ల చుట్టూ ఎంతమేరకు ఎకో సెన్సిటివ్ జోన్ ఉండాలో కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఖరారుచేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఇంతవరకు అది ఖరారుచేయనిపక్షంలో చుట్టూ పది కిలోమీటర్ల వరకు ఎకో సెన్సిటివ్ జోన్‌గా భావిస్తారు. ఈ జోన్ పరిధిలో ముఖ్యంగా పరిశ్రమల స్థాపన, మైన్స్ తవ్వకాలు తదితరవాటిపై నిషేధం ఉన్నది. ఫ్లైఓవర్ల నిర్మాణానికి ఎటువంటి ఇబ్బందీలేదు. ఈ నేపథ్యంలో కేబీఆర్ పార్క్‌చుట్టూ ఎకో సెన్సిటివ్ జోన్‌ను మూడు నుంచి 28 మీటర్ల వరకు నిర్ధారించాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ ప్రతిపాదించింది. చెన్నైలోని ఓ పార్క్‌కు గతంలో జీరో ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఖరారుచేసినట్లు అధికారులు ఉదహరిస్తున్నారు. ఇది ఖరారైతే మిగిలిన ఫ్లైఓవర్లను నిర్మించే వీలు కలుగుతుంది. ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఖరారుచేసేందుకు సుదీర్ఘ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. ముందుగా కలెక్టర్ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ జారీచేసి ప్రజాభిప్రాయం తీసుకున్నాక రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. ఆ నివేదికను ప్రభుత్వం కేంద్రానికి నివేదిస్తే కేంద్ర అటవీ, పర్యావరణశాఖ నిర్ణయం తీసుకుంటుంది. ఇందుకు ఏడాది సమయం పడుతుందని అధికారులు వివరించారు. ఆ తర్వాతే మిగిలిన ఫ్లైఓవర్లు నిర్మించే ఆస్కారం ఉన్నదన్నారు. ప్రస్తుతానికి నాలుగు జంక్షన్లలో సింగిల్ లెవల్ ఫ్లైఓవర్లు నిర్మించనున్నట్టు వివరించారు.



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్

డ్రగ్స్‌ను మీరే తరిమికొట్టాలి

■ విద్యార్థులకు అకున్ సబర్వాల్ పిలుపు

కేపీహెచ్‌బీ కాలనీ: విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దని, తోటి విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కాకుండా బాధ్యత తీసుకోవాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూహెచ్‌లో బాలానగర్ ఎక్సైజ్ పోలీస్, జేఎన్‌టీయూహెచ్ సంయుక్తంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి అకున్ సబర్వాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో గంజాయిని నిరోధించగలిగామని, డ్రగ్స్ మహమ్మారిని కూడా తరిమికొట్టాలని విద్యార్థులకు సూచించారు. చదువుకోవాల్సిన విద్యార్థులు డ్రగ్స్‌ను తీసుకోవద్దని, తోటి విద్యార్థులు డ్రగ్స్ బారిన పడితే అధ్యాపకులకు లేదా వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్నేహితుడి చెడు అలవాట్లను మాన్పించడానికి తోటివారు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఎన్ యాదయ్య, డిప్యూటీ కమిషనర్ యాసిన్ ఖురేషి, మేడ్చల్ సూపరింటెండెంట్ గణేశ్, న్యూరో సైకాలజిస్ట్ జార్జ్‌రెడ్డి, అధ్యాపకులు తులసీరాందాసు, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుమలాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక్కడే పరుగెత్తాడు..


మక్వాలా

లండన్: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఓ అరుదైన సంఘటన చోటు చేసుకుంది. పురుషుల 200 మీటర్ల రేసులో బోట్స్‌వానా స్ప్రింటర్ ఇసాక్ మక్వాలా ఒంటరిగా పరుగెత్తి సెమీస్‌కు అర్హత సాధించాడు. వివరాల్లోకి వెళ్తే.. షెడ్యూల్ ప్రకారం సోమవారం నిర్వహించిన హీట్స్-5లో మక్వాలా బరిలోకి దిగాల్సి ఉంది. కానీ నోరోవైరస్ కారణంగా అతను గ్యాస్ట్రోఎంటరైటిస్‌కు గురయ్యాడు. దీంతో రేసు నుంచి వైదొలిగాడు. చాలా మంది అథ్లెట్లు ఈ వైరస్‌కు గురికావడంతో అందర్నీ ఓ హోటల్‌లో ఉంచి వైద్య చికిత్స అందిస్తున్న నిర్వాహకులు 48 గంటలు అబ్జర్వేషన్‌లో పెట్టారు. అయితే మక్వాలా అబ్జర్వేషన్ సమయం బుధవారం మధ్యాహ్నం 2 గంటల (స్థానిక కాలమానం ప్రకారం)కు పూర్తికావడంతో అతను ఫిట్‌గా ఉన్నాడని డాక్టర్లు సర్టిఫికెట్ ఇచ్చారు. వెంటనే బోట్స్‌వానా సమాఖ్య ఈ విషయాన్ని చాంపియన్‌షిప్ నిర్వాహకుల దృష్టికి తీసుకురావడంతో రేసును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సెమీస్‌కు అర్హత సాధించాలంటే ఈ రేసును 20.53 సెకన్ల టైమింగ్‌లో పూర్తి చేయాలని మక్వాలాకు లక్ష్యాన్ని నిర్దేశించారు. హీట్స్‌లో తనకు కేటాయించిన ఏడో నంబర్ లైన్‌లో ఒంటరిగా పరుగెత్తిన అతను 20.20 సెకన్లలో రేసును ముగించాడు. గురువారం జరిగిన సెమీస్‌లో మక్వాలా 20.14 సెకన్ల టైమింగ్‌తో ఫైనల్స్‌కు అర్హత సాధించాడు.

నిరాశపర్చిన లక్ష్మణ్



పురుషుల 5 వేల మీటర్ల రేసులో భారత అథ్లెట్ గోవిందన్ లక్ష్మణ్ వ్యక్తిగత బెస్ట్‌ను సవరించినా.. ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయాడు. తొలి రౌండ్ హీట్స్‌లో బరిలోకి దిగిన లక్ష్మణ్ 13ని. 35.69 సెకన్లలో రేసును పూర్తి చేసి 13వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. గతంలో తన వ్యక్తిగత బెస్ట్ 13ని.36.62 సెకన్ల టైమింగ్‌ను సవరించాడు. ఓవరాల్‌గా ఐదు హీట్స్ ముగిసేసరికి భారత అథ్లెట్ 31వ స్థానంలో నిలిచాడు.

డబ్బులిస్తేనే మంచి జట్టును ఎంపిక చేస్తారా: మదన్‌లాల్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్ల సెలెక్టర్లకు రూ. 15 లక్షల నగదు పురస్కారం ఇవ్వడాన్ని మాజీ ఆల్‌రౌండర్ మదన్‌లాల్ తప్పుబట్టాడు. డబ్బులిస్తేనే మంచి జట్లు ఎంపిక చేస్తారా? అని ప్రశ్నించాడు. ఈ విషయంలో పరిపాలన కమిటీ, బీసీసీఐ వ్యవహరిస్తున్న తీరును ఆయన విమర్శించాడు. 'సెలెక్టర్లకు క్యాష్ అవార్డును చూసి ఆశ్చర్యానికి గురయ్యా. సెలెక్టర్లు మంచి జట్టును ఎంపిక చేయరా? వాళ్లు ఉన్నదే అందుకు కదా. ఎప్పుడైనా మంచి జట్టును ఎంపిక చేయాలనే ప్రయత్నిస్తారు. కానీ బీసీసీఐ తీరులోనే తప్పుంది' అని లాల్ పేర్కొన్నాడు. సెలెక్టర్లందరూ బోర్డు నుంచి మంచి జీతాలు తీసుకుంటున్నారన్నాడు. మరోవైపు లాల్ వ్యాఖ్యలపై బీసీసీఐ అధికారి ఒకరు స్పందించాడు. జట్టు మంచి ప్రదర్శన చూపెట్టినప్పుడు అందులో సెలెక్టర్లను భాగం చేయడం ఆనవాయితీగా వస్తుందన్నాడు.



స్పోర్ట్స్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి సెలెక్షన్స్

శామీర్‌పేట, నమస్తే తెలంగాణ: మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి ఎంపికకు రాష్ట్ర స్థాయి సెలెక్షన్స్ నిర్వహించారు. గురువారం నల్లగొండ, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, రంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 178 మంది విద్యార్థులకు 800 మీటర్ల రన్నింగ్, మెడికల్ టెస్టులు నిర్వహించినట్లు స్కూల్ వోఎస్‌డీ డాక్టర్ నర్సయ్య తెలిపారు. ఎంపిక ప్రక్రియను సాట్స్ డిప్యూటీ డైరెక్టర్ శోభ, విమలాకర్‌రావులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌టీ.ప్రకాశ్, స్పోర్ట్స్ అధికారి ఆర్.కె.బోస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగా ఉంటేనే అందమా?


ముకుంద్

న్యూఢిల్లీ: తనపై సోషల్ మీడియాలో వస్తున్న వర్ణ వివక్ష వ్యాఖ్యలపై భారత ఓపెనర్ అభినవ్ ముకుంద్ దీటుగా సమాధానమిచ్చాడు. ఎర్రగా ఉన్న వాళ్లే అందంగా ఉంటారా అంటూ ట్విట్టర్ వేదికగా లేఖాస్త్రం సంధించాడు. 'నేను రాస్తున్న ఈ లేఖ ఏదో సానుభూతి కోసమో, లేక ఎవరి దృష్టి మరల్చడానికో కాదు. వర్ణ వివక్షపై మనుషుల మనస్సులు మారుతాయేమోనని ఆశించి రాస్తున్నా. టోర్నీల నిమిత్తం 15 ఏండ్ల వయస్సు నుంచి దేశంలోని వేర్వేరు ప్రాంతాలతో పాటు పలు దేశాల్లో పర్యటించాను. క్రికెటర్ ప్రతి రోజు ఎండలో ఆడుతుంటారనే విషయం ఆటను ఫాలో అయ్యే ప్రతి ఒక్కరికి తెలుసు. ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి గాను అలా గంటల పాటు శ్రమించాను. దేశంలో అత్యంత వేడిగా ఉండే ప్రదేశాల్లో ఒకటైన చెన్నై నుంచి వచ్చిన నేను దాదాపు యుక్త వయస్సు అంతా మైదానంలోనే గడిపాను. గతంలో నా రంగుపై కొందరు మాట్లాడినా..స్పందించలేదు. కానీ ఇప్పుడు నాకోసం కాదు, నాలాగా వివక్ష ఎదుర్కొంటున్న అందరి కోసం మాట్లాడాలనుకున్న' అని ముకుంద్ అన్నాడు. ఇదిలా ఉంటే వర్ణ వివక్షపై ముకుంద్‌కు కెప్టెన్ కోహ్లీ, అశ్విన్, హార్దిక్ పాండ్యా, షట్లర్ గుత్తా జ్వాల మద్దతుగా నిలిచారు.

భారత్ @ 97

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య(ఫిఫా) గురువారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ ఓ ర్యాంక్‌ను కోల్పోయింది. గత నెలలో అత్యుత్తమ ర్యాంక్ అందుకున్న భారత సాకర్ టీమ్ ప్రస్తుతం 97వ ర్యాంక్‌లో నిలిచింది. పాయింట్ల(341) పరంగా ఎలాంటి తేడా లేకపోయినప్పటికీ ఈ మధ్య కాలంలో అంతర్జాతీయ టోర్నీలు లేకపోవడం టీమ్‌ఇండియా ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపింది. దీనికి తోడు ఇటీవలి కాన్‌కాఫ్ గోల్డ్ కప్‌లో అద్భుతంగా రాణించిన కెనడా ఐదు ర్యాంక్‌లు ఎగబాకి 95వ ర్యాంక్‌లో నిలువడం మరో కారణమైంది. ఇదిలా ఉంటే ఓవరాల్‌గా నంబర్ వన్ ర్యాంక్‌లో బ్రెజిల్ ఉంటే ఆ తర్వాత ర్యాంక్‌ల్లో జర్మనీ, అర్జెంటీనా, స్విట్జర్లాండ్, పోలండ్ ఉన్నాయి.

శ్రీశాంత్ తీర్పును సవాలు చేయనున్న బీసీసీఐ



న్యూఢిల్లీ: కేరళ పేసర్ శ్రీశాంత్‌పై జీవితకాల నిషేధాన్ని ఎత్తివేసేందుకు బీసీసీఐ ఇష్టపడటం లేదు. నిషేధాన్ని ఎత్తివేయాలని కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేసేందుకు సిద్ధమవుతున్నది. ఈ మేరకు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేయాలని నిర్ణయించింది. 'కేరళ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును బీసీసీఐ న్యాయ బృందం పరిశీలించింది. సహజ సూత్రాల ప్రకారం ఈ కేసులో డివిజన్ బెంచ్‌కు వెళ్లే వెసులుబాటు మాకు ఉంది. కాబట్టి ఈ తీర్పును మేం సవాలు చేయాలని అనుకుంటున్నాం' అని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే.. అవినీతికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని చెప్పేందుకే బీసీసీఐ ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. మొత్తానికి దేశవాళీ క్రికెట్‌లో బరిలోకి దిగాలని భావిస్తున్న శ్రీశాంత్‌కు మరోసారి మొండిచెయ్యి ఎదురుకానుంది.

15వ ర్యాంక్‌లో ప్రణయ్



న్యూఢిల్లీ: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య(బీడబ్ల్యూఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో భారత షట్లర్ ప్రణయ్ 15వ ర్యాంక్‌లో నిలిచాడు. గత నెలలో యూఎస్ ఓపెన్ టైటిల్‌తో పాటు న్యూజిలాండ్ గ్రాండ్‌ప్రి టోర్నీలో క్వార్టర్స్ చేరుకున్న ప్రణయ్ రెండు ర్యాంక్‌లు మెరుగుపర్చుకున్నాడు. మరోవైపు సౌరభ్ వర్మ ఐదు ర్యాంక్‌లు ఎగబాకి 32వ ర్యాంక్‌లో నిలువగా, కశ్యప్ 46వ ర్యాంక్‌లో ఉన్నాడు. ఇక వరుస టైటిల్ విజయాలతో ఆకట్టుకున్న కిడాంబి శ్రీకాంత్..ప్రస్తుతం 8వ ర్యాంక్‌లో ఉన్నాడు. మహిళల ర్యాంకింగ్స్‌లో సింధు, సైనా వరుసగా 5, 16 ర్యాంక్‌లో ఉన్నారు. డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, సిక్కి రెడ్డి జోడి 25వ ర్యాంక్‌లో ఉన్నది.

లోక్‌సభలో క్రీడా యూనివర్సిటీ బిల్లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన దేశంలోనే మొదటి క్రీడా యూనివర్సిటీ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. మణిపూర్‌లో ఏర్పాటు చేయబోతున్న క్రీడా విశ్వవిద్యాలయానికి సంబంధించిన బిల్లు గురువారం లోక్‌సభ ముందుకు వచ్చింది. పార్లమెంటరీ వ్యవహారాల సహాయమంత్రి ఎస్ఎస్ అహ్లువాలియా ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఇందులో ప్రస్తుతం కొన్ని విశ్వవిద్యాలయాలు అమలు చేస్తున్న కోర్సుల కంటే పూర్తిస్థాయిలో క్రీడలకు సంబంధించి సైన్స్, టెక్నాలజీ, హై పెర్ఫార్మెన్స్ ట్రైనింగ్ లాంటివి ఉన్నాయి.

అశ్విన్, జడేజాకు విశ్రాంతి!




13న వన్డే జట్టు ఎంపిక.. టీమ్‌ఇండియా ఫుల్ ప్రాక్టీస్

రాబోయే రోజుల్లో భారత్‌లో కీలకమైన సిరీస్‌లు ఉండటం, బౌలర్లపై పనిభారం పెరుగుతుండటంతో లంకతో పరిమిత ఓవర్ల సిరీస్‌కు కొన్ని మార్పులు చేయాలని సెలెక్టర్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు ముగ్గురు కీలక ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి కుర్రాళ్లను పరీక్షించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు ఇప్పటికే టెస్టు సిరీస్‌ను చేజిక్కించుకున్న టీమ్‌ఇండియా క్లీన్‌స్వీప్‌పై దృష్టిపెట్టింది. ఈ నేపథ్యంలో మూడో టెస్టు కోసం ప్రాక్టీస్ జోరును పెంచింది.

క్యాండీ: భారత స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా.. లంకతో పరిమిత ఓవర్ల సిరీస్‌కు దూరం కానున్నట్లు సమాచారం. టెస్టు సిరీస్‌లో ఈ ఇద్దరు అధికంగా బౌలింగ్ భారాన్ని మోయడంతో విశ్రాంతి ఇవ్వాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పేసర్ మహ్మద్ షమీకి కూడా విశ్రాంతి ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఈనెల 20 నుంచి జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లో భారత్.. లంకతో ఐదు వన్డేలు, ఏకైక టీ20 మ్యాచ్ ఆడనుంది. ప్రస్తుతం క్యాండీలోనే ఉన్న చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్, దక్షిణాఫ్రికాలో ఉన్న మరో సెలెక్టర్ దేవాంగ్ గాంధీ ఆటగాళ్ల ప్రదర్శన, పరిస్థితిని అంచనా వేస్తున్నారు. మూడో సెలెక్టర్ శరణ్‌దీప్ సింగ్‌తో కలిసి ఈ ఇద్దరు 13న వన్డే జట్టును ఎంపిక చేయనున్నారు. సస్పెన్షన్‌తో జడేజా మూడో టెస్టుకు దూరంకాగా, అశ్విన్ ఇప్పటికే 150 ఓవర్ల దాకా బౌలింగ్ చేసి అలసిపోయి ఉన్నాడు. దీంతో వన్డే సిరీస్, టీ20కి యజువేంద్ర చాహల్, అక్షర్ పటేల్, క్రునాల్ పాండ్యా, బుమ్రాకు అవకాశం కల్పించాలని సెలెక్టర్లు సిద్ధమవుతున్నారు.


అశ్విన్


జడేజా

విరాట్‌పైనా దృష్టి..

మరోవైపు కెప్టెన్ విరాట్ కోహ్లీకి కూడా పరిమిత ఓవర్ల సిరీస్‌కు విశ్రాంతి ఇస్తే ఎలా ఉంటుందని సెలెక్టర్లు ఆలోచిస్తున్నట్లు బోర్డు వర్గాల సమాచారం. గత 12 నెలల నుంచి అతను నాన్‌స్టాప్ క్రికెట్ ఆడుతుండటంతో ప్రత్యామ్నాయం చూడాలని భావిస్తున్నారు. భారత్ ఆడిన గత 43 మ్యాచ్‌లో విరాట్ భుజం గాయం కారణంగా ఒకే ఒక్క మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు. ఇది మినహా అతను ప్రతి ఫార్మాట్‌లో బరిలోకి దిగాడు. లంక టూర్ ముగిసిన తర్వాత స్వదేశంలో భారత్‌కు బిజీ షెడ్యూల్ ఉంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, లంకతో వన్డే సిరీస్‌లు ఆడాల్సి ఉంది. కొత్త ఏడాదిలో కీలకమైన దక్షిణాఫ్రికా పర్యటన ఉండటంతో కెప్టెన్‌ను ఫిట్‌గా ఉంచాలని బోర్డు భావిస్తున్నది. ఒకవేళ విరాట్‌కు విశ్రాంతి ఇస్తే.. రోహిత్ శర్మకు సారథ్య పగ్గాలు అప్పగించే అవకాశాలున్నాయి.

చెమటోడ్చిన టీమ్‌ఇండియా..

రేపటి నుంచి మూడో టెస్టు జరుగనున్న నేపథ్యంలో విరాట్‌సేన నెట్స్‌లో తీవ్రంగా చెమటోడ్చింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో గంటలకొద్ది ప్రాక్టీస్ చేసింది. అందరికంటే ముందుగా నెట్ ప్రాక్టీస్ చేసిన విరాట్.. ఆ తర్వాత ఎక్కువగా స్లిప్ క్యాచ్‌లపై దృష్టిపెట్టాడు. ఈ సిరీస్‌లో ఒకటి రెండుసార్లు షార్ప్ క్యాచ్‌లను వదిలేయడంతో అది పునరావృతం కావొద్దనే ఉద్దేశంలో ఫిట్‌నెస్ ట్రెయినర్ శంకర్ బసుతో కలిసి ప్రాక్టీస్ చేశాడు. ఇక మిగతా బ్యాట్స్‌మెన్ వరుసగా బ్యాటింగ్‌కు పదును పెట్టుకున్నారు. శుక్రవారం అప్షనల్ ప్రాక్టీస్ కావడంతో బౌలర్లకు పూర్తిగా విశ్రాంతి ఇవ్వాలని కోచ్ నిర్ణయించాడు. దీంతో ఉమేశ్, ఇషాంత్, సహాయక సిబ్బందితో కలిసి విరాట్.. 'శ్రీ సీతాయ్ అమ్మన్ దేవాలయాన్ని' సందర్శించేందుకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. మరోవైపు దక్షిణాఫ్రికా నుంచి బయలు దేరిన స్పిన్నర్ అక్షర్ పటేల్ గురువారం రాత్రికి జట్టుతో కలువనున్నాడు.

షూటింగ్‌తో బిజీ..

అప్పటి వరకు నెట్స్‌లో తీవ్రంగా కసరత్తులు చేసిన భారత బృందం.. ఆ తర్వాత రిలాక్స్ మోడ్‌లోకి వెళ్లిపోయింది. కొంత మంది సభ్యులు తమ వాణిజ్య ప్రకటనల షూటింగ్‌తో బిజీగా గడుపగా, మరికొంత మంది స్విమ్మింగ్‌పూల్‌లో సేద తీరారు.

మురళీధరన్ మిస్..

లంకలో ప్రఖ్యాత హిల్ స్టేషన్‌కు పెట్టింది పేరైన క్యాండీకి మరో ఘనత కూడా ఉంది. ప్రపంచ క్రికెట్‌కు టాప్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్‌ను అందించిన ప్రదేశం ఇది. టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఈ మాజీ బౌలింగ్ దిగ్గజం.. భారత్‌తో మూడో టెస్టును ప్రత్యక్షంగా వీక్షించేందుకు అందుబాటులో ఉండటం లేదు. శుక్రవారం సింగపూర్‌లో జరిగే టీ20 సిరీస్ కోసం మురళీ అక్కడి వెళ్తున్నాడు.

జైపూర్ జిగేల్

ప్రొ కబడ్డీ 5వ సీజన్‌లో తొలి విజయం




నాగ్‌పూర్: మంజీత్ చిల్లార్, జస్వీర్ సింగ్ చెలరేగడంతో ప్రొ కబడ్డీ ఐదోసీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ అద్భుత విజయం సాధించింది. గురువారం మన్‌కాపూర్ ఇండోర్ స్టేడియంలో పుణెరి పల్టాన్ జట్టుతో జరిగిన జోనల్ ఏ మ్యాచ్‌లో 30-28 పాయింట్లతో నెగ్గింది. దీంతో ఈ సీజన్‌లో రెండో మ్యాచ్ ఆడిన జైపూర్ తొలి విజయంతో బోణీ కొట్టింది. ఇరుజట్లు కూడా ఈ సీజన్‌లో ఫేవరెట్ హోదాతో బరిలోకి దిగగా మ్యాచ్ ఆసాంతం హోరాహోరీగా సాగింది. ఇరు జట్లు తొలి నిమిషాల్లోనే ఖాతా తెరిచాయి. తుషార్ పాటిల్ జైపూర్ జట్టుకు పాయింట్ అందించగా.. పల్టాన్ జట్టుకు దీపక్ హుడా తొలి పాయింట్ అందించాడు. మూడో నిమిషంలో ట్యాకిల్ పాయింట్ సాధించిన పల్టాన్ జట్టు 3-1తో ఆధిక్యం సంపాదించింది. అదే ఊపుతో ఐదో నిమిషంలో 5-2తో మ్యాచ్‌ను చేతుల్లోకి తీసుకున్నట్లుగా కనిపించింది. ఈ దశలో జైపూర్ జట్టు ఎదురుదాడికి దిగింది. ఈ దశలో రోహిత్ కుమార్‌కు గ్రీన్‌కార్డ్ చూపడంతో జైపూర్ జట్టు తొలుత 6-6తో స్కోరు సమం చేసింది. అనంతరం 15 నిమిషాల్లో 9-9తో పల్టాన్‌ను నిలువరించడంలో విజయం సాధించిన జైపూర్ జట్టుకు ప్రథమార్ధం ముగిసేసమయంలో సంతపన సెల్వమ్ మూడు ట్యాకిల్ పాయింట్లతో 14-11 స్కోరుతో ఆధిక్యం అందించి పెట్టాడు. రెండో అర్ధ భాగం ప్రారంభంలోనే పల్టాన్ జట్టును ఆలౌట్ చేసిన జైపూర్ జట్టు 17-11తో పూర్తి ఆధిపత్యాన్ని సాధించింది. ఇదే ఊపులో రెండుసార్లు రైడింగ్‌లో హిట్టైన జైపూర్ జట్టు ఆధిక్యాన్ని 20-13కు చేర్చింది. 27వ నిమిషానికి 23-15 తో ఆధిక్యం కొనసాగిస్తున్న జైపూర్ జట్టును సందీప్ నర్వాల్ కాస్త బెదరగొట్టాడు. ఒకేసారి మూడు పాయింట్లు సాధించి ఆధిక్యాన్ని 18-23కి తగ్గించాడు. కానీ మంజీత్ చిల్లార్ ఇటు రైడింగ్‌లోనూ అటు ట్యాకిలింగ్‌లోనూ రాణించి 30-28 పాయింట్లతో జట్టుకు విజయాన్నందించాడు. కెప్టెన్ మంజీత్ చిల్లార్ 9 రైడింగ్ పాయింట్లు సాధించగా..జస్వీర్ సింగ్ 5, తుషార్ పాటిల్ 4 పాయింట్లతో చెలరేగడంతో పుణెరి జట్టు పరాజయం పాలైంది. పల్టాన్ జట్టులో స్టార్ రైడర్ సందీప్ నర్వాల్ 9, రోహిత్ కుమార్ 4, రవికుమార్ 3 పాయింట్లు సాధించారు. రైడింగ్‌లో పుణెరి పల్టాన్ 18 పాయింట్లతో ఆధిక్యం చాటగా.. 8 ట్యాకిల్ పాయింట్లు, 2 ఎక్స్‌ట్రా పాయింట్లు సాధించగా.. విజేత జైపూర్ జట్టు రైడింగ్‌లో 12, ట్యాకిలింగ్‌లో 12, ఆలౌట్ పాయింట్లు 2..ఎక్స్‌ట్రా పాయింట్లు 4 తో ఆల్‌రౌండ్ ఆటతీరును ప్రదర్శించి రెండు కీలక విజయం నమోదు చేసింది.

తమిళ్ తలైవాస్ బోణీ

జోన్ బీలో భాగంగా బెంగళూరు బుల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ అదిరిపోయే ఆటతీరుతో ఈ టోర్నీలో తొలి విజయాన్ని అందుకుంది. ఐదో సీజన్‌లో అరంగేట్రం చేసిన తమిళ్ జట్టు మూడో మ్యాచ్‌లో 29-24 పాయింట్లతో బుల్స్ జట్టుపై సూపర్ విక్టరీ సాధించింది. ఈ మ్యాచ్‌లో బెంగళూరు జట్టు 15 రైడింగ్, 6 ట్యాకిల్, 2 ఆలౌట్, 1 ఎక్స్‌ట్రా పాయింట్ సాధించగా...తమిళ్ జట్టు 16 రైడింగ్, 10 ట్యాకిల్, 2 ఆలౌట్, 1 ఎక్స్‌ట్రా పాయింట్ సాధించి పై చేయి చాటుకుంది. తలైవాస్ జట్టులో ప్రపంజన్ 6, అమిత్ హుడా 4, ప్రదీప్ 3, అరుణ్ 2 పాయింట్లు సాధించగా.. బెంగళూరు స్టార్ రైడర్ రోహిత్ కుమార్ 12 రైడింగ్ పాయింట్లు సాధించినా జట్టుకు విజయాన్నందించడంలో విఫలమయ్యాడు.


క్రీడల్లో పరిపాలన వైఫల్యం వల్లే..

ఆటగాళ్లు విఫలమవడానికి కారణమన్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ: క్రీడల్లో పరిపాలన వైఫల్యానికి తోడు ప్రొఫెషనలిజం లోపించడం వల్ల మన ఆటగాళ్లు స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరుచలేకపోతున్నారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. గురువారం లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు క్రీడా మంత్రి విజయ్ గోయల్‌కు బదులుగా కిరణ్ సమాధానమిచ్చారు. 'క్రీడల్లో పరిపాలన వైఫల్యం, సరైన ప్రొఫెషనలిజం లేకపోవడం, దేశవాళీ పోటీల నిర్మాణం లోపించడం, ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించకపోవడం, అభివృద్ధికి సుదీర్ఘ ప్రణాళిక లేకపోవడం వంటి కారణాల వల్లే ఆటగాళ్లు రాణించలేకపోతున్నారు. దీనికి తోడు పాఠశాల, కాలేజీ, విశ్వవిద్యాలయ స్థాయిలో చదువుతో పాటు క్రీడలను కలిపి కొనసాగించలేకపోతున్నాం. అంతేగాక హై పెర్ఫార్మెన్స్ కోచ్‌లు, సహాయక సిబ్బంది, క్రీడా సైన్స్, మెడిసిన్ వంటి వాటిలో నిపుణుల కొరత వేధిస్తున్నది' అని రిజిజు అన్నారు. ఇదిలా ఉంటే దేశంలో మొదటిసారి క్రీడలకు ప్రత్యేకంగా ఓ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే యోచనలో కేంద్ర ప్రభుత్వమున్నదని మంత్రి పేర్కొన్నారు. అలాగే జాతీయ క్రీడల అభివృద్ధి కోడ్ 2011 కింద మరిన్ని క్రీడా అకాడమీలు నెలకొల్పుతున్నామని ఆయన సభకు తెలిపారు.

రెండోరౌండ్‌లో ఫెదరర్, నాదల్


ఫెదరర్


నాదల్

మాంట్రియల్: తగినంత విశ్రాంతి తీసుకుంటూ ఎంపిక చేసుకున్న టోర్నీలలోనే ఆడుతున్న స్విట్జర్లాండ్ టెన్నిస్ స్టార్ రోజర్ ఫెదరర్ ఏటీపీ మాంట్రియల్ మాస్టర్స్ టోర్నీలో శుభారంభం చేశాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియా, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్స్ సాధించిన ఫెదరర్ 36 ఏండ్ల వయసులోనూ కోర్టులో తనకు ఎదురేలేనట్లుగా చెలరేగాడు. గురువారం జరిగిన తొలిరౌండ్ మ్యాచ్‌లో కెనడాకు చెందిన 116వ ర్యాంకర్ పీటర్ పొలాన్‌స్కీని 6-2, 6-1 స్కోరుతో కేవలం 53 నిమిషాల్లోనే వరుస సెట్లలో చిత్తు చేసి రెండోరౌండ్‌కు దూసుకెళ్లాడు. కాగా స్పెయిన్ టెన్నిస్ ఆటగాడు రఫెల్ నాదల్ కూడా అలవోకగా రెండోరౌండ్‌కు దూసుకెళ్లాడు. క్రొయేషియాకు చెందిన యంగ్‌గన్ బోర్నా కోరిక్ 6-1,6-2 స్కోరుతో వరుస సెట్లలో నెగ్గాడు. గాయం కారణంగా ప్రపంచ నంబర్‌వన్ , గ్రేట్ బ్రిటన్ టెన్నిస్ ఆటగాడు ఆండీ ముర్రే ఈ టోర్నీకి గైర్హాజరుతో అతని ర్యాంక్ ప్రమాదంలో పడింది. ఈ టోర్నీలో నాదల్ సెమీస్ చేరుకుంటే ఏటీపీ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్ స్థానాన్ని కైవసం చేసుకోనున్నాడు. ఫ్రాన్స్ ఆశాకిరణం గేల్ మోన్‌ఫిల్స్ వరుసగా నాలుగు మ్యాచ్ పాయింట్లు కాచుకుని మరీ 6-7(4-7), 7-5,7-6(8-6)స్కోరుతో జపాన్‌కు చెందిన ప్రపంచ ఐదోసీడ్ కీ నిషికోరిని కంగుతినిపించాడు. స్పెయిన్‌కు చెందిన డేవిడ్ ఫెర్రర్ 7-6(9-7), 3-6, 6-1 స్కోరుతో 15వ సీడ్ జాక్‌సాక్‌ను ఓడించాడు.

పోరాడి ఓడిన భారత్

న్యూఢిల్లీ: యూరప్ పర్యటనలో భారత హాకీ జట్టుకు సరైన శుభారంభం దక్కలేదు. తమ తొలి మ్యాచ్‌లో భారత్ 0-1 తేడాతో బెల్జియంపై పోరాడి ఓడింది. మన్‌ప్రీత్‌సింగ్ సారథ్యంలో బరిలోకి దిగిన అంతగా అనుభవం లేని భారత్..బెల్జియంకు దీటైన పోటీనిచ్చింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో మొదటి మూడు క్వార్టర్లలో ఎలాంటి గోల్ నమోదు కాలేదు. ఆఖరిదైన నాలుగో క్వార్టర్ ఆఖరి నిమిషంలో టామ్ బూన్(60ని) చేసిన గోల్‌తో బెల్జియం గెలిచింది. ఈ మ్యాచ్‌లో భారత్ ఆరుగురు కొత్త ఆటగాళ్లకు అవకాశం కల్పించింది.

దావూద్ ఉన్నది కరాచీలోనే!

బయటపెట్టిన సీఎన్ఎన్-న్యూస్ 18



న్యూఢిల్లీ: మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం పాకిస్థాన్‌లోనే ఉన్నాడని, అతనికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని సీఎన్ఎన్-న్యూస్18 వార్తాసంస్థ తెలిపింది. రెండు నెలల క్రితం నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ వివరాలను గురువారం తెలిపింది. మీడియా ప్రతినిధి నేరుగా కరాచీలో ఉన్న దావూద్‌తో టెలిఫోన్‌లో సంభాషించారు. తనతో మాట్లాడిన వ్యక్తి స్వరం దావూద్‌దేనని తరువాత ధ్రువీకరించారు. తమ సంవాదాన్ని బట్టి దావూద్.. షేక్ ఇస్మాయిల్ మర్చంట్ అనే మారు పేరుతో డీ 13, బ్లాక్ 4, క్లిఫ్టన్, కరాచీలో ఉన్నాడని సీఎన్ఎన్ తెలిపింది. ఆయనకు స్వల్ప రక్తపోటు తప్ప గ్యాంగ్రిన్, గుండెజబ్బు వంటి వ్యాధులు లేవని పేర్కొన్నది. తన మాఫియా ముఠా ద్వారా దుబాయ్ నుండి వ్యాపారాలు కొనసాగిస్తున్నాడని తెలిపింది. తొలుత కొద్దిసేపు ఫోన్‌లో మాట్లాడిన దావూద్ ఆ తరువాత తన అనుచరుడు జావెద్ చొటానీతో మాట్లాడించాడని తెలిపింది. 1993లో 257 మంది మృతికి కారణమైన ముంబై పేలుళ్ల వెనుక ప్రధాన సూత్రధారిగా ఉన్న దావూద్ పాక్‌లో తలదాచుకున్నట్టు భారత్ అనేక సంవత్సరాలుగా చెప్తున్నది. ఐక్యరాజ్య సమితి సైతం దావూద్‌పై అంతర్జాతీయ ఉగ్రవాదిగా ముద్ర వేసింది. అయితే పాక్ మాత్రం దావూద్ తమ దేశంలో లేడని ఇప్పటికీ బుకాయిస్తున్నది.

పాక్ 'మదర్ థెరెసా' కన్నుమూత



కరాచీ/ ఇస్లామాబాద్: పాకిస్థాన్ మదర్ థెరెసాగా పేరొందిన జర్మనీ సంతతి వైద్యురాలు డాక్టర్ రూథ్ క్యాతరీనా మార్థా(87) గురువారం కరాచీలోని ప్రైవేట్ దవాఖానలో మరణించారు. వయస్సు పైబడిన కారణంగా సుదీర్ఘ కాలంగా ఆమె అనారోగ్యంతో ఉన్నారు. తొలిసారి 1960లో తన 29వ ఏట పాకిస్థాన్‌ను సందర్శించిన రూథ్ కుష్ఠు వ్యాధిగ్రస్తుల బాధలతో చలించిపోయారు. వారికి వైద్య సేవలందించేందుకు పాకిస్థాన్‌లోనే ఉండిపోయారు. 1962లో కరాచీలో మేరీ అడిలైడ్ కుష్ఠు నివారణ కేంద్రం స్థాపించారు. తర్వాత దేశంలోని అన్ని రాష్ట్రాల్లో శాఖలు ప్రారంభించి, 50 వేలకు పైగా కుటుంబాలకు వైద్యసేవలందించారు. అవిశ్రాంతంగా ఆమె అందించిన సేవలను గుర్తించి.. 'కుష్ఠు వ్యాధి రహిత పాక్' అని 1996లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించింది. రూథ్ మృతి పట్ల పాక్ ప్రధాని షాహీద్ ఖాఖాన్ అబ్బాసీ సంతాపం తెలిపారు. అమె భౌతికకాయానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు.

రెండ్రోజుల పోలీసు కస్టడీకి వికాస్ బరాల



చండీగఢ్: ఐఏఎస్ కూతురును కారులో వెంటపడిన కేసులో హర్యానా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ బరాల కుమారుడు వికాస్ బరాల, అతని స్నేహితుడు ఆశీష్‌కుమార్‌కు గురువారం కోర్టు రెండ్రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఈ నెల 12 వరకు పోలీసుల కస్టడీకి ఇస్తున్నట్లు సివిల్ జడ్జి బర్జీందర్ పాల్ సింగ్ తెలిపారు. ఐఏఎస్ కూతురిని కారులో వెంబడించిన ఘటనపై దేశవ్యాప్తంగా దుమారం చెలరేగడంతో పోలీసులు విశాస్, ఆశీష్‌ను 365, 511 నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద అరెస్ట్‌చేశారు. ఈ సెక్షన్ల కింద యావజ్జీవ జైలు శిక్ష పడే అవకాశం ఉన్నది.

'370' ఆర్టికల్‌కు వీడ్కోలు చెప్పాలి: బీజేపీ కశ్మీర్ నేత

జమ్ము, ఆగస్టు 10: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తూ రాజ్యాంగంలో ఏర్పాటుచేసిన 370వ అధికరణానికి వీడ్కోలు పలుకాల్సిన సమయం వచ్చిందని ఆ రాష్ట్ర బీజేపీ శాఖ పేర్కొన్నది. దాంతోపాటు 35ఏ అధికరణానికి గుడ్ బై చెప్పాల్సిన సమయం ఇదేనని బీజేపీ జమ్ముకశ్మీర్ శాఖ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ వీరేందర్ గుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 370, 35ఏ అధికరణాల వల్ల కశ్మీరీలకు లబ్ది చేకూరలేదన్నారు.

రుతుస్రావం సమయంలో మహిళలను వెలివేయడం నేరం

బిల్లుకు నేపాల్ పార్లమెంట్ ఏకగ్రీవ ఆమోదం

ఖాట్మండు, ఆగస్టు 10: రుతుస్రావం సమయంలో మహిళలను వేరుగా ఉంచడాన్ని నేరంగా పరిగణించే బిల్లుకు నేపాల్ పార్లమెంట్ బుధవారం ఆమోదం తెలిపింది. రుతుస్రావం, ప్రసవానంతర ససమయాల్లో 'ఛౌపడి' అనే దురాచారాన్ని పాటించడం, మహిళల పట్ల అస్పృశ్యత, వివక్ష చూపడం వంటి అమానవీయ చర్యలను నిషేధిస్తూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. చట్టాన్ని అతిక్రమించి ఎవరైనా ఈ దురాచారాన్ని పాటిస్తే మూడు నెలల జైలుశిక్ష లేదా రూ.3వేలు జరిమానా విధిస్తారు. నేరం తీవ్రతను బట్టి రెండూ విధించవచ్చు. నేపాల్‌లోని అనేక హిందూ సమాజాలు, గిరిజన ప్రాంతాల్లో మహిళలను రుతుస్రావం, ప్రసవానంతర సమయాల్లో ఇంటికి దూరంగా గుడిసెలో ఉంచే ఆచారం అమలులో ఉంది. దీనిని 'ఛౌపడి' అని పిలుస్తారు. ఈ సమయంలో వారు ఇంటికి దూరంగా 'చౌగోత్' అనే గుడిసెలో పడుకోవాలి. ఆహారాన్ని, మతపరమైన చిహ్నాలను, పశువులను, పురుషులను తాకడం నిషేధం. ఈ ఆచారంవల్ల అనేక మంది బాలికలు, స్త్రీలు మృతి చెందుతున్నారని మహిళా హక్కుల కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్వామ్‌పై దాడికి స్కెచ్ వేస్తున్నాం

మరోసారి అమెరికాను రెచ్చగొట్టిన ఉత్తరకొరియా

సియోల్, ఆగస్టు 10: జపాన్‌కు సమీపంలోని అమెరికా భూభాగమైన గ్వామ్ దీవిపై ఈ నెలలో దాడి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని ఉత్తరకొరియా గురువారం తెలిపింది. గ్వామ్ దీవిపై నాలుగు మధ్యతరహా క్షిపణులతో దాడి చేసేందుకు ప్రణాళికలను పూర్తి చేస్తున్నామని ఉత్తర కొరియా సైనిక జనరల్ కిమ్ రాక్ గ్యోమ్‌ను ఉటంకిస్తూ ఆ దేశ అధికార వార్తా సంస్థ కేసీఎన్ఏ పేర్కొన్నది. ఉత్తరకొరియా సైన్యం మరో నాలుగైదు రోజుల్లో దాడికి ప్రణాళికను సిద్ధం చేసి అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్ ఆదేశాల కోసం ఎదురుచూస్తుందని తెలిపింది. మిలిటరీ రూపొందించిన ప్రణాళిక ప్రకారం క్షిపణులు గ్వామ్ దీవికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో పడుతాయని తెలిపింది.